లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక

# జనబలం

ప్రజలే ప్రభువులు

ఆగస్టు 2020

రూ.10/-









## 'సదవకాశంగా కోవిడ్ సంక్షోభం'పై ఎఫ్‌డీఆర్ వెబినార్ సిరీస్

## ప్రభుత్వాల నిర్వాకం వల్లే ప్రజలకు కరోనా కష్టాలు




## కరోనాని మించిన సంక్షోభం



## తెలుగుతేజం భారతరత్నం మన కర్తవ్యం

## సరిగ్గా అమలు చేస్తే పిల్లలందరికీ మెరుగైన భవిష్యత్తునిచ్చే జాతీయ విద్యా విధానం-2020


JUST WITH AN EXPENDITURE OF
2% OF GDP, HEALTH CARE FOR ALL IN INDIA
- LOKSATTA PROPOSES TO NITI AYOG.
#ACCESSIBLE #AFFORDABLE #EFFECTIVE
& can create 1 Crore jobs
Dr.Jayaprakash Narayan, Founder, NGO Loksatta
#Family doctor system in villages ,integration of community hospitals and private nursing homes in towns,Tertialry care for big health issues. Read full presentation:
www.fdrindia.org


రైతుకి కేజీ కూరగాయల మీద 3 , 4 రూ॥ కు మించి రాదు.
కానీ మనం అదే కేజీ ని 30- 40 రూ॥ కి కొంటున్నాము.
మనం కనుక గ్రేడింగ్ , స్టోరేజి , రవాణా , ప్రాసెసింగ్ లాంటివి మెరుగు పరిస్తే ఆధునిక వ్యవస్థలో లక్షల మందికి ఉపాధి దొరుకుతుంది .
రైతు బాగుపడతాడు. వినియోగదారుడు బాగుపడతాడు.

ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక


సంపుటి 23 సంచిక 8

ఆగస్టు 2020



సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్

దూసనపూడి సోమసుందర్


## జనబలం చందా రుసుము వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

## చందాదారులకు విజ్ఞప్తి

చాలా మంది చందా గడువు ముగిసినా జనబలం పత్రికను మీకు ప్రతీనెలా పంపుతున్నాము.అట్టివారు తప్పక తమ చందాను వెంటనే పునరుద్ధరించుకోగోరుతున్నాము. చందా డబ్బును Foundation for democratic reforms పేరున జనబలం కార్యాలయంనకు పంపగలరు.

## లోపలి పేజీల్లో...


06 కరోనాని మించిన సంక్షోభం

08 తెలుగుతేజం.. భారతరత్నం.. మన కర్తవ్యం!

17 ప్రభుత్వాల నిర్వాకం వల్లే ప్రజలకు కరోనా కష్టాలు

31 న్యాయ సంస్కరణలు రావాలి!



కార్యాలయ చిరునామా : తులిప్స్ అపార్ట్‌మెంట్స్ 6-3-655, ఫ్లాట్ నెం 407, సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక, సోమాజిగూడ, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288

Email: janabalam.loksatta@gmail.com, loksattaudyamasamstha@gmail.com

## కార్టూన్ కార్నర్



..ఇద్దరూ కాదంటే ఇతరులకు
చాన్సుంటుందా..!

## జనబలంలో ప్రకటన రేట్లు



| | |
|---|---|
| కలర్‌పేజీ: | 10,000 |
| ఇన్‌సైడ్‌పేజీ బ్లాక్ అండ్ వైట్ : | 5,000 |
| ఫుల్‌పేజీ బ్లాక్ అండ్ వైట్ : | 2,000 |
| సగం పేజీ బ్లాక్ అండ్ వైట్: | 1,000 |

ప్రకటన రుసుము, ప్రకటనకు సంబంధించిన ఫొటోలు, సమాచారం ప్రతినెలా 20వ తేదీ లోపుగా మాకు అందేలా పంపించగలరు. చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను

**చిరునామా: సంపాదకుడు, జనబలం, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక,**
*తులిప్స్ అపార్ట్‌మెంట్స్, 6-3-655, ఫ్లాట్ నెం 407, సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక,*
*సోమాజిగూడ, హైదరాబాద్-500 082*

# స్వప్నాలను ఆవిష్కరించిన నూతన విద్యా విధానం

నూతన విద్యా విధానం-2020 విధాన పత్రానికి కేంద్రమంత్రి మండలి జూలై 29వ తేదీన ఆమోద ముద్ర వేసింది. దీనిని అమలు చేయడానికి ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు చాలా ఉన్నాయి. కొన్ని చట్టాలను చేయాల్సి ఉంటుంది. మరికొన్ని చట్టాలను మార్చాల్సి ఉంటుంది. నియమనిబంధనలను రూపొందించాల్సి ఉంటుంది. బడ్జెట్‌లో నిధులను కేటాయించాల్సి ఉంటుంది. అమలును నిరంతరం పర్యవేక్షించాల్సి ఉంటుంది. విధానపత్రం దానంతట అది చట్టంకాదు. ప్రభుత్వాల చిత్తశుద్ధిని అమలులో మాత్రమే అంచనా వేయగలం! అంతవరకూ నూతన విద్యావిధానం 'స్వప్నాలను ఆవిష్కరించే సంకల్ప పత్రం' మాత్రమే!

ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో విద్యకు అత్యంత కీలక ప్రాముఖ్యం ఉంది. దానిపై సంతకందారుగా ఉన్న భారత్ విద్యను సమకాలీన అవసరాలకు, శాస్త్ర , సాంకేతిక రంగ మార్పులకు అనుగుణంగా పునర్నిర్మాణం చేసుకోవాల్సిన అవసరం ఉంది. పునర్నవీకరణ, పునర్నిర్మాణం అనేవి నిరంతర ప్రక్రియలు. వీటికి పాలకులు ఇవ్వాల్సినంత ప్రాధాన్యం ఎప్పుడూ ఇవ్వకుండా అవసరాలు మీదకొచ్చి పడినప్పుడు తాత్కాలిక చర్యలకే పరిమితమవుతూ వచ్చారు. సిఫార్సులు, సలహాలు ఎన్నో ఉన్నాయి. అమలు మాత్రం అంతంతమాత్రమే!

నూతన విద్యా విధాన రూపకల్పన కోసం ఇస్రో మాజీ చైర్మన్ కె. కస్తూరి రంగన్ నేతృత్వంలో ఒక నిపుణుల కమిటీని కేంద్ర ప్రభుత్వం 2017 జూన్‌లో నియమించింది. 2019 జూన్‌లో కమిటీ తన ముసాయిదా నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. 2020 జూలై 29న కేంద్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. 'విభిన్న ఆలోచనా స్రవంతులకు చెందిన మేధావుల, నిపుణుల, భాగస్వామ్య పక్షాల అభిప్రాయాలను, సలహాలను సూచనలను స్వీకరించామని డా. కస్తూరి రంగన్ చెప్పారు. కానీ, ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యారంగంలో ఒక విధానాన్ని రూపొందించే ముందు రాష్ట్రాలను సంప్రదించలేదన్న విమర్శలో వాస్తవం ఉంది. అమలు ప్రక్రియల సందర్భంలోనయినా దీనిపై విస్తృత చర్చ చేపట్టాల్సిన అవసరం ఉంది.

నూతన విద్యా విధానం లక్ష్యాలలో విద్య సార్వత్రీకరణ, అందరికీ అందుబాటులోకి తేవడం, తల్లిదండ్రుల స్తోమతకు తగిన స్థాయిలో విద్యను అందించడం, విద్యా నాణ్యత, మాతృభాషలో విద్యా బోధనకు ప్రోత్సాహం, సంస్కృతీ సంప్రదాయాలు, మానవ విలువల పెంపుదల, విద్యార్థుల్లో విశ్లేషణాత్మక సామర్థ్యాల పెంపుదల, సిలబస్ భారం కుదింపు, పరీక్షల ఒత్తిడి తగ్గింపు, శ్రమ సంస్కృతితో విద్యార్థులను అనుసంధానం చేయడం వంటి అంశాలు అనేకం ఉన్నాయి. ఇంత వరకూ 10+2+3గా ఉన్న విద్యార్జనా క్రమాన్ని 5+3+3+4 గా మార్చాలని కొత్త విధానం ప్రతిపాదించింది. పూర్వ ప్రాథమిక విద్యను, ప్రాథమిక విద్యను కలిపి పిల్లలను పాఠశాలకు 'సన్నద్ధం' చేసే రీతిలో బోధిస్తారు. ఆ తర్వాత మాధ్యమిక విద్య ఉంటుంది. ఆ తర్వాత సెకండరీ విద్యలో ఒకేషనల్ స్రవంతిని ప్రవేశపెడతారు. కళాశాల విద్యలో ఇంతకాలమూ కొనసాగుతూ వచ్చిన సైన్సు, కామర్స్, ఆర్ట్స్ వంటి స్రవంతులు దృఢ చట్రంలో ఉన్నాయి. వాటిని సరళతరం చేసి విద్యార్థులు తమకు నచ్చిన అంశాలను ఎంచుకునే బహుళ అంశాల మిశ్రమ పద్ధతిని ప్రవేశపెట్టాలని సంకల్పించారు. మూడేళ్ల డిగ్రీ కోర్సు పూర్తి చేసిన వారికే పట్టా ఇచ్చే పద్ధతిని కూడా మార్చి విద్యార్థులు ఏ దశలో చదువుకున్నా వారి స్థాయికి తగిన ఉత్తీర్ణతా పత్రాన్ని అందించే పద్ధతిని ప్రతిపాదించారు. విద్యార్థులు క్రెడిట్స్‌ను దాచుకుని తర్వాతి కాలంలో చదువుకొనసాగించిన సందర్భంలో వినియోగించుకునే విధానాన్ని ప్రవేశపెడతారు. ప్రతిజిల్లాలో బాలభవన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి విద్యార్థుల అభిరుచుల మేరకు ఇతర సబ్జెక్టులను నేర్చుకునే అవకాశాన్ని ఇస్తారు. లైబ్రరీలను పెద్దస్థాయిలో ఏర్పాటు చేస్తారు.

ఉన్నత విద్యలో కళాశాలలకు స్వయం ప్రతిపత్తి ఇస్తారు. విదేశీ విశ్వవిద్యాలయాలు తమ క్యాంపస్‌లను మనదేశంలో నెలకొల్పుకునేందుకు అనుమతి ఇస్తారు. యూజీసీ, ఏఐసీటీఈ వంటి వేర్వేరు సంస్థలను రద్దు చేసి ఒకే కేంద్రీకృత నియంత్రణా వ్యవస్థ పరిధిలోకి తెస్తారు. ఉపాధ్యాయ విద్యను నాలుగేళ్ల బీఈడి కోర్సుగా మారుస్తారు. శిక్షా మిత్ర, విద్యావలంటీరు, గెస్ట్ టీచర్ వంటి కాంట్రాక్టు ఉపాధ్యాయ వ్యవస్థను రద్దు చేసి శాశ్వత ప్రాతిపదికన ఉపాధ్యాయులను నియమించాలని ప్రతిపాదించారు. సిలబస్ భారాన్ని తగ్గించాలని, పరీక్షల ఒత్తిడిని నివారించాలని అందుకోసం స్వీయ మూల్యాంకనం, సహచర విద్యార్థుల మూల్యాంకనం, ఉపాధ్యాయుల మూల్యాంకనం పైనే విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేయాలని ప్రతిపాదించారు.

1968 దౌలత్‌సింగ్ కొఠారీ కమిషన్, 1986 నాటి నూతన విద్యా విధానం, 1990 నాటి ప్రొఫెసర్ రామమూర్తి కమిటీ, 1993 నాటి యశ్‌పాల్ కమిటీ, 2011లో సుప్రీంకోర్టు నియమించిన జస్టిస్ జె.ఎస్. వర్మ కమిటీ నివేదికలు చెప్పిన అంశాలన్నీ కస్తూరి రంగన్ కమిటీ నివేదికలో పదాల మార్పుతో దర్శనమిస్తున్నాయి. విద్య సార్వత్రీకరణ, త్రిభాషా సూత్రం, మాతృభాషలో ప్రాథమిక విద్య, బరువులేని, ఒత్తిడి లేని విద్య, శ్రమ సంస్కృతి పట్ల గౌరవం, సంస్కృతం సహా విదేశీ భాషల అధ్యయనం, సంస్కృతీ, జాతీయ సమగ్రతల పరిరక్షణ వంటి భావనలన్నీ పాత నివేదికలలో వున్నవే.

జీడీపీలో 6% నిధులను విద్యారంగానికి కేటాయించాలన్న సిఫార్సు కొఠారీ కమిషన్ నాటిది. ప్రస్తుతం భారత ప్రభుత్వం 3.1% మాత్రమే కేటాయిస్తోంది. అలాగేప్రభుత్వ వ్యయంలో పదిశాతంలోపే ఉంటున్నది. నూతన విద్యా విధానంలో ప్రతపాదించిన అన్ని అంశాలనూ అమలు చేయడానికి మౌలిక సదుపాయాల కల్పన భారీస్థాయిలో చేయాలి. ఉపాధ్యాయ నియామకాలు పెద్దఎత్తున చేపట్టాలి. దానికి నిధులు పెద్ద ఎత్తున అవసరం అవుతాయి.

విద్యారంగంలో ప్రైవేటీకరణ, వాణిజ్యీకరణ ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయి. విద్యారంగం ఒక మాఫియా అవతారం ఎత్తుతోందన్న విమర్శలు పెరుగుతున్నాయి. దానికితోడు కేంద్ర ప్రభుత్వం విద్యను కేంద్రీకృతం చేయడం ద్వారా పెత్తనం పెరుగుతుందన్న భయాందోళనలున్నాయి.

సంస్కృతం, సంస్కృతీ సంప్రదాయాలు వంటి మాటలు సిలబస్ కుదింపు స్వభావంపై సందేహాలు వంటివి విద్య కాషాయీకరణ ప్రయత్నాలకు దారితీస్తాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వ ధార్మిక విశ్వాసాలు, మతాన్ని రాజకీయాలకు వినియోగించే పద్ధతి తెలిసిన వారంతా అలా అనుమానించడంలో ఆశ్చర్యం లేదు. కానీ కొఠారీ కమిషన్ నాటి ఆలోచనలను మించి కస్తూరి రంగన్ కమిటీ ముందుకు వెళ్ళలేదు. కాబట్టి అదో పెద్ద సమస్య కాకపోవచ్చు. పతాకశీర్షికల పట్ల పాలకులకున్న అత్యుత్సాహమే అసలు సమస్య. హడావుడి, ఆర్భాటం చేసి ఫలితాల గురించి పట్టింపు లేని ఒక ధోరణి మోదీ ప్రభుత్వ ప్రత్యేక లక్షణం, నూతన విద్యా విధానం అందుకు మినహాయింపు అవుతుందా?!

డి. సోమసుందర్

..: శిరమని నరేష్

# కరోనాని మించిన సంక్షోభం

కరోనా వైరస్ దెబ్బకి ప్రపంచం మొత్తం సంక్షోభంలోకి నెట్టబడింది. మార్చి, ఏప్రిల్ నెలల్లో తీవ్ర ప్రాణ నష్టాన్ని చూసిన దేశాలు క్రమేణా కోలుకున్నాయి. ఇప్పుడు భారీ ప్రాణనష్టం అయితే జరగడం లేదు. మన భారతీయుల శరీర తత్త్వం, మలేరియా ప్రభావం ఎక్కువగా ఉండడం, ఆహార అలవాట్లు ఇలా కారణాలు ఏవైనా కరోనా వల్ల మన దేశంలో మనం మార్చిలో భయపడిన స్థాయిలో అయితే ప్రాణాలు పోలేదు. అది మన అదృష్టం. అయితే, కరోనా వల్ల మన దేశంలో జననష్టం కన్నా, ఆర్థిక నష్టం తీవ్రంగా ఉంది. ఈ నష్టానికి పూర్తి బాధ్యత మన రాజకీయ వ్యవస్థదే.

మన దేశంలో రాజకీయ పార్టీలు ఎన్నికల మెషిన్లుగా మారి పోయాయి. ఎన్నికల్లో గెలవడం మాత్రమే పార్టీల పరమావధిగా మారింది. రాజ్యాధికారం దక్కించుకోవడం రాజకీయ పార్టీల ప్రధాన మార్గంగా ఉండాలే తప్ప అదే అంతిమలక్ష్యంగా ఉండకూడదు. మన దురదృష్టంకొద్దీ, పార్టీలు అధికారమే లక్ష్యంగా పనిచేస్తున్నాయి. దీనితో అనేక పెడధోరణులు మన పాలనా వ్యవస్థలో చోటు చేసుకున్నాయి.



### కేంద్రీకృత పాలన:

మనది పేరుకి పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అయినప్పటికీ, రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు, జాతీయ స్థాయిలో లోక్‌సభ ఎన్నికలు ముఖ్యమంత్రి లేదా ప్రధానమంత్రి అభ్యర్థి ఎవరు అనే దాని ఆధారంగా జరుగుతున్నాయి. అంటే అధ్యక్ష తరహా పద్ధతిలోకి మనం వెళ్లిపోయాం. అందుకే రాష్ట్రంలో కానీ, కేంద్రంలో కానీ ఒక వ్యక్తి చుట్టూ పాలన నడుస్తోంది. మంత్రులు దాదాపు డమ్మీలుగా మారిపోయారు. దీని ఫలితం మనం ఈ కరోనా సంబంధిత నిర్ణయాల్లో చూస్తున్నాం. కరోనా గురించి ప్రపంచానికి జనవరి ఆఖరులో తెలిసింది. మన దేశానికి కూడా అప్పుడే తెలిసింది. అప్పుడే మనం విదేశాల నుండి ప్రయాణాలు నిషేధించడం కానీ, విదేశాల నుండి వచ్చినవారిని క్వారంటైన్ చేయడం కానీ చేయలేదు. అలా చేసి ఉంటే ఈ వైరస్ దేశమంతా వ్యాపించి ఉండేది కాదు. జనవరి 26న ప్రపంచ ఆరోగ్య సంస్థ "కోవిడ్ 19 ప్రభావం తీవ్రంగా ఉండొచ్చు" అని ప్రకటించింది. మార్చి 11న డబ్ల్యూ.హెచ్.ఓ కోవిడ్-19ను ప్యాండమిక్ అని ప్రకటించింది. కానీ మన దేశంలో జనవరి 26 నుండి మార్చి 20 వరకు ఈ మహమ్మారిని ఎదుర్కొనేందుకు ఎలాంటి సన్నాహక చర్యలు మన ప్రభుత్వాలు చేపట్టలేదు. దీనికి కారణం, మన పాలన మొత్తం ఒకే వ్యక్తి కేంద్రంగా జరుగుతుండడం. ఫిబ్రవరి 22 వరకు ప్రధాని మోదీ దృష్టంతా అహ్మదాబాద్‌లో నిర్వహించే 'నమస్తే ట్రంప్' పైనే ఉండడంతో, పాలనా యంత్రాంగం కూడా అదే పనిలో ఉండిపోయింది. మన దేశానికి ఒక ఆరోగ్యమంత్రి ఉన్నారని, ఆయన పేరు హర్షవర్ధన్ అని ఇప్పటికీ దేశంలో కోట్లాదిమందికి తెలియదు. చాలామంది ఆరోగ్యశాఖ సంయుక్త కార్యదర్శి లవ్ అగర్వాల్‌నే ఆరోగ్యమంత్రిగా పొరబడ్డారు. ఇక ఆంధ్రప్రదేశ్‌లో కూడా అంతే. కరోనా ప్రబలిన వారం పదిరోజులకి కానీ ఆరోగ్యమంత్రి ఆళ్ళ నాని ప్రజల ముందుకు రాలేదు. ఇక తెలంగాణలో కూడా పేరుకి ఆరోగ్యమంత్రి ఈటల రాజేందర్ ఉన్నారు కానీ, ఆయనకు కూడా నిర్ణయాధికారం ఉన్నట్లు లేదు. ఇలా పాలన మొత్తం ఒకరి చేతిలో ఉండడం వల్ల నిర్ణయాలు ఆలస్యం అవుతున్నాయి.

### దీర్ఘకాల దృష్టి లేకపోవడం:

మన పార్టీల ప్రాధాన్యత ఎప్పటి కప్పుడు ఎన్నికలు గెలవడమే కావడంతో, ప్రభుత్వాల దగ్గర ఉండే పరిమిత వనరులతో ఆరోగ్య రంగాన్ని సంస్కరించడం, బలోపేతం చేయడం లాంటి దీర్ఘకాలిక లక్ష్యాలను పట్టించుకోకుండా ఎన్నికల్లో ఓట్లు తెచ్చే ఆరోగ్యశ్రీ, సిఎం రిలీఫ్ ఫండ్, ఆయుష్మాన్ భారత్ లాంటి జనాకర్షక పథకాలకే ప్రాముఖ్యత ఇస్తున్నాయి. దీనితో మన ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలు బలహీనపడి పోయాయి. వెంటిలేటర్లు లాంటి కనీస పరికరాలు సమకూర్చుకోవడానికి, పిపిఈ కిట్స్‌లాంటి కనీస అవసరాలు తీర్చడానికి మనకు 3 నెలలు పట్టింది. ఇప్పటికీ అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ సౌకర్యాలు లేవు. ఫలితంగా ఇప్పుడు కరోనా సోకినవారు, కార్పొరేట్ ఆసుపత్రుల్ని ఆశ్రయించాల్సిన పరిస్థితి. ప్రజల్లో ఉన్న ఈ కరోనా భయాన్ని ఇప్పుడు కార్పొరేట్ హాస్పిటల్స్ సొమ్ము చేసుకుంటున్నాయి. కరోనా వైద్యం కోసం ఆస్తులు అమ్ముకోవాల్సిన దుస్థితి ఇప్పుడు దాపురించింది.

### పాలనలో అసమర్థత:

అందరికీ అన్ని విషయాలు తెలియాల్సిన అవసరం, తెలిసే అవకాశం ఉండదు. మన పాలనలో ప్రధాని లేదా ముఖ్యమంత్రి తమకి నచ్చిందే చేస్తారు తప్ప ఎలాంటి ప్రజాస్వామిక చర్చ

ఉండడం లేదు. మంత్రులుగా ఉన్నవారు, నిర్మొహమాటంగా తమ అభిప్రాయాలు వెల్లడిస్తే తమ పదవి పోతుంది అనే భయంతో మంత్రివర్గ సమావేశాల్లో కూడా నోరు మెదపడం లేదు. దీనితో ప్రభుత్వాధినేత మనసుకి నచ్చిన అధికారులే పాలసీలు నిర్ణయిస్తున్నారు. ఈ అధికారులకి క్షేత్రస్థాయిలో సంబంధాలు తెగిపోయి దశాబ్దాలు అయి ఉంటుంది. అందుకే మన పాలనా విధానాలు అస్తవ్యస్తంగా ఉంటున్నాయి. ఎంతో ఆలోచించి నిర్ణయం తీసుకున్న నోట్లరద్దు విషయంలో కానీ, ఏమీ ఆలోచించకుండా తీసుకున్న లాక్‌డౌన్ విషయంలో కానీ, పూటకో నిబంధన మారుస్తూ, అప్పుడు ఆర్థిక శాఖ, ఇప్పుడు ఆరోగ్య శాఖ నవ్వులపాలు అయ్యాయి.

వలస కార్మికుల విషయాన్నే తీసుకోండి.. లాక్‌డౌన్ విధిస్తే ఎన్ని కోట్లమంది కూలీలు కార్మికులు ఇబ్బంది పడతారు, వారిని ఏ విధంగా ఆదుకోవాలి అనే దానిపై ప్రభుత్వానికి ఏ స్థాయిలోనూ అవగాహన ఉన్నట్లు కనిపించలేదు. లక్షలాదిమంది వలస కార్మికులు నడుచుకుంటూ స్వరాష్ట్రాలకు వెళ్ళడం ప్రారంభించాక కూడా ప్రభుత్వం కళ్ళు తెరవలేదు. ఆఖరికి ప్రజా వత్తిడికి తలొగ్గి అరాకొరా రైళ్ళు ఏర్పాటు చేసినా, వాటికి చార్జి ఎంత ఉండాలి, ఎవరు భరించాలి అనే దానిపై ఎంత గందరగోళం జరిగిందో చూసాం.



## చట్టసభల వైఫల్యం:

మనం పార్టీ సమావేశాల్లో కానీ, చట్టసభల్లో కానీ ఒక అర్థవంతమైన చర్చ చూసి ఎన్నేళ్ళు అయింది? పార్టీ మహాసభల్లో తీర్మానాలు కానీ, చట్టసభల్లో చట్టాలు కానీ ఎలాంటి చర్చ లేకుండానే ఆమోదం పొందుతుండడం మనం చూస్తున్నాం. లక్షల కోట్ల బడ్జెట్‌పై కూడా రాజకీయ రచ్చ తప్ప, చర్చ ఉండడం లేదు. పార్టీ సమావేశాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తే పార్టీ అధినేత కన్నెర్ర చేస్తారనే భయం, చట్టసభల్లో పార్టీ వైఖరికి వ్యతిరేకంగా మాట్లాడితే ప్రభుత్వాధినేతకు కోపం వస్తుందనే భయం.

## బొమ్మల్లాగా మిగిలిన స్థానిక ప్రభుత్వాలు:

కరోనా సంక్షోభాన్నే ఉదాహరణగా చూస్తే, అత్యధిక కేసులు మహానగరాలలోనే వచ్చాయి. అన్ని మహానగరాలకి ఎన్నికైనా మేయర్లు, కార్పొరేటర్లు ఉన్నారు. కానీ, కరోనా నియంత్రణ చర్యల్లో ఈ స్థానిక ప్రభుత్వాల ప్రజాప్రతినిధులు చురుకైన పాత్ర పోషించడం మనం చూశామా? తమ కార్పొరేటర్ పేరు ఎంతమంది నగర పౌరులకి తెలుసు? ఇల్లు కట్టుకునే వారి దగ్గర చాలామంది కార్పొరేటర్లు మామూళ్ళు వసూలు చేస్తారు కాబట్టి, కొత్తగా ఇల్లు కట్టుకున్నవారికి వాళ్ళ పేర్లు తెలుసేమో. కరోనా ప్రబలిన తర్వాత ఒక ప్రెస్ మీట్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, స్థానిక ప్రజాప్రతినిధులు అంతా ఏమయ్యారు? ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలకు సేవ చేయడం మీ బాధ్యత కాదా అని ప్రశ్నిస్తే, నాలుగు రోజులు హడావుడి చేశారు. ఆ తర్వాత సైలెంట్ అయిపోయారు. ప్రజలకి ఏమైనా చేయాలని తపన ఉన్నా కూడా స్థానిక ప్రభుత్వాలకి అధికారం లేకపోవడంతో ఏమీ చేయలేని పరిస్థితి.

## ఎన్నికల వ్యవస్థ:

మన చట్టసభలు చట్టుబండలు కావడానికి మన ఎన్నికల వ్యవస్థ కూడా ఒక కారణం. ఫస్ట్ పాస్ట్ ద పోస్ట్ (ఎఫ్‌పిటిపి) ఎన్నికల పద్ధతి వల్ల, ప్రతి అసెంబ్లీ/లోక్‌సభ నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీ తెచ్చుకోవడం ఎలా అనేదే పార్టీల ప్రధాన లక్ష్యం అయిపోయింది. దీనితో ఆ నియోజకవర్గంలో ఏ కులానికి టికెట్టు ఇవ్వాలి, ఎన్ని కోట్లు ఖర్చు పెట్టగలిగే వారికి టికెట్ ఇవ్వాలి అనేదే ప్రామాణికం అయిపోయింది, కానీ ఎవరు సమర్థులు అనేది ప్రామాణికం కాకుండా పోయింది. ఓటర్లు కూడా పోటీలో మొదటి రెండు స్థానాల్లో ఉన్నవారి మధ్య ఎవరు బెస్ట్ అని చూస్తున్నారే కానీ, మంచి అభ్యర్థి మూడో నాలుగో స్థానాల్లో ఉన్నా కూడా తనకి ఓటు వేస్తే తమ ఓటు వేస్ట్ అయిపోతుంది అనే భావనలో ఓటు వేయడం లేదు. ఫలితంగా ప్రభుత్వం ఏం చేసినా గుడ్డిగా సమర్థించే ఒక వర్గం, గుడ్డిగా వ్యతిరేకించే మరో వర్గం మాత్రమే చట్టసభల్లో ఉంటున్నాయి. దీనితో అర్థవంతమైన చర్చకి అవకాశం లేకుండా పోయింది. అదే దామాషా ఎన్నికల పద్ధతి ఉన్నట్లయితే చట్టసభలు భిన్నాభిప్రాయాల వేదికలుగా ఉండేవి.

మొత్తంగా చూస్తే, నిర్ణయాధికారం మొత్తం గుప్పిట్లో పెట్టుకున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాధినేతలకు అన్ని విషయాలపై అవగాహన ఉండే అవకాశం లేదు. అవగాహన లేదా క్షేత్రస్థాయి అనుభవం ఉన్న కొద్దిమంది మంత్రులకి, చట్టసభల సభ్యులకి తమ అభిప్రాయాలు స్వేచ్ఛగా వెల్లడించే అవకాశం లేదు. ధనబలం, కులబలం, అధినేత అండదండలు లేకుండా, సమర్థులు చట్టసభలకి ఎన్నికయ్యే అవకాశం లేదు. ప్రజలకి దగ్గరగా ఉండే స్థానిక ప్రభుత్వాలకి అధికారం లేదు. నిర్ణయాధికారం ఉన్న కొద్దిమంది ఉన్నతాధికారులకి క్షేత్రస్థాయి వాస్తవాలు తెలిసే అవకాశం లేదు. వీటన్నిటి వల్ల, మన పాలని ఒక దశ, దిశ లేకుండా పోయింది. ఈ దశ, దిశా లేని పాలన వల్లే ఒక మామూలు ఫ్లూ లాంటి కరోనా మనకి ఒక పెద్ద సంక్షోభంగా మారింది. దేశాన్ని పదేళ్ళు వెనక్కి నెట్టింది.

# తెలుగుతేజం..
# భారతరత్నం..
# మన కర్తవ్యం!




**"సుభాష్ చంద్రబోస్ జైలు నుంచి విధులు నిర్వర్తించారు"**
**"పీవీ నరసింహారావు ఇంటిపేరును పాములపర్తి నుంచి 'స్కాములపర్తి'గా మార్చాలి (ఆయన ప్రధానిగా ఉన్న సమయంలో మీడియా విమర్శ)"**

**.. ఈ వాస్తవాల్ని 21వ శతాబ్దంలో ఈవేళ ఉటంకించాలంటే సంశయించాల్సి వస్తుంది.**

ఎందుకంటే ఈ వాస్తవాలకు కొనసాగింపుగా ఉన్న..

"కలకత్తా కార్పొరేషన్‌కి మేయర్‌గా ఉన్న చిత్తరంజన్ దాస్.. బ్రిటిష్ ప్రభుత్వం నియమించే కెరీరిస్టు జోహుకుం సివిల్ సర్వీసు అధికారి వద్దని, పట్టుబట్టి యువ సుభాష్ చంద్రబోస్‌ని ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో)గా నియమించారు. కొన్ని నెలల్లోనే బోస్ తన సామర్థ్యంతో బలమైన ముద్రను సాధించారు. విప్లవకారులకు మద్దతిచ్చారనే తప్పుడు ఆరోపణలతో 1924 అక్టోబర్‌లో బోస్‌ని అన్యాయంగా జైలులో నిర్బంధించారు. బోస్ కలకత్తాలోని అలీపూర్ జైలులో ఉన్నప్పటికీ, మళ్లీ దాస్ పట్టుపట్టడంతో కార్పొరేషన్ సీఈవోగా జైలు నుంచే పనిచేయటానికి బోస్‌కి బ్రిటీషు ప్రభుత్వం అనుమతించింది. ఫైళ్లు ఆయనకే పంపేవారు, అధికారులు, కార్పొరేటర్లు, మేయరు కలిసేవారు, నగరాన్ని నడిపించే ఉత్తర్వుల్ని బోసే ఇచ్చేవారు.. అన్నీ అలీపూర్ జైలు నుంచే! నేతాజీ సుభాష్ చంద్ర బోస్‌ని బర్మాలోని మాండలే జైలుకి తరలించేంత వరకూ ఈ రకంగానే కలకత్తా నగర పాలన సాగింది".

"ఉంటుందో, ఊడుతుందో తెలియని ప్రభుత్వానికి సారథ్యం వహిస్తున్నా కూడా ప్రధానిగా పీవీ నరసింహారావు సాహసోపేత ఆర్థిక సంస్కరణలకే మొగ్గు చూపారు. ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు జేఎంఎం (జార్ఖండ్ ముక్తిమోర్చా) ఎంపీలను కొనుగోలు చేసేందుకు ముడుపులను చెల్లించిన వ్యవహారంలో ఆయన పాత్ర కచ్చితంగా వేలెత్తి చూపించవలసినదే. అయినా కూడా పీవీ వ్యక్తిగత లబ్ధికి ముడుపులు తీసుకోకపోవటం, రాజకీయాన్ని సొంత వ్యాపార అవసరాలకు ఉపయోగించుకోకపోవటం, ఆరోజు పీవీ నాయకత్వం దేశానికి అత్యంత కీలకావసరమని ఆ తర్వాతి పరిణామాలు రుజువుచేయటం, ఆయనపై నేరారోపణలు న్యాయస్థానాల్లో నిరూపితం కాకపోవటంతో.. ఆయన్ని స్కాములపర్తి వెంకట నరసింహారావు అన్నవారు కూడా ఇప్పుడు తెలుగుకీర్తి, భారతరత్నం అని కీర్తిస్తున్నారు".

.. అనే విషయాల్ని రోజువారీ జీవిత సమస్యల్లో, కుల, మత, ప్రాంతీయ భావోద్వేగాలతో, అవిద్య, పేదరికంలో కొట్టుమిట్టాడే ప్రజలు పట్టించుకునేలోగా.. సోషల్ మీడియాను అడ్డం పెట్టుకుని 'సుభాష్ చంద్రబోస్ లాంటి నాయకుడు జైలు నుంచి విధుల్ని నిర్వర్తించగా లేంది, మా నాయకుడు జైలుకెళ్లొచ్చి ఎన్నికల్లో గెలవటం, ఎన్నికల్లో గెలిచి పదవిని చేపట్టి జైలుకెళ్లటంలో తప్పేంటి?' .. 'భారతరత్నకు అర్హుడని ఇప్పుడు పలువురు కీర్తిస్తున్న పీవీ నరసింహారావుపై రకరకాల కుంభకోణాల ఆరోపణలు రాగాలేనిది, మా నాయకుడు, నాయకురాలి మీద స్కాంల ఆరోపణలు వస్తే అదేమన్నా పెద్ద విషయమా? రేపు మా నేత పేరు కూడా చరిత్రకెక్కదా ఏంటి' వంటి అడ్డగోలు ప్రచారంతో దబాయించి ప్రజామోదం సంపాదించుకుంటారేమోనని భయం.

ఈ దేశానికి పీవీ చేసిన సేవల విలువను ఆయన బతికుండగా కొంతమంది రాజకీయ నేతలు మాత్రమే గుర్తించారు. వారిలో కూడా అటల్ బిహారీ వాజ్‌పేయి లాంటి ప్రతిపక్ష పార్టీలవారే ఎక్కువగా పీవీ ఘనతను చాటుతుండేవారు. ప్రధానిగా పీవీ గురించి తెలిసిన ఎక్కువమంది ప్రజల్లోకూడా ఆయన పట్ల తెలియని గౌరవమే తప్ప.. తెలిసిన గౌరవం తక్కువ. చదువును గౌరవించటం తప్ప చదువు విలువ గురించి అంతగా అవగాహన లేనట్లు! ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ పలు సందర్భాల్లో చెప్పినట్లు.. "పీవీని ఆయన పార్టీ కంటే ఇతర పార్టీలెక్కువగా గౌరవించాయి. స్వరాష్ట్రం కంటే దేశం ఎక్కువగా గౌరవించింది. ఒకరకంగా దేశం కంటే ప్రపంచం ఆయన్ను ఎక్కువగా అవగాహన చేసుకుని గుర్తించింది. కొంతమందికి ఆ దురదృష్టం ఉంటుంది. వాళ్లు చేసేపని చుట్టూ ఉన్నవాళ్లకంటే ఇతరులు, దూరంగా ఉన్నవాళ్లు

ముందు గుర్తిస్తారు".

అభ్యుదయాన్ని కలగనే శక్తి, అనురక్తి, సంస్కరణను అమలు చేయగల చొరవ పీవీ రాజకీయ నేపథ్యంలో కనిపిస్తున్నా కూడా.. నెహ్రూ, ఇందిరాగాంధీల సుదీర్ఘ పాలనలో వేళ్లూను కున్న కుహనా సోషలిస్టు లైసెన్స్-పర్మిట్ రాజ్‌ను సమూలంగా మార్చే సంస్కరణను తెచ్చేంత సాహసాన్ని ప్రదర్శిస్తారంటే మాత్రం నమ్మకం కలగదు. కానీ 1990ల ఆరంభంలో దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభాన్ని ఒక అవకాశంగా మార్చుకునే స్థయిర్యాన్ని ప్రదర్శించటానికి పీవీ వెనుకంజ వేయలేదు.

కాంగ్రెస్‌లో సుదీర్ఘ రాజకీయ జీవితముండి రిటైరయ్యే దశలో ఉండే నాయకుల్లో సాధారణంగా కనిపించే అభిజాత్యాల్ని ప్రదర్శించకుండా, ధార్మిక సోషలిజం ఆనవాయితీకి పరిమితం కాకుండా తన బలాల్ని, బలహీనతల్ని నిక్కచ్చిగా బేరీజు వేసుకున్నారు నరసింహారావు. ఒకరకంగా అప్పటి వరకూ తాను నిర్వహించిన అమాత్య పదవుల్లో కనబరచిన సాంప్రదాయ ధోరణిని, పాలనా వైఫల్యాలను ఆత్మసాక్షిలో అంగీకరించారనే అనుకోవాలి. అందుకే తన రాజకీయ స్థాయి గురించిన ఆలోచనలేకుండా, తనను తాను తగ్గించుకుని మరీ ఆర్థిక సంస్కరణల్లో మన్మోహన్ సింగ్ ఆలోచనలకు పెద్దపీట వేశారు. అవరోధాలు రాకుండా కవచంలా కాపాడారు. జేపీ అన్నట్లు, "విధిలేని పరిస్థితుల్లోనే ఆర్థికరంగంలో సంస్కరణల్ని చేపట్టారనుకున్నా.. అత్తుబిత్తు మెజారిటీ ప్రభుత్వంగా వాటిని సాధించేందుకు పీవీ నరసింహారావు చూపిన చాతుర్యం, దూరదృష్టి, దేశభక్తి అపూర్వమైనవి. చేస్తున్నది చాలా పెద్ద పనే అయినా.. ఎక్కడా ఆర్భాటాలు లేవు. కీర్తి కండూతి లేదు. పెద్ద మార్పు కోసం అంటూ హంగామా చేయకుండా.. ఎంతో అణకువతో, ఏకాగ్రతతో అలవోకగా పనిచేసి ఈ దేశంలో ఆర్థిక స్వేచ్ఛకు నాంది పలికారు. ఆయన హయాం కచ్చితంగా మన జాతి నిర్మాణంలో కీలక ఘట్టం! సంక్షోభ సమయంలో... ఓ నిరుపేద సమాజంలో... సోషలిజం, సామ్యవాదాలకు పిచ్చి అర్థానిచ్చిన సమాజంలో... అసమానతలు, కులాలు మతాలున్న సమాజంలో... ఏ రకమైన అస్థిరత్వం లేకుండా కార్మిక సంఘాల్లో, సొంతపక్షంలో, విపక్షంలో, ప్రజలందరిలోనూ ఏకాభిప్రాయాన్ని అలవోకగా నింపాదిగా సాధించి.. ఇంత శాంతియుతంగా ఇంత పెద్దమార్పును, బలమైన ప్రభుత్వం లేకుండా తెచ్చే ప్రయత్నం ప్రపంచంలో మరే దేశంలోనూ జరగలేదు. పీవీ గొప్పతనం అది! ఆర్థిక సంస్కరణలు కావచ్చు, విదేశీ వ్యవహారాలు కావచ్చు, అణుపరీక్ష వంటి సంచలన విషయాలు కావచ్చు.. నా పేరు కన్పించాలని తపించకుండా, నా దేశం కోసం కొన్ని లక్ష్యాలు నెరవేరాలనే ఉద్దేశంతో నిరాడంబరంగా వెనకాల ఉంటూ సంయమనాన్ని పాటించి కీర్తిని వేరేవారికిచ్చి... సమాజంలో భయాందోళనలు లేకుండా చేసి... అద్భుతమైన చాతుర్యాన్ని, దూరదృష్టిని, దేశభక్తిని ప్రదర్శించారాయన!".

కాలం గడుస్తున్నకొద్దీ పీవీ లాంటి వారి విలువ పెరుగుతుంది. అందుకే పీవీని ఎంత వ్యతిరేకించినా ఆయన హయాంలో భారత ఆర్థిక వ్యవస్థలో జరిగిన గుణాత్మక మార్పును ఆయన సొంత పార్టీ కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ కూడా గుర్తించక తప్పలేదు. పీవీ తీసుకొచ్చి తన కేబినెట్‌లో ఆర్థికమంత్రిగా నియమించుకున్న డా॥ మన్మోహన్ సింగ్‌ను ఆమె 2004లో ప్రధానిగా తీసుకోవటానికి పీవీ హయాం సాధించిన విజయాలే పెద్ద కారణం. నరసింహారావును వ్యక్తిగతంగా గౌరవిస్తున్నా కూడా జాతీయస్థాయిలో ప్రతిపక్ష పార్టీగా ఆయన ఆర్థిక విధానాలను పలు అంశాల్లో వ్యతిరేకిస్తుండే బీజేపీ కూడా.. ఇప్పుడు మక్కీకిమక్కీ అవే విధానాలను అనుసరిస్తోంది. మోదీ ప్రభుత్వం పీవీకి ఢిల్లీలో స్మారకాన్ని కూడా నిర్మించింది. తెలంగాణలో అధికారంలో ఉన్న టీఆర్ఎస్ పార్టీ పీవీకి ప్రభుత్వ పరంగా ఘననివాళు లర్పించటంతోపాటు ఏడాది పాటు ఆయన శతజయంతి కార్యక్రమాల్ని రాష్ట్రంలో, దేశవిదేశాల్లో కూడా నిర్వహిస్తోంది. ఇందులో పార్టీలపరమైన వ్యూహాత్మక అవసరాలున్నాయనే విమర్శలున్నా అవేమీ పీవీ ఘనతను తగ్గించలేవు.

జేపీ క్రోడీకరించినట్లు "దేశ చరిత్రలో పీవీ స్థానం కీలకం, పదిలం. తెలుగువాళ్లు, భారతీయులందరూ తలెత్తుకుని ఠీవిగా చెప్పుకోగలిగే రీతిలో పీవీ నరసింహారావు తన పదవులను నిర్వహించారు".

కానీ భారతదేశం జాతిపితగా భావించే మహాత్మాగాంధీ కృషే ఇంకా ఎంతో అసంపూర్ణంగా మిగిలి ఉంది. స్వతంత్ర భారతదేశంలోని పరిణామాల్ని చూస్తూ తాను విఫలమయ్యా నంటూ గాంధీ చివరి దశలో కన్నీరు కారుస్తుండేవారు. మరి పీవీ ఆర్థిక సంస్కరణలు కూడా సంపూర్ణ విజయమా?.. వట్టి ఆర్థిక సంస్కరణల్ని అమలు చేస్తే ఈ దేశ సమస్యలు పరిష్కార మైపోతాయా?.. 'లేదు' అన్నదే గత కొన్నేళ్లుగా ప్రస్ఫుటమ వుతున్న పలు పరిణామాలు తేటతెల్లం చేస్తున్న సమాధానం!

తన సంస్కరణల్లో కొన్ని కీలక లోపాల ఖాళీలను పీవీ అలాగే వదిలేశారు. దృష్టి పెట్టి ఉంటే, వీటిలో కొన్ని ఆయన హయాంలోనే పరిష్కారమయ్యేవి. కొన్ని మాత్రం రాజకీయ అననుకూలతలరీత్యా వాయిదా వేయక తప్పని పరిస్థితి. కానీ మొత్తంగా పీవీ హయాం నుంచీ అలాగే కొనసాగుతూ వస్తున్న ఈ సవాళ్లను పరిష్కరించుకుని అధిగమిస్తేనే ఆయన అసాధారణ కృషి అసంపూర్ణతను అధిగమించగలుగుతుంది. పీవీ శతజయంతి (2020-21) సందర్భం కేవలం నివాళులకే కాకుండా ఆ కార్యాచరణకు దారితీయాలి.

పీవీ నరసింహారావు కృషిని పరిపూర్ణం చేసే క్రమంలో మనం ప్రధానంగా ఐదు అంశాల మీద దృష్టి సారించాలి.

1) **73, 74 రాజ్యాంగ సవరణల స్థానంలో స్థానిక ప్రభుత్వాల సాధికారతకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు జరగాలి:** స్థానిక ప్రభుత్వాల సాధికారతకు రాజీవ్‌గాంధీ కృషి వల్ల రాజ్యాంగ సవరణలు రూపుదిద్దుకున్నాయి. వాటిని పార్లమెంటు ఆమోదించింది మాత్రం పీవీ ప్రధానిగా ఉన్నప్పుడు. 1992లో.




పీవీ నరసింహారావు పేరిట నెలకొల్పిన జాతీయ నాయకత్వం, జీవిత సాఫల్య పురస్కారాన్ని 2019లో మన్మోహన్ సింగ్‌కు ప్రణబ్ ముఖర్జీ ఢిల్లీలో ప్రదానం చేసిన కార్యక్రమం చిత్రాలివి! చెన్నై కేంద్రంగా పనిచేసే 'ఇండియా నెక్స్ట్' అనే ప్రభుత్వేతర సంస్థ ఈ అవార్డును ప్రారంభించింది. ఒకప్పుడు పీవీ భౌతిక కాయానికి కూడా గౌరవం ఇవ్వకుండా అవమానించిన తీన్‌మూర్తి భవన్ ప్రాంగణంలోనే ఈ కార్యక్రమం జరగటం విశేషం. పీవీ నేతృత్వంలో దేశంలో సంస్కరణలను తీసుకురావటంలో కీలక పాత్ర పోషించటంతోపాటు వాటిని కొనసాగించటంలోనూ చెప్పుకోదగిన కృషి చేసినందుకు మన్మోహన్‌ను ఈ అవార్డుకు జ్యూరీ ఎంపిక చేసింది. భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎంఎన్ వెంకటాచలయ్య అధ్యక్షత వహించిన జ్యూరీ కమిటీలో రాజ్యాంగ నిపుణుడు డా॥ సుభాష్ కశ్యప్, సీబీఐ మాజీ డైరెక్టర్ కార్తికేయన్, ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్, సీనియర్ సంపాదకుడు రామచంద్రమూర్తిలు ఉన్నారు.



కానీ మునిసిపాలిటీలు, పంచాయతీల్లో స్వతంత్ర పాలనతో మూడో అంచె ఫెడరలిజం కోసం ఉద్దేశించిన ఆ 73, 74 సవరణలు నిర్మాణం జాస్తి, అధికారాలు నాస్తిగా రూపొందాయి.. సత్తా లేని స్థానిక ప్రభుత్వాలను సృష్టించాయి. అందుకే అనివార్యంగా విఫలమయ్యాయి.

మూడో అంచెలోని స్థానిక పాలనావ్యవస్థకి గణనీయ అధికారాల, నిధుల బదిలీని రాజ్యాంగం గ్యారంటీ చేసి, మిగతా అంశాలను రాష్ట్రాలకు వదిలేసి గనక ఉంటే, పూర్తి భిన్నమైన ఫలితాలు వచ్చి ఉండేవి. కానీ 73, 74 రాజ్యాంగ సవరణలతో అలా చేయకుండా, తీవ్ర తప్పిదాలు చేశారు. గత చరిత్ర, అనుభవం ఆధారంగా స్థానిక ప్రభుత్వాలను నిర్మించే వెసులుబాటును రాష్ట్రాలకు ఇవ్వలేదు. ఉదాహరణకి, చాలా రాష్ట్రాలలో గ్రామానికి, బ్లాకుకి, జిల్లా స్థాయి స్థానిక ప్రభుత్వాలకి మధ్య అవినాభావ సంబంధం ఉంటుంది. అయితే, రాజ్యాంగ సవరణ ఓ మూస తరహాలో ప్రతి స్థాయిలో ఎన్నికైన ప్రత్యేక కౌన్సిల్ ఏర్పాటుని పైనుంచి రుద్దింది. గతంలో చాలా రాష్ట్రాలలో స్థానిక ప్రభుత్వాల చైర్‌పర్సన్లను ప్రత్యక్షంగా ఎన్నుకుని ప్రజాభిప్రాయాన్ని, అధికారాన్ని మిళితం చేసే మెరుగైన ప్రయత్నం జరిగింది. అలాంటి వెసులుబాటు లేకుండా మధ్యస్థాయిలో, జిల్లా సంస్థలలో చైర్‌పర్సన్లను పరోక్ష పద్ధతి ద్వారానే ఎన్నుకోవాలని 73వ సవరణ ద్వారా రాజ్యాంగం స్పష్టంచేస్తోంది. అనేక రాష్ట్రాలు ఆనాటికే మహిళలకు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు స్థానిక ప్రభుత్వ సంస్థలలో రిజర్వేషన్లను కల్పించాయి. అయితే, రాజ్యాంగ సవరణ రిజర్వేషన్లను ప్రాతినిధ్య కౌన్సిళ్లకే పరిమితం చేయకుండా, వాటిని కార్యనిర్వాహక విభాగానికి కూడా విస్తరించటంతో, ప్రధాన కార్యనిర్వాహక పదవికి కూడా రొటేషన్ అనివార్యమైంది. ఫలితంగా, నాయకత్వం ఎదగటం అసాధ్యమైపోయింది. బలహీన, అస్థిర నాయకత్వాలు అధికారాన్ని సద్వినియోగం చేయలేకపోతున్నాయి, స్థానిక ప్రభుత్వాలకు మరింత స్వయం ప్రతిపత్తిని, నిధుల్ని ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తేలేకపోతున్నాయి. అంతిమంగా, స్థానిక ప్రభుత్వాలకు నిజమైన అధికారాలు, వనరులకు సంబంధించి రాజ్యాంగం మౌనం వహించింది.. మరోపక్క స్థానిక సాధికారత అంటేనే విముఖతను, తిరస్కారాన్ని కనబరిచే

# ప్రధాని పదవి దాకా..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నేపల్లి గ్రామంలో 1921 జూన్ 28న రుక్నాబాయి, సీతారామారావు దంపతులకు పీవీ నరసింహారావు జన్మించారు. దాదాపు మూడేళ్ల వయసులో కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరకు చెందిన పాములపర్తి రంగారావు, రుక్మిణమ్మ ఆయనను దత్తత తీసుకోవటంతో అప్పటి నుంచి పాములపర్తి వెంకట నరసింహారావు అయ్యారు. ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో పీవీ ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తిచేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో డిగ్రీ చదివే రోజుల్లోనే అంటే 1938లో హైదరాబాద్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో చేరి నిజాం ప్రభుత్వ నిషేధాన్ని ధిక్కరిస్తూ వందేమాతరం గేయాన్ని పాడారు. దీంతో ఓయూ నుంచి ఆయన్ను బహిష్కరించారు. ఓ మిత్రుడి సాయంతో నాగపూర్ విశ్వవిద్యాలయంలో చేరి 1940 నుంచి 1944 వరకు ఎల్ఎల్‌బీ చదివారు. స్వామి రామానందతీర్థ, బూర్గుల రామకృష్ణారావుల అనుయాయిగా స్వాతంత్ర్యోద్యమంలో, హైదరాబాద్ విముక్తి పోరాటంలో పీవీ పాల్గొన్నారు. బూర్గుల శిష్యుడిగా కాంగ్రెస్ పార్టీలో చేరి అప్పటి యువ నాయకులు మర్రి చెన్నారెడ్డి, శంకరరావు చవాన్, వీరేంద్ర పాటిల్‌లతో కలసి పనిచేశారు. 1951లో అఖిల భారత కాంగ్రెస్ కమిటీలో సభ్యుడిగా స్థానం పొందారు. 1957లో మంథని నియోజకవర్గం నుంచి శాసనసభకు ఎన్నికవడం ద్వారా పీవీ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఇదే నియోజకవర్గం నుంచి వరుసగా నాలుగుసార్లు ఎన్నికయ్యారు. 1962లో తొలిసారి మంత్రి అయ్యారు. 1962 నుంచి 1964 వరకు న్యాయ, సమాచార శాఖ మంత్రిగా, 1964 నుంచి 67 వరకు న్యాయ, దేవాదాయ మంత్రి, 1967లో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, 1968-71 కాలంలో న్యాయ, సమాచార శాఖ మంత్రి పదవులు నిర్వహించారు. 1969 నాటి ప్రత్యేక తెలంగాణ ఉద్యమం అనంతరం తెలంగాణకు చెందిన వివాద రహిత నేతగా పీవీని ముఖ్యమంత్రిగా ఎంపిక చేయటం అనివార్యమైంది. 1971లో ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. భూసంస్కరణల్ని అమలు చేశారు. స్వయంగా తనకున్న వెయ్యి ఎకరాల భూమిని వంగర, మంగళపల్లిలోని పేదలకు పంపిణీ చేశారు. కానీ ముల్కీ నిబంధనలపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో జైఆంధ్ర ఉద్యమం రాజుకోవటం, పార్టీలో అసమ్మతి వంటి కారణాలతో 1973లోనే పీవీ గద్దె దిగారు. 1977లో తొలిసారి లోక్‌సభకు ఎన్నికయ్యారు. మొత్తంగా రెండుసార్లు హన్మకొండ నుంచి, మరో రెండు పర్యాయాలు మహారాష్ట్రలోని రాంటెక్ నుంచి, 1991లో ఎన్‌టీఆర్ నేతృత్వంలోని తెలుగుదేశం కూడా ఇచ్చిన మద్దతుతో ఏపీలోని నంద్యాల నుంచి, 1998లో ఒడిషాలోని బ్రహ్మపూర్ నుంచి పీవీ ఎంపీగా గెలిచారు. 1980-89 మధ్య కేంద్రంలో హోం, విదేశాంగ, మానవ వనరుల అభివృద్ధి శాఖలను ఆయన నిర్వహించారు. 1991 సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయకుండా దాదాపుగా రాజకీయ సన్యాసం తీసుకున్నా, రాజీవ్ గాంధీ హత్య నేపథ్యంలో అనుకోకుండా పీవీని ప్రధాని పదవి వరించింది. 9 భారతీయ భాషలతోపాటు 8 విదేశీ భాషలను అనర్గళంగా మాట్లాడగల పీవీ సాహితీకారుడు కూడా.

రాష్ట్రాల దయాదాక్షిణ్యాలకు వాటిని వదిలేసింది. దీంతో, స్థానిక ప్రభుత్వాలు చాలామేర ఉత్సవ విగ్రహాలుగా, ప్రభావశూన్యంగా మిగిలిపోయాయి. ఎప్పుడోకప్పుడు ఎన్నికలు తప్పనిసరిగా జరపటం తప్ప చెప్పుకోదగిన పాత్ర వాటికి కొరవడింది.

మొదట్లోనే అనుకున్నట్లు.. సుభాష్ చంద్రబోస్ జైలు నుంచి విధులు నిర్వహించేంత విస్తృతాధికారాలను, స్వయంప్రతిపత్తిని బ్రిటిష్ వలస పాలనలో కూడా ఎన్నికైన స్థానిక ప్రభుత్వాలు అనుభవించాయి. కానీ స్వతంత్ర భారతదేశంలో అవి నామమాత్రంగా మారిపోయి, ప్రజాస్వామ్యాన్ని, అన్ని వర్గాల రాజకీయ భాగస్వామ్యాన్ని పరిహసిస్తున్నాయి. ఒకప్పుడు పటేల్, నెహ్రూ, బోస్, ప్రకాశం పంతులు వంటి గొప్ప జాతీయ నాయకుల్ని తయారు చేసిన స్థానిక ప్రభుత్వాలు ఈవేళ మేధోదారిద్ర్యంతో అలమటిస్తున్నాయి, వనరుల కొరతతో కునారిల్లుతున్నాయి. 73, 74వ రాజ్యాంగ సవరణల్లో మార్పు తెచ్చేందుకు యూపీయే హయాంలో జేపీ గట్టిగా ప్రయత్నించినా రాజీవ్‌గాంధీకి సన్నిహితుడైన ఓ మంత్రి అత్యుత్సాహం వల్ల ఆ అవకాశం తృటిలో తప్పిపోయింది. వాటిని ముట్టుకుంటే రాజీవ్ ఆత్మక్షోభిస్తుందని సదరు మంత్రి సెంటిమెంట్‌ని రంగరించి మరీ ఆ పెద్ద మార్పుని అడ్డుకున్నాడు. ఇప్పుడున్న పరిస్థితుల్లో వాటి సవరణ సాధ్యం కాకపోవచ్చు. మరోపక్క ఉన్నకొద్దీ కేంద్రీకృత పాలన, ఎమ్మెల్యేల జమానా పెరిగిపోతూ రాజకీయాల్లో సామాన్య యువతకు అవకాశాలు కరవవుతున్నాయి. కరోనా కల్లోలం కూడా స్థానిక ప్రభుత్వాల, ముఖ్యంగా నగర పాలన పటిష్టత ఆవశ్యకతను మన ముందుకు తెచ్చింది. ఈ పరిస్థితుల్లో స్థానిక ప్రభుత్వాల సాధికారతకోసం మనం నిర్దిష్ట మార్పులను సాధించుకోవాలి. కేంద్రం బదలాయించే నిధుల నుంచిగానీ, రాష్ట్ర బడ్జెట్ నుంచి నేరుగాగానీ మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు, పంచాయతీలకు నేరుగా, విధిగా 33 శాతం నిధుల్ని బదిలీ చేయాలి. స్థానిక ప్రభుత్వాల విధుల్ని, అధికారాల్ని స్పష్టంగా నిర్వచించి జవాబుదారీతనంతో బదిలీ చేసి రాష్ట్ర ప్రభుత్వాలు పర్యవేక్షణ బాధ్యతకు పరిమితం కావాలి. ఈ వికేంద్రీకరణ, స్థానిక సాధికారత లేకుంటే.. ఆర్థిక సరళీకరణ కొద్దిమంది సంపన్నులకే ఫలాలనిస్తూ మిగతావారిని రాజకీయ నిర్ణయాధికారంలేనివారుగా, ఓటు వేసే యంత్రాలుగా మిగులుస్తుంది.

## 2) పేదరిక నిర్మూలనకు, సమానావకాశాలకు నాణ్యమైన విద్య, ఆరోగ్యం:

ఆర్థిక సరళీకరణలో స్వేచ్ఛ పేరుకే ఉంటే ప్రయోజనమేంటి?.. అనేక అసమానతలు, అవిద్య శతాబ్దాలుగా వేళ్లూనుకుని ఉన్న మన దేశంలాంటి చోట రాజ్యాంగం కాగితాల్ని దాటి స్వేచ్ఛ అందుబాటులోకి రావటం అంత తేలిక కాదు. అందరికీ సమానావకాశాలు ఉండాలంటే.. ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్య, ప్రతి కుటుంబానికీ మంచి ప్రమాణాల ఆరోగ్యం ఎటువంటి వ్యక్తిగత ఆర్థికభారం లేకుండా ప్రభుత్వమే అందుబాటులోకి తేవాలి. మంచి చదువు, ఆరోగ్యం లేకుండా ఆర్థిక సరళీకరణ అవకాశాల్ని అందుకోవటమనేది ఒక పరిధి దాటి అసాధ్యం.

మన విద్యార్థుల్లో కేవలం 1 -2 శాతం మాత్రమే ప్రపంచంతో పోల్చదగిన స్థాయిలో ఉన్నారు. మరో 15 శాతం మంది ఆ స్థాయిని శిక్షణతో అందుకోగలిగే స్థితిలో ఉండగా, దాదాపు 80 శాతం మంది అధమస్థాయిలోనే ఉండిపోతున్నారు. ఇక మన ప్రజారోగ్య వ్యవస్థ ప్రపంచంలోనే నాసిరకమైనది. దాదాపు రెండు కోట్ల ఉద్యోగావకాశాల్ని కల్పించే శక్తి ఉన్న ఆరోగ్య వ్యవస్థనుకాస్తా.. ఏటా 6 కోట్ల మంది పేదలను తయారుచేసేదిగా కొనసాగిస్తున్న ఘోరచరిత్ర మన పాలకులది. ఈ వైఫల్యాల్ని ఆర్థిక సంస్కరణల ప్రారంభంలోనే గుర్తించి ఉండాల్సింది. పీవీ హయాంలో ఆర్థిక సంస్కరణల్ని ప్రవేశపెట్టిన మన్మోహన్‌సింగ్ ఆ తర్వాత 2004లో ప్రధానమంత్రి అయ్యాక కూడా ఈ లోపాల్ని సరిదిద్దలేదు. దాంతో, స్వతంత్ర భారతదేశ చరిత్రలోనే భారీ వృద్ధి రేటుకనమోదైనా సింగ్ ప్రభుత్వ హయాం ఉపాధి లేని వృద్ధి జమానాగానే మిగిలిపోయింది. 'భారత్‌లో 80 కోట్ల మందికి కొన్ని నెలలపాటు ఆహారధాన్యాల సరఫరా చేసే బృహత్తర కార్యక్రమాన్ని చూసి ప్రపంచ దేశాలే ఆశ్చర్యపోతున్నాయి' అని ప్రస్తుత ప్రధానమంత్రి మోదీ కరోనా ప్యాకేజీ గురించి మాట్లాడుతూ చేసిన వ్యాఖ్యని చూస్తే, మూడు దశాబ్దాల ఆర్థిక సంస్కరణలు ఎంత పేదరికాన్ని పోగొట్టాయి? అన్న ప్రశ్న కుదిపేయక మానదు. నెలకు 5 కేజీల బియ్యం, గోధుమల కోసం ప్రభుత్వాన్ని యాచించే స్థితిలో ఇన్ని కోట్ల మంది ఉన్నప్పుడు (ఈ పంచే ధాన్యాల్లో కూడా పౌష్టికాహారం తక్కువ), ఇన్నేళ్లలో మన పాలకులు సాధించిదేమిటి?

జాతీయ సలహా మండలి సభ్యునిగా లోక్‌సత్తా జేపీ ఎంతో పట్టుబట్టాక 2005లో జాతీయ ఆరోగ్య మిషన్‌ని పరిమితులతో యూపీయే ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. మన విద్య, ఆరోగ్య రంగాలలో వైఫల్యాల్ని సరిదిద్దేందుకు కొవిడ్ సంక్షోభం మరో మంచి అవకాశం. అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం ఇక మీదటైనా మన రాజకీయానికి కేంద్ర బిందువు కావాలి. వీటి ద్వారా తప్ప పేదరికాన్ని నిర్మూలించిన ఉదంతాలు ప్రపంచంలో ఎక్కడా లేవు. జాతీయ విద్యావిధానం-2020ని కేంద్ర ప్రభుత్వం ఆమోదించటం విద్యారంగంలో పెద్ద సానుకూల పరిణామంగానే చెప్పవచ్చు. కానీ దాని అమలులో కూడా చిత్తశుద్ధిని ప్రదర్శించాలి. అందరికీ ఆరోగ్యానికి కూడా ఆయుష్మాన్ భారత్‌ను సంస్కరించి ఒక సమగ్ర ప్రజారోగ్య విధానాన్ని తీసుకురావాలి.

## 3) వ్యవసాయ రంగంపై ఆంక్షల్ని తొలగించటం:

నరసింహారావు ప్రధానిగా పారిశ్రామిక రంగంలో లైసెన్స్, పర్మిట్ విధానాన్ని నేలమట్టం చేశారు. కానీ ఈ దేశంలో అత్యధికుల ఆదాయాన్ని అణగదొక్కుతున్న వ్యవసాయాన్ని మాత్రం సంకెళ్లలోనే ఉంచారు. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూ.టి.వో)లో భారత్ చేరటాన్ని సమర్థిస్తూ పీవీ మంత్రివర్గంలోని ఆర్థికమంత్రి మన్మోహన్‌సింగ్, వాణిజ్యమంత్రి ప్రణబ్ ముఖర్జీ ఇద్దరూ కూడా వ్యవసాయం మీద ఆంక్షల్ని

# ప్రభుత్వ పాత్రపై స్పష్టత పెరగాలి

స్వేచ్ఛా వాణిజ్యం రాకముందు మార్చి 1991లో ఆరు బిలియన్ డాలర్ల లోపున్న భారత్ నిల్వలు ఇప్పుడు 500 బిలియన్ డాలర్లను మించాయి. ఈ డబ్బంతా ఇలా వచ్చి అలా పోయేదేనని ఆరోజుల్లో వ్యాఖ్యానించేవారు. కానీ 30 ఏళ్లు గడుస్తున్నా వచ్చిన డబ్బు ఆ స్థాయిలో తిరిగెళ్లిపోవటం ఎప్పుడూ జరగలేదు. ఈ సంస్కరణలు వచ్చాక మనదేశంలో కొంతమంది సామాన్యులు ఎటువంటి కుటుంబ నేపథ్యం కూడా లేకుండా కోట్లకు పడగలెత్తారనేది, విదేశాలలో కూడా ఉన్నత పదవుల్ని అందుకోగలిగారనేది వాస్తవం. ప్రజల ఆదాయాలు, ఆకాంక్షలు గణనీయంగా పెరిగాయనేది కూడా వాస్తవం. అభివృద్ధి చెందుతున్న దేశం స్థాయి నుంచి మధ్యస్థ ఆదాయ దేశంగా భారత్ రూపుదిద్దుకుంది. అన్నిటికీ లంచాలు, బ్యూరోక్రసీ ఆటంకాలు లేకుండా తమకు కావలసిన వస్తువుల్ని కొనుక్కోవటం మొదలైంది.

టెలిఫోన్ ఈ సంస్కరణల ప్రభావానికి చక్కటి ఉదాహరణ. 1990ల ముందు ఫోన్ కావాలంటే ఎంపీలు, మంత్రులు రికమెండ్ చేయాల్సి వచ్చేది. జాతీయోద్యమతరం తర్వాత వచ్చిన రాజకీయ నేతలు, బ్రిటీషు వారి అణచి వేత ధోరణులకు ప్రతీకలుగా కొనసాగుతున్న బ్యూరోక్రసీ కలిసి ప్రజలకు లైసెన్స్‌రాజ్యంలో నరకం చూపించారు. సంస్కరణలతో ప్రయివేటు కంపెనీలు పోటీలోకి వచ్చాక ఫోన్ కావాలంటే ఎవరి రికమండేషన్ అక్కర్లేదు. పాతికేళ్ల క్రితం ఫోన్ కష్టాల గురించి ఇప్పుడు యువతలో చాలామందికి తెలియను కూడా తెలియకపోవచ్చు. స్వేచ్ఛావాణిజ్యానికి సాంకేతిక పరిజ్ఞానం తోడవ టంతో అభివృద్ధి మునుపెన్నడూలేనంత వేగంగా కొత్తపుంతలు తొక్కుతోంది.

అదేసమయంలో ఈ సంస్కరణలు వచ్చాక ఆదాయాల మధ్య అంతరాలు కూడా పెరిగాయి. డబ్బున్నవారికే డబ్బు వచ్చి చేరే ధోరణులు పెరుగు తున్నాయి. క్రోనీ క్యాపిటలిజం (ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం) విస్తరిస్తోంది. రాజకీయాలలో చట్టవిరుద్ధ డబ్బు ప్రభావం విపరీతమై పెద్ద వ్యాపారంగా మారిపోయాయి. ఎన్నికలు పోల్ ఈవెంట్ మేనేజ్‌మెంట్లలా మారాయి. సమాజంలో అశాంతి, ఘర్షణ వైఖరులు పెచ్చరిల్లుతున్నాయి. అప్రకటిత ఎమర్జెన్సీ వాతావరణం రాజ్యమేలుతోంది. గ్రామాలు ఖాళీ అయిపోతున్నాయి. ఆధునిక బానిసలు, నేరాల సంఖ్య పెరుగుతోంది. ఇవన్నీ స్వేచ్ఛా వాణిజ్యం వల్ల కలిగిన దుష్పరిణామాలేనని, ఈ సంస్కరణలేవీ లేకుండానే నెహ్రూ, ఇందిర హయాంలో 5శాతం వరకూ జీడీపీ వృద్ధి రేటు వచ్చిందని, ప్రజలు ఉన్నంతలో సంతోషంగా బతికారని కొందరు విమర్శల్ని కొనసాగిస్తున్నారు.

అయితే, స్వేచ్ఛా వాణిజ్య సంస్కరణలు అనివార్యంగానే భారత్‌లోకి ప్రవేశించాయి. ఇప్పుడు భారత్ ముందున్న మార్గం ఒక్కటే. స్వేచ్ఛా వాణిజ్యాన్ని కొనసాగిస్తూనే భారతీయ పరిస్థితుల నేపథ్యంలో దుష్పరిణామాలు రాకుండా సద్వినియోగం చేసే పకడ్బందీ సంస్కరణల్ని తీసుకురావటం.

స్వేచ్ఛా వాణిజ్యం అందరికీ సమానావకాశాల్ని అందిస్తున్నట్టు కనిపిస్తుందిగానీ పేదలకు, వివక్షకు గురైనవారికి అవకాశాలు వాటంతటవే అందుబాటులోకి రావటం కష్టం. ఈ వైఫల్యాన్ని సరిచేయటానికి అందరికీ నాణ్యమైన విద్య, వైద్యం, ఎదిగే అవకాశాల్ని అందించాలి. ఈ పని ఎవరు చేయాలి?.. ప్రభుత్వమే చేయాలి! అందుకే ప్రభుత్వం ఈ ఆధునిక ప్రజాస్వామిక యుగంలో చేయాల్సిన పనులు ఏమిటి? అనే స్పష్టత ప్రతి పౌరునిలో రావాలి.

తొలగిస్తామని 1993 సమయంలో పార్లమెంటు సాక్షిగా హామీ ఇచ్చారు. కానీ ఆచరణలో అందుకు విరుద్ధంగా వ్యవహరించారు. రైతులు ఎక్కువ ధర ఉన్న పక్క జిల్లాల్లో కూడా పంటలమ్ముకోకుండా సంకెళ్లను కొనసాగిస్తూ, ఇతర దేశాల నుంచీ దిగుమతులనేమో డంప్ చేశారు. మన్మోహన్‌సింగ్ ప్రధానమంత్రి అయ్యాక కూడా అదే తీరును కొనసాగించారు. 2010లో లోక్‌సత్తా ఆధ్వర్యంలో రైతు ఐక్యతా యాత్ర అనంతరం జేపీ పట్టుబట్టాక ఆహారధాన్యాల ఎగుమతిపై ఆంక్షల్ని తొలగిం చారు. ఆ తర్వాత వచ్చిన నరేంద్రమోదీ ప్రభుత్వం ఎగుమతుల పెంపు, దిగుమతుల కట్టడి మీద దృష్టి పెట్టకపోవటంతో రైతుల ఆదాయం తరచూ పతనమవుతోంది. 2019లో ఒక్క వంటనూనెల దిగుమతికే రూ.70,000 కోట్లను భారత్ వెచ్చించింది. ఇటీవల ఆత్మనిర్భర్ భారత్ ప్యాకేజీలో వ్యవసాయ మార్కెటింగ్‌పై కొంతమేర ఆంక్షల్ని సడలించినా అవి చాలవు. వ్యవసాయాన్ని రైతులు, కౌలు రైతులు వ్యాపారంలా చేస్తూ అగ్రిప్రెన్యూర్‌లుగా లాభాలను గడించే విధానాల్ని, ప్రోత్సాహకాల్ని ఈ రంగంలో అమలు చేయాలి.

**4) పార్టీల్లో పోటీతత్వంతో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని పెంచటం:**

రాజకీయాల్లోకి వచ్చి సమాజానికి సేవలందించాలని స్వచ్ఛందంగా అనుకునే సమర్థులు, నిజాయతీపరులు పోటీపడి వేగంగా ఎదిగే అవకాశాల్ని మన రాజకీయ పార్టీలు అందించటం లేదు. అవి ప్రజలకు వేదికల్లా కాకుండా, కొందరు సంపన్నులు, కొన్ని కుటుంబాల గుత్త సొత్తుగా తయారయ్యాయి. దశాబ్దాలపాటు పార్టీ జెండాలు మోసో, యాదృ చ్ఛికంగానో ఎవరైనా కుటుంబాల బయట నుంచి పార్టీలో ఉన్నతస్థాయికి చేరుకోగలిగినా.. కేంద్రీకృత పాలనా ధోరణుల వల్ల వారు కూడా ఇంకో రూపంలో పార్టీని గుప్పెట్లో పెట్టుకుంటున్నారు. ఈ పార్టీ, ఆ పార్టీ అని తేడా లేకుండా పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యం లోపించటం ఇప్పుడు మన దేశం ఎదుర్కొంటున్న పెద్ద రాజకీయ సంక్షోభాల్లో ఒకటి. ఒక సామాన్య యువతో, యువకుడో తన సామర్థ్యంతో దేశ రాజకీయ వ్యవస్థని ప్రభావితం చేసే అవకాశాలు మన దేశంలో అందుబాటులోకి రాకుండా ప్రధాన పార్టీలే

అడ్డుగోడలుగా తయారయ్యాయి. పార్టీలు క్రియాశీల ప్రజాస్వామిక రాజకీయానికి వేదికలుగా మారి నాయకత్వ సామర్థ్యాన్ని ప్రదర్శించేవారందరికీ అవకాశం కల్పించకపోతే ఆర్థిక సంస్కరణలు వక్రమార్గం పట్టి అంతరాల్ని పెంచుతూ అశాంతికి దారితీసే అవకాశాలుంటాయి. పీవీ నరసింహారావులాంటి వారికి పార్టీపరంగా అవరోధాలు లేకుండా ఉంటే, భారతదేశం తన సామర్థ్యానికి తగ్గ అభివృద్ధిని ఇప్పటికే సాధించి ఉండేది. మన ఎన్నికల వ్యవస్థలో లోపాలు కూడా పార్టీల నియంతృత్వానికి ఆజ్యం పోసేవిగా ఉన్నాయి. ఒక్క ఓటు ఎక్కువ వస్తే చాలు గెలుపే, తక్కువ వస్తే ఓటమే.. అనే ఎఫ్‌పీటీపీ ఎన్నికల పద్ధతి మన దేశం ఉన్న పరిస్థితుల్లో దోపిడీ డబ్బు రాజకీయాన్ని విపరీతం చేసింది.

**5) దామాషా ఎన్నికల పద్ధతి:**

దేశానికి ఎంతో కీలక సమయంలో అద్భుత నాయకత్వాన్ని అందించిన పీవీ లాంటి వారిని రెండోసారి కూడా వరుసగా గెలిపిస్తే మార్పు వేళ్లూనుకుపోతుంది. అలాంటి వారిని రెండోసారి ఓడిస్తే, మార్పుకు చొరవ తీసుకోవటానికి ముందుకొచ్చే వారి సంఖ్య తగ్గిపోతుంది. తనకు రాజకీయ భిక్ష పెట్టాలని తెలుగునాట అనకాపల్లి వంటి చోట సభల్లో పీవీ బహిరంగంగా చేయిజాచి అర్థించినా భారతదేశంలోని పలు రాష్ట్రాలవారితోపాటు తెలుగువారు కూడా రెండోసారి ఆయన్ను గెలిపించలేదు. పీవీ తర్వాత వాజ్‌పేయికి కూడా అదే అనుభవం ఎదురైంది. 2004లో వాజ్‌పేయి ప్రభుత్వం తిరిగి ఎన్నికై ఉంటే, ఈ దేశం పెద్దవిజయాల్ని అందుకోగలిగి ఉండేది, అనేక దీర్ఘకాల సమస్యల్ని పరిష్కరించుకునుండేది. ఓడిపోయే అవకాశముంది అనుకుంటే, ఎంతటి గొప్పవారికైనా మన దేశంలో అరుదుగా తప్ప ఓట్లు పడవు. పీవీ, వాజ్‌పేయిల నాటి కంటే పరిస్థితి మరింత దిగజారిందిప్పుడు.

యాదృచ్ఛికంగానో, పరిస్థితులు అనుకూలించో ఒకసారి పదవిలోకి వెళ్లి సంస్కరణలు తెచ్చినవారి పట్ల ప్రజల్లో ఏర్పడిన ఆదరణ తిరిగి ఎన్నుకునే స్థాయిలో లేకుండే అవకాశాలు మన దేశంలో ఎక్కువ. ఏదోక తాత్కాలిక భావోద్వేగ అంశం, ఆకర్షణలు ప్రజానీకంలో ఎక్కువమందిని ప్రలోభపెడుతు ంటాయి. గెలిచినవారికి తప్ప మిగిలిన అభ్యర్థులకు వచ్చిన ఓట్లన్నీ వృథా అనే ఇప్పుడున్న ఎఫ్‌పీటీపీ ఎన్నికల వ్యవస్థను మార్చి, ఓట్ల శాతాన్ని బట్టి సీట్ల గెలుపుని నిర్ణయించే దామాషా ఎన్నికల పద్ధతిని ప్రవేశపెడితే.. ఎవరు గెలుస్తారనే సంశయం లేకుండా సంస్కరణలకవిలువను అవగాహన చేసుకున్నవారు కచ్చితంగా మార్పు తెచ్చే నాయకత్వానికే ఓటు వేస్తారు. దీంతో, సంస్కరణలు దెబ్బతినటమో, సంవత్సరాల తరబడి ఆగిపోవటమో అనే ప్రమాదం తగ్గుతుంది. సంస్కరణలకున్న మద్దతు చెదిరిపోకుండా పెరుగుతూనే ఉంటుంది.

దామాషా ఎన్నికల పద్ధతిని ప్రవేశపెడితే.. డబ్బు ప్రభావం కట్టడవటంతోపాటు, విధానాల ప్రాతిపదికన ఓట్లు కోరే సమర్థులు, పార్టీలు నేరుగా ఎన్నికల్లో నెగ్గే పరిస్థితులు బాగా మెరుగవుతాయి. సమర్థ నాయకత్వమున్న పార్టీలు పూర్తి మెజారిటీని సాధించలేకపోయినా, కూటములుగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటమో లేదా ప్రభుత్వం ఏర్పాటు చేసిన పార్టీని సరైన విధానాల వైపు ప్రభావితం చేయగలగటమో సాధ్యమవుతుంది. పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని ప్రతిష్ఠించటం, విరాళాల సేకరణను జవాబుదారీ, పారదర్శకం చేయటం, రాజకీయ అవినీతిని నియంత్రించేందుకు కఠిన విధానాల్ని అమలు చేయటం, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, దామాషా పద్ధతి వంటి ఎన్నికల సంస్కరణలు తీసుకురావటం మొదలైన మార్పులు చేపడితేనే సంస్కరణల్ని ప్రవేశ పెట్టగల, సరైన దిశలో నడపగల సత్తా గలవారు అధికారంలోకి వచ్చేందుకు తగిన రాజకీయ వాతావరణం ఏర్పడుతుంది.

'ఇండియన్ డెమొక్రసీ ఎట్ వర్క్' సిరీస్ తొలి కార్యక్రమంగా 'ధనరాజకీయల కట్టడి'పై జేపీ నేతృత్వంలో 2020 జనవరిలో హైదరాబాద్‌లో జరిగిన జాతీయ సదస్సులో బీజేపీ, కాంగ్రెస్ సహా వివిధ పార్టీల అగ్ర నేతలు, కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాల సారథులు, రాజకీయ, పాలనా విశ్లేషకులు, విద్యావేత్తలు, సీనియర్ జర్నలిస్టులు కూడా ప్రత్యక్ష ఎన్నికలు, దామాషా ఎన్నికల పద్ధతిపై దేశవ్యాప్త చర్చకు పిలుపునిచ్చారు. సదస్సు వెలువరించిన 'హైదరాబాద్ డిక్లరేషన్' ఈ విధంగా ప్రకటించింది: "ఇప్పుడున్న ఎన్నికల విధానం స్థానంలో ప్రత్యామ్నాయ పద్ధతులపై పారదర్శకంగా, సమగ్రంగా, లోతైన చర్చ దేశవ్యాప్తంగా జరగాలి. చట్టసభలు, ప్రభుత్వం మధ్య స్పష్టమైన అధికారాల విభజన.. ప్రభుత్వాధినేతలు చట్టసభ సభ్యుల మీద ఆధారపడకుండా ప్రత్యక్షంగా ఎన్నుకోవటం.. ఎఫ్.పి.టి.పి ఎన్నికల విధానం స్థానంలో దామాషా ఎన్నికల పద్ధతి వంటివి పరిశీలించవచ్చు. వీటిని అమలు చేయాలనుకుంటే, జాతీయ స్థాయిలో అన్ని ప్రాంతాలకూ విస్తృత ప్రాతినిధ్యం లభించేలా, కులం, మతం, తెగ వంటి వాటితో రాజకీయం చీలికలు పీలికలు కాకుండా నివారించేలా, ప్రభుత్వాల స్థిరత్వానికి ఢోకా లేకుండా ఉండేలా భారతదేశ పరిస్థితులకనుగుణంగా మార్పులు చేర్పులు చేయాలి".

..సాక్షాత్తూ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ హత్యపై న్యాయవిచారణలో జరిగిన జాప్యం పీవీకి కూడా పార్టీపరంగా నష్టం చేసింది. న్యాయవిచారణతోపాటు న్యాయాధికారుల సామర్థ్యంలో లోపం వల్ల ఆర్థిక వివాదాలు సకాలంలో, సరైనరీతిలో పరిష్కారం కాకపోవటం పెట్టుబడులను, ఆర్థిక సరళీకరణ లక్ష్యాల్ని సైతం దెబ్బతీస్తోంది. న్యాయసంస్కరణలు సహా ఇంకా కొన్ని అంశాలున్నా, పైన పేర్కొన్న ఐదు అంశాలతో మొదలుపెట్టయినా వేగంగా సంస్కరణల్ని అమలు చేస్తే పీవీ విజయాల్లోని ఖాళీల్ని పూరించిన వారమవుతాం. వాటిని ఇంకా అలాగే కొనసాగిస్తే, పీవీ ఆర్థిక సంస్కరణల విజయాల్ని పరిమితం చేసినవారమవుతాం, మన కాలపు సమస్యల్ని భావితరాలకు బదిలీ చేసిన దోషులమవుతాం. పీవీ ఘనతను ఇప్పటికైనా గుర్తించినవారు, ఇప్పటికే గుర్తించినవారు కలసికట్టుగా కృషి చేస్తే .. ఈ సంస్కరణలను చూస్తుండగానే సాధించేయగలం.

# ఆరోగ్య వ్యవస్థ వైఫల్యానికి బలైన నిసార్..

## లోక్‌సత్తాకు గొప్ప మిత్రుడని జేపీ నివాళి

తన సృజనాత్మక శక్తులను సమాజం కోసం వెచ్చించిన కవి, గాయకుడు నిసార్ కొవిడ్-19తో అకాల మరణం చెందటం విషాదకరమని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఆయనకు సకాలంలో చికిత్స లభించకపోవటం దారుణమన్నారు. కరోనా వైద్యసేవల్ని సమర్థంగా అందించేందుకు సరైన పద్ధతుల్ని రూపొందించి అమలు చేయటంలో వ్యవస్థ వైఫల్యానికి నిసార్ బలయ్యారన్నారు. లోక్‌సత్తా ఉద్యమానికి నిసార్ గొప్ప మిత్రుడని, లోక్‌సత్తా భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పాటలు రాసి పాడారన్నారు. నిసార్ మృతి సమాజానికి పెద్ద లోటని జేపీ నివాళులర్పించారు.

# మిత్రమా నిసార్ మనం ఓడిపోయాం కానీ..

**- శిరమని నరేష్**



"సర్కార్ దవఖాన పేరుకైతే గొప్పది.. ఎంతో ముద్దుగుంటది.. దవఖానకు పోతే ఉన్న రోగమెక్కువైతది" అని నువ్వు రాసిన పాట నీ జీవితంలోనే నిజమవుతుందని, నీ ప్రాణాలని బలికొంటుంది అని అస్సలు ఊహించలేకపోయాను నిసార్.

"కరోనా కరోనా" అంటూ వందేమాతరం శ్రీనివాస్ గొంతులో నీ పాట విని, కరోనాపై వచ్చిన సాంగ్స్‌లో సెకండ్ బెస్ట్ నీది అని నేను ఫోన్ చేసి చెప్పింది మొన్నే కదా... "నీ నోట్లో దుమ్ము కొడతాం, నిను భారత భూభాగం నుండి తరిమికొడతాం" అని మాకు ధైర్యం చెప్పిన నిన్నే, కరోనా కబళిస్తుంది అని అస్సలు అనుకోలేదు నిసార్.

2003లో నువ్వు పరిచయం అయినప్పటి నుంచి ఎన్ని పాటలు రాయించాను నీతో.. ఏలుబడి తీరు చూడు ఎట్లున్నది మన ఊరుబడి తీరు గూడ గట్లున్నది అని మన పాలన తీరుని ఎండగట్టావ్. ఒకటా రెండా.. కనీసం యాభై పాటలు రాసుంటావ్ లోక్‌సత్తా కోసం. పల్లె కళలు, ఆటలు కనుమరుగు అవుతున్నాయ్ అనే ఆవేదనతో "పండు వెన్నెల లోన ఆడేటి ఆటలెటు బోయే" అని నువ్వు రాసిన పాట లేకుండా రసమయి ధూమ్ ధామ్ ఎప్పుడైనా నడిచిందా?

విద్యని, ఆరోగ్యాన్ని పట్టించుకోని, ఈ దోపిడీ పాలన అంతం కావాలని, అవినీతిని, వారసత్వ రాజకీయాలను యువతరం ఎదిరించాలని.. ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని, మార్పు సాధించాలని మనం చేసిన ప్రయత్నంలో మనం ఓడిపోయాం నిసార్.

జనాలు కరోనాతో అల్లాడుతుంటే, ప్రభుత్వ పెద్దలు బంగారు తెలంగాణ నిర్మాణం కోసం సచివాలయాన్ని కూలగొట్టి కొత్త నిర్మాణం చేస్తుంటే, ఇప్పుడది అవసరమా అని అడగలేని, చేవచచ్చిన జనాలని చూసి, ఈ జనాల కోసమా నేను పాటలు రాసింది, ఈ మొద్దు జనాన్ని నిద్రలేపడానికా నేను అక్షరాలని ఈటెలుగా మార్చి విసిరింది అనే బాధతో నీ గుండె బద్దలయి ఉంటుంది.

ప్రైవేట్ హాస్పిటల్స్‌లో వైద్యం అందక, సర్కార్ దవఖానలో వెంటిలేటర్ పెట్టే దిక్కులేక, ఊపిరాడక నువ్వు ఈ లోకాన్ని విడిచి వెళ్లావంటే.. మనం ఓడిపోయినట్లే కదా నిసార్. నీ వ్యక్తిగత తప్పిదం కన్నా.. వ్యవస్థ వైఫల్యమే నిన్ను అకాల మరణంలోకి నెట్టింది.

మనం ఓడిపోయాం కానీ, యుద్ధాన్ని వదిలే ప్రశ్నే లేదు. మనం కలలు కనే సురాజ్యం సాకారం అయ్యేదాకా.. నీ పాటలని గుర్తు చేసుకుంటూ.. కామ్రేడ్ అని పిలిస్తే, నీకు ఇష్టం అని తెలిసినా, నేను కమ్యూనిస్టును కాను కాబట్టి, ఒక్కసారి కూడా నిన్ను కామ్రేడ్ అని పిలవలా.. ఒక్కసారి నీకోసం అంటున్నా.. జోహార్ కామ్రేడ్ నిసార్.

# మనమెవరమూ ప్రాణాలర్పించాల్సిన పన్లేదు..

'నేను తెలివైనవాడిని' అని ప్రతివాడు అనుకున్నట్లుగానే నీవు అనుకున్నావు కానీ, నువ్వంత తెలివైన వాడవేమీ కావు!!!

నువ్వు తెలివైన వాడవే ఐతే నీ చుట్టూనే ఏదోక ప్రభుత్వ, ప్రయివేటు కొలువును వెతుక్కోకుండా,

దేశ రక్షణ అంటూ.. దేశం నాకేమిచ్చింది అనే కంటే దేశం కోసం ఏదైనా ఇవ్వాలంటూ సైనిక కొలువులో ఎందుకు చేరేవాడవు?

నువ్వు అంత కష్టపడి సైనిక పాఠశాలలో చదివింది ఎందుకు?

14,000 మీటర్ల ఎత్తులో, వెన్నులో వణుకు పుట్టే చలిలో మా రక్షణకై నీ ప్రాణాలు బలిపెట్టటానికా?

ఏ ఇతర ప్రభుత్వ కొలువులో చేరినా మంచి జీతం వస్తుంది!

నువ్వు కోరుకోవాలేగాని గీతం (లంచాల) కోసం

ఇంతకు ముందులా బల్ల కింద చెయ్యి పెట్టాల్సిన అవసరం లేదు ఇపుడు

'అంతా బహిరంగమే మరి/బల్లపై నుండే'!

నువ్వు ఏమి చేశావో తెలుసా? మమ్మల్ని కాపాడాలనే నీ చాదస్తంతో 'ఫాదర్స్ డే' నాడు, నీ కన్నబిడ్డకి 'నాన్నా' అనే పిలుపు లేకుండా చేశావ్.

నువ్వు ఏదో అనుకున్నావు గాని...

మాకేంటి చెప్పు, ఏది జరిగినా మాకు ఆ రెండు రోజులే చర్చ/ తిని తుడిచేసుకున్న మాదిరిగా ఏదీ అంత పెద్ద సీరియస్‌గా తీసుకోం.

అర లక్ష జీతం తీసుకునేవాడు కూడా, అర నిముషంలో పోస్టల్ బ్యాలెట్ ఓటును అమ్ముకుంటున్నాడు తెలుసా?

ఏదో నీలాగా నిజాయితీగా, ధవళ వర్ణ కాగితంలాగా ఉండాలనే చాదస్తం ఉన్నవాళ్లు కొద్దిమందే!

ఏదో ఆవేశంలో నీ త్యాగం ఎప్పటికీ మరువం అంటున్నాం కానీ,

నువ్వు మా కోసం నీ కన్నబిడ్డనీ, కట్టుకున్నామెని, కన్నవాళ్లని, తోబుట్టువులను దిక్కులేని వారిని చేశావనే స్పృహ మాకే గనుక ఉంటే, మేమెందుకు అవినీతిపరులకి మా విలువైన ఓట్లను అమ్ముకుంటాం చెప్పు?

మేమెంత దేశభక్తులమో తెలుసా? సైనిక శవపేటికల కుంభకోణంలో మునిగి ఉన్న నాయకుడైనా కేవలం మా కులం వాడైతే చాలు/ మళ్లీ మళ్లీ అతనినే గద్దె నెక్కిస్తాం.

15 ఏండ్లు దేశ రక్షణ కోసం శతృమూకలకు అడ్డుగా నిలబడ్డావు కదా? తదుపరి వెంటనే వచ్చేయకూడదూ?

'5' ఏండ్లు మాకు మంచి నాయకులుగా ఉంటారని నమ్మి మేము గెలిపిస్తే, 5 నిముషాలలో పార్టీ ఫిరాయించేవాళ్లని నెత్తిన పెట్టుకుని వారికి భజన చేయటంలా మేము?



మాకు ఆలస్యంగా తెలిసింది, నీ మీద పెద్ద బండరాయి వేశారని. అంత పెద్దరాయి నీ మీద పడుతుంటే తప్పుకోకుండా ఎందుకు నిలబడ్డావు వీర సైనికుడా? ఆ రాయి నీ దేశ ప్రజల మీద పడుతుందని గుండెల్లో కొలువైన దేశమాతను తలచుకొంటూ అడ్డుగా నిలబడ్డావా?

ఏదేమైనా మీ సైనిక సోదరులు నిజమైన దేశభక్తికి నిలువుటద్దాలు/అసమాన త్యాగానికి ప్రతిరూపాలు/దేశరక్షణకై మరణాన్ని సైతం కౌగిలించుకునే ధీరోదాత్తులు.

ఎప్పటికీ మీరు నిఖార్సైన హీరోలు/ వీరులారా మీకు నిండువందనం - మీ వల్లే మా గుండెనిబ్బరం!

మమ్మల్ని నిరంతరం కాపాడుతున్న వీర సైనికులకి క్షమాపణలతో...

(సంతోష్ బాబు లాంటి సైనిక వీరుల్లాగా మనం ఎవరమూ దేశం కోసం ప్రాణాలు అర్పించాల్సిన పనిలేదు!

దేశభక్తి ఉన్నవారు ఓటును నిజాయతీగా వేసే కనీస విలువను పాటిస్తే చాలు, మనకు, మన భవిష్యత్ తరాలకు అదే గొప్ప మేలు/ ఇదే నేను చెప్పదలచుకున్నది...)

– మాదాసు భానుప్రసాద్,
ఎంఏ ఎల్ఎల్‌బీ, అడ్వొకేట్,
లోక్‌సత్తా పార్టీ ఏపీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు

# ప్రభుత్వాల నిర్వాకం వల్లే ప్రజలకు కరోనా కష్టాలు, ఖర్చులు పెరిగాయ్: జేపీ

**మొక్కుబడిగా కాకుండా.. ప్రభుత్వ, ప్రైవేటు డాక్టర్లు, వేలమంది ఆరోగ్య కార్యకర్తలతో కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలి**

**ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థ ఉంటే ఇవేమీ లేకుండానే ప్రజలందరికీ నాణ్యమైన సేవలందేవి**

**బ్రిటన్‌లో ప్రధానికి అందే వైద్యమే వ్యవసాయ కార్మికునికి కూడా అందుతుంది**

**ఎన్‌హెచ్ఎస్ తరహా విధానాన్ని మన దేశంలో కూడా తేవాలి**

**ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా తాజా వెబినార్ సిరీస్‌లో జాతీయ, అంతర్జాతీయ నిపుణులు కూడా ఇదే ప్రతిపాదించారు**


సమాజం నుంచి ఎంతో మద్దతు లభించినా ప్రభుత్వాలు సరైన రీతిలో కొవిడ్‌ను ఎదుర్కోక పోవటం వల్ల తెలుగునాట, దేశవ్యాప్తంగానూ ప్రజలకు బాధలు, ఆందోళనలు, ఖర్చులు పెరిగాయని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

మన దేశంలో కరోనా వ్యాధి పరిణామాలు, ప్రభుత్వాలు తీసుకోవాల్సిన చర్యలు, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జేపీ 2020 జనవరి-ఫిబ్రవరి నుంచి మీడియా ద్వారా, తన సోషల్ మీడియా ఖాతాల ద్వారా మాట్లాడుతూ తన నిర్మాణాత్మక సూచనల్ని, సలహాల్ని శాస్త్రీయ ఆధారాలతో సహా పంచుకుంటున్నారు. పలువురు నిపుణులతో చర్చలు చేస్తూ విధానాలపరంగా కూడా ఏకాభిప్రాయాన్ని కూడగడుతున్నారు. జులై మొదటివారంలో మీడియాకు జేపీ ఇచ్చిన ఇంటర్వ్యూల్లోని కొన్ని అంశాలివి..

కొవిడ్ బారిన పడిన వారిలో 5-10 శాతం లోపు మందికి పరిమితమవ్వాల్సిన సమస్యను మన పాలకులు 100 శాతం మంది సమస్యగా మార్చారని, మిగిలిన సమాజాన్ని గందరగోళంలోకి నెట్టారని జేపీ అన్నారు. పాతరాజకీయ వాసనలు వదల్లేకపోవటం, అవగాహన, ముందుచూపు కొరవడటమే ఇందుకు కారణమన్నారు.

"కరోనా సంక్షోభం ఇప్పటికీ అదుపు తప్పలేదు. మనలో అందరికీ ఆరాటం ఉంటుంది. మనల్ని, మన కుటుంబాల్ని, సన్నిహితుల్ని కాపాడుకోవాలని! ఎవరికి ఉండదు?.. అర్థవంతమైన జీవితానికి ఈ ఆరాటం ఉండాలి కూడా. కానీ కరోనాపై పోరులో గందరగోళం, ఆర్భాటం తప్పు.. ప్రజల్లో ఆలోచన, పరిజ్ఞానం, అవగాహన పెంచటానికి మన ప్రభుత్వాలు పెద్దగా ప్రయత్నం చేయటం లేదు. గుడ్డెద్దు చేల్లో పడ్డట్టు, ఏ రోజుకారోజు అన్నట్లు ప్రభుత్వాలు వ్యవహరించటం వల్ల ప్రజలకు బాధ, ఆందోళన, ఖర్చు పెరిగిపోతున్నాయి. ప్రభుత్వాలు అసాధ్యాలు చేయాలని, అద్భుతాలు సృష్టించాలని ఎవరూ ఆశించటంలా. ఉన్న వనరుల్లోనే సరైన రీతిలో, శాస్త్రీయంగా, ప్రజల్లో అవగాహన పెంచుతూ ఎదుర్కోమంటున్నాం. ఈ మేరకు చేసినా.. కరోనాపై సునాయాసంగా విజయం సాధిస్తాం. ఇప్పుడు 7 లక్షల కేసులు ఉన్నాయంటే మన దేశంలో అంతకు 30 రెట్లు ఎక్కువగా వైరస్ 'నిశ్శబ్దంగా' (ఆరోగ్య సమస్యలు సృష్టించకుండా) పాకి ఉంటుందని శాస్త్రీయ అధ్యయన ప్రభుత్వ సంస్థ ఐసీఎంఆర్ చేసిన మదింపు తెలియజేస్తోంది. అంటే, దాదాపు 2 కోట్ల మందికి ఇప్పటికే వైరస్ సోకిందనుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లో 0.73% మందికి ఇన్ఫెక్షన్‌గానో, వ్యాధిగానో వైరస్ సోకిందని ఇందులో తేలింది. అంటే పల్లెల్లోని దాదాపు కోటి మంది ఇప్పటికే కరోనా తాకిడికి గురయ్యారు. పట్టణ ప్రాంతాల్లో ఈ సంఖ్య దాదాపు 15-30 శాతం వరకూ ఉండొచ్చని అంచనా. వీళ్లలో నూటికి 5 నుంచి 10 మందికి మాత్రమే ఆస్పత్రి అవసరముంటుంది. మిగిలినవారికి కేవలం వైద్యుల మార్గదర్శకాలు చాలు. ఇది మనం అర్థం చేసుకుంటే కొవిడ్‌ను ఎదుర్కోవటానికి ప్రణాళిక స్పష్టమవుతుంది. ప్రభుత్వం అశాస్త్రీయంగా, ఆర్భాటపు పద్ధతిలోనే వ్యవహరించటం, క్వారంటైన్‌ని ఆస్పత్రులలో పెట్టటం వంటి మూర్ఖపు పనులు చేయటంతో ప్రజల్లో గందరగోళం పెరిగింది, అందరూ

ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. ప్రభుత్వాస్పత్రిలో చేరితే వైరస్ ప్రమాదం ఇంకా పెరుగుతుందనే భయంతో అప్పు చేసైనా ప్రయివేటు ఆస్పత్రికి వెళ్లాలని పలువురు ఆరాటపడుతున్నారు. అక్కడ బిల్లులు మాత్రం వారికి చుక్కలు చూపిస్తున్నాయి. ఇదంతా ప్రభుత్వం సృష్టించిన గందరగోళం. మన దేశంలో ఇంకా నిర్ధారితంకాని వివిధ కారణాల వల్ల కరోనా తీవ్రత తక్కువగా ఉన్నా కూడా ఆ అదృష్టాన్ని సైతం పాలకులు సమర్థంగా ఉపయోగిం చలేకపోయారు. అతి తక్కువ ఖర్చుతో, అతి ఎక్కువ మంది ప్రజల ప్రాణాల్ని కాపాడేలా ప్రభుత్వం వ్యవహరించగలిగితేనే మంచి పాలన అవుతుంది. కరోనా విషయంలో ఇది పూర్తిగా సాధ్యం. అయితే ఇందుకు పరిజ్ఞానం, ముందు చూపు, శాస్త్రజ్ఞానం కావాలి. సదుద్దేశం చాలదు, లోతైన అవగాహనను కూడా ప్రదర్శించాలి" అని జేపీ అన్నారు.




ప్రభుత్వం సృష్టించిన గందరగోళం వల్ల పలువురు పలుకుబడి ఉపయోగించి మరీ ప్రైవేటు, కార్పొరేట్ హాస్పిటల్ బెడ్‌లను ఆక్రమిస్తున్నారని, వారిలో కొందరు అప్పులు చేసి, ఆస్తులు తాకట్టు పెట్టి మరీ బిల్లులు కడుతున్నారని జేపీ అన్నారు. హైదరాబాద్‌లో కార్పొరేట్ ఆస్పత్రి బిల్లుపై స్వయంగా ఓ ప్రభుత్వ వైద్యాధికారిణి సైతం బహిరంగ ఆరోపణలు చేశారన్నారు. పలు ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో అత్యంత ఖరీదైన పరికరాలు, ఎంతో అనుభవముండి నిష్ణాతులైన డాక్టర్లు, వైద్య సిబ్బంది ఉంటారని, విదేశాలతో పోలిస్తే మన వైద్య సేవలు ఎంతో చవకే అయినప్పటికీ మన ఆదాయ ప్రమాణాల ప్రకారం చూస్తే మన దేశంలో ఎక్కువమందికి అవి పెద్ద భారమని అన్నారు. ఒక్కో రోగిని 24 గంటలూ పర్యవేక్షించాలంటూ మూడు వైద్య బృందాలు పనిచేస్తాయని, వారికి ఉపయోగించే పీపీఈ సూట్లే పదివేల రూపాయల దాకా అవుతాయని అన్నారు. ఈ రకంగా రోగుల మీద భారీ బిల్లులు పడుతున్నాయన్నారు. "మనం వాళ్లను తిడుతున్నాం అదే పనిగా. కానీ గోటితో పోయే దాన్ని గొడ్డలి దాకా తెచ్చింది ప్రభుత్వం. రూ.1 ఖర్చుతో పోయేదానికి రూ.1,000 ఖర్చు దాకా తెచ్చింది ప్రభుత్వం. అత్యవసరమైతే తప్పదు. కానీ వైద్యుల సలహాలతో సాధారణ బిళ్లలతో పోయే దానికి కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్లి వేల రూపాయలు కట్టేలా ప్రభుత్వమే గందరగోళం సృష్టించటం వల్ల, సామాన్య, మధ్యతరగతి వారు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం అప్రమత్తంగా సరైన ప్రొటోకాల్స్‌ని అమల్లోకి తెచ్చి ఉంటే ఈ వైఫల్యం తప్పేది" అని జేపీ అన్నారు.

ప్రభుత్వాల హ్రస్వదృష్టి వల్ల ఇతర జబ్బులతో బాధపడేవారికి చికిత్సే అందని ప్రమాదకర పరిస్థితి ఏర్పడిందని జేపీ అన్నారు. "ప్రపంచంలో అత్యధికంగా టీబీ కేసులు నమోదవుతున్న దేశం ఇండియా. దీనికి మందులున్నాయి. కానీ టీబీ, జీవనశైలి వ్యాధుల్ని గుర్తించే వైద్యసదుపాయాలే ఇప్పుడు అందుబాటులో లేకుండా పోయాయి. వీరంతా వ్యాధి బారిన పడటం, ఇంకొందరికి వ్యాపింప చేయటం, కరోనా పరీక్షల నిరీక్ష ణలో ప్రాణాల మీదకు తెచ్చుకోవటం,.. ఇదంతా ప్రభుత్వాల గందరగోళం వల్ల తలెత్తిన నివారించదగ్గ సంక్షోభం" అని జేపీ ఆవేదన వ్యక్తం చేశారు.

"ప్రభుత్వాలు సరైన దిశలో వ్యవహరిస్తే సోషల్ మీడియా, పత్రికలు, టీవీలు వంటి వాటి ద్వారా ప్రజల్లో విస్తృతంగా అవగాహన పెంచవచ్చు. ఇంటి వద్ద క్వారంటైన్‌కు అవకాశం లేని పేదలకు హాస్టళ్లలో, ఇతర భవనాల్లో వసతి ఏర్పాటు చేయవచ్చు. ఈ చిన్నపాటి చర్యల వల్ల 90 శాతం మంది సమస్యకు పరిష్కారం లభిస్తుంది. 1918–20 కాలంలో స్పానిష్‌ఫ్లూ వచ్చినప్పుడు, ఇప్పుడున్నంత పరిజ్ఞానం, సాంకేతిక సదుపాయాలు, టీకా అవకాశాలు లేకున్నా కూడా ప్రజలు కేవలం చిన్నపాటి చర్యలు, జాగ్రత్తలతోనే వైరస్ బారిన పడకుండా కాపాడుకున్నారు. ప్రభుత్వం వ్యాధి స్వరూపాన్ని అర్థం చేసుకుని, ప్రజల్లో అవగాహన పెంచుతుంటే వ్యాధి నుంచి బయటపడటం పూర్తిగా సాధ్యం" అని జేపీ అన్నారు.

**మొక్కుబడిగా కాకుండా.. ప్రభుత్వ, ప్రైవేటు డాక్టర్లు, వేలమంది ఆరోగ్య కార్యకర్తలతో కాల్‌సెంటర్‌ను ఏర్పాటు చేయాలి**

"మన వద్ద ఇప్పటికీ మంచి ఫిజిషియన్లు ఉన్నారు. కరోనాకు చక్కటి వైద్యం అందిస్తున్నారు. అరకొరగా కాకుండా.. ప్రభుత్వ, ప్రైవేటు రంగంలోని ఈ డాక్టర్లు, వందల, వేల సంఖ్యలో ఆరోగ్య కార్యకర్తలతో ఒక సమగ్ర కాల్‌సెంటర్‌ని హెల్ప్‌లైన్‌గా ఏర్పాటు చేసి ప్రజలందరికీ ఎప్పటికప్పుడు సూచనలిచ్చే ఏర్పాటు చేస్తే చాలు.. 90 శాతం మంది ప్రజలకు తక్షణ భరోసా లభిస్తుంది, పరిష్కారం మొదలవుతుంది. జ్వరం, ఒళ్లు నొప్పులకు బిళ్లలు, రక్తం గడ్డకట్టే ప్రమాదం తలెత్తకుండా లోమోతాదులో ఆస్ప్రిన్ వంటివి, ఇమ్యూనిటీ హైపర్‌డ్రైవ్ లేకుండా తగిన మందులు, పల్స్ ఆక్సీమీటర్ వినియోగించటం మొదలైనవన్నీ కాల్ సెంటర్ నుంచే డాక్టర్లు సూచిస్తారు. కొవిడ్‌కు సంబంధించి అనుమానమున్నా, లక్షణాలు వచ్చినా ఈ కాల్‌సెంటర్‌కు ప్రజలు ఫోన్ చేస్తే, తొలుత సిబ్బంది, ఆ తర్వాత డాక్టర్ మాట్లాడే ఏర్పాటు చేయొచ్చు. ఫోన్ చేసిన వ్యక్తి ఏం చేయాలో వైద్యులు సూచిస్తారు. ఒకవేళ పరీక్ష చేయించుకుని వచ్చాక కరోనాగా తేలితే లక్షణాల్ని బట్టి ఇంటి వద్దే క్వారంటైన్ చేయటమా, ఆస్పత్రిలో చేరటమా కూడా వారే చెబుతారు. అత్యధికులకు ఇంటి వద్దే క్వారంటైన్ సరిపోతుంది. వీరికి మందులు, ఇతరత్రా

అవసరాల్ని వైద్యులు ఎప్పటికప్పుడు సూచిస్తుంటారు. స్థానిక మెడికల్ దుకాణంలో అందుబాటులో ఉండే సాధారణ, స్వల్ప ధరల మందులతోనే వీరికి నయమవుతుంది. ఆక్సీమీటర్‌ను తెచ్చుకుని ఆక్సిజన్ స్థాయి 95కి పైగా ఉందా, లేదా రోగులే పరీక్షించుకోవచ్చు. ఆక్సిజన్ స్థాయి మరీ పడిపోయినప్పుడే ఆస్పత్రి అవసరం ఏర్పడుతుంది. అలాంటప్పుడు ఆస్పత్రిలో చేరటానికి వైద్యులే సూచనలు చేస్తారు. ఒకసారి రోగి కాల్ సెంటర్‌కి ఫోన్ చేశాక, ప్రతిరోజూ కాల్‌సెంటర్ నుంచి ఆ రోగికి ఫోన్ చేసి, పరిస్థితి సమీక్షించి సూచనలిచ్చే ఏర్పాటు చేస్తే సులభంగా 90% సమస్య పరిష్కారం అవుతుంది. ఈ ఏర్పాటు చేస్తే, ఎటువంటి గందరగోళం లేకుండా వైద్యసేవలు అందుతాయి.

ఇంటి దగ్గరో, హాస్టల్ వంటి చోటో క్వారంటైన్ చేసే వారితో రోజుకోసారి వైద్యులు మాట్లాడే ఏర్పాటు చేయవచ్చు. ఒక్కో రోగికి రోజుకు రూ.100 చొప్పున వైద్యులకు చెల్లించవచ్చు.

## వ్యాయామాన్ని కూడా ప్రోత్సహించాలి

**కొవిడ్ కట్టడిలో భాగంగా మాస్కుల వినియోగం, భౌతిక దూరం పాటించటం, పరిశుభ్రతపై ప్రభుత్వం నిరంతర ప్రచారం చేయాలని జేపీ అన్నారు. ఏమాత్రం అవగాహన లేకుండా పార్కుల్ని కూడా మూసివేశారని, దీనివల్ల మధ్యవయస్కులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. వ్యాయామం లేకుంటే రోగనిరోధకశక్తి ఎలా పెరుగుతుంది? అన్నారు. పౌష్టికాహార వినియోగాన్ని, వ్యాయామాన్ని ప్రభుత్వం పెద్దఎత్తున ప్రోత్సహించాలన్నారు.**

ఇలా వ్యాధి తగ్గేదాకా 10 రోజులపాటు చేస్తే ఒక్కో పేషెంట్‌మీద ప్రభుత్వం చేసే ఖర్చు రూ.1000 మాత్రమే అవుతుంది. ఇది చాలా చిన్న మొత్తం. ఈ పని వెంటనే చేయొచ్చు. గంటల్లో చేయొచ్చు. ప్రభుత్వమే చేయక్కర్లేదు, స్వచ్ఛంద సంస్థలు కూడా చేసేయగలవు" అని జేపీ అన్నారు.

### ఫ్యామిలీ డాక్టర్ పద్ధతి ఉంటే కాల్ సెంటర్ వంటివి అవసరమే ఉండేది కాదు

మన పాలకులు దశాబ్దాలపాటు చేసిన దుష్పరిపాలన వల్ల ఇప్పటికీ మనకు సరైన ప్రజారోగ్య వ్యవస్థ లేదు కాబట్టి.. ఈ ఏర్పాట్లు చెబుతున్నానని, ఇదేగనక, బ్రిటన్‌లోలా ప్రతి కుటుంబానికీ ఫ్యామిలీ డాక్టర్ పద్ధతి ఉంటే కాల్ సెంటర్ కూడా అక్కర్లేదని, ఫ్యామిలీ డాక్టరే ఎప్పటికప్పుడు సలహాసూచనలు, పర్యవేక్షణలు, మార్గదర్శకాలు అందచేస్తుంటారని జేపీ వివరించారు. "కాల్ సెంటర్‌తో అనుసంధానమై క్వారంటైన్‌లో ఉంటున్నవారు కాకుండా మిగిలిన 10 శాతం మందికి మాత్రం




ఆస్పత్రుల్ని సిద్ధం చేసుకోవాలి. వైరాలజీ విభాగం అంచనా ప్రకారం సెప్టెంబర్‌నాటికి 20 కోట్ల మందికి వైరస్ సోకే అవకాశం ఉంది. వ్యాధి కేసులు 60–70 లక్షలు ఉంటే, కనీసం 6–7 లక్షల మందికి ఆస్పత్రి సదుపాయాల్ని సిద్ధం చేయాలి. ప్రభుత్వం గాలివాటంగా వ్యవహరించకుండా నిపుణులతో చర్చించి శాస్త్రీయంగా, అవగాహనతో ప్రణాళికాబద్ధంగా వెళ్తే ఈ 3 నెలల్లో ఏర్పాట్లు చేయటం పూర్తిగా సాధ్యం" అని జేపీ అన్నారు.

ఎక్కడైతే పాలకులు శాస్త్రీయంగా, ముందుచూపుతో నిర్ణయం తీసుకున్నారో, ఎక్కడైతే ప్రజారోగ్య వ్యవస్థ బలంగా ఉందో, ఎక్కడైతే వీలైనన్ని ఎక్కువ పరీక్షలు నిర్వహిస్తూ దాపరికం లేకుండా సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు పారదర్శకంగా అందించారో, ఎక్కడైతే చిట్టచివరి పౌరుని వరకు కూడా సేవలందించే సామర్థ్యమున్న పాలనా వ్యవస్థ ఉందో, ఎక్కడైతే వికేంద్రీకరణతో ప్రజలతో సంభాషిస్తూ వారిని భాగస్వాముల్ని చేశారో.. అలాంటి దేశాల్లో కొవిడ్‌ను సమర్థవంతంగా కట్టడి చేయగలిగారని జేపీ గుర్తుచేశారు.

### బ్రిటన్‌లో ప్రధానమంత్రికి అందిన వైద్యమే వ్యవసాయ కార్మికునికి కూడా అందుతుంది

"మన వద్ద ఎమ్మెల్యేలు, మంత్రులు వంటి వారు ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరుతూ ప్రజల్ని మాత్రం ప్రభుత్వాస్పత్రులకు వెళ్లమంటున్నారు. దీనివల్ల ప్రజల్లో సర్కారీ దవాఖానల మీద అపనమ్మకం ఇంకా పెరిగి వాళ్లు కూడా ప్రైవేటు ఆస్పత్రుల కోసం పరుగులు తీస్తూ ఒక్కోసారి ప్రాణాల మీదకు కూడా తెచ్చుకుంటున్నారు, ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారు. దీనిపై ఏమంటారు' అన్న ప్రశ్నకు జేపీ జవాబిస్తూ.. బ్రిటన్‌లో ప్రధానమంత్రికి కరోనా వచ్చి పరిస్థితి తీవ్రంగా మారినా, ఆయన జాతీయ ఆరోగ్య సేవ (ఎన్‌హెచ్‌ఎస్) ఆస్పత్రికే వెళ్లారని, ప్రధానికి అందించిన వైద్యమే అక్కడ చిరుద్యోగికి, వ్యవసాయ కార్మికునికి, చివరికి ఇతర దేశాల నుంచి వచ్చే పర్యాటకులకు కూడా అందుతుందని అన్నారు.

### బ్రిటన్ నమూనాను ఇండియాలో అమలు చేయాలని రెండున్నర దశాబ్దాలుగా కోరుతున్నాం.. తాజా వెబినార్‌లో నిపుణులు కూడా అదే ప్రతిపాదించారు

"నాలాంటి వాళ్లం చాలా ఏళ్లుగా కోరుతున్నాం.. బ్రిటన్‌లోని ఎన్‌హెచ్‌ఎస్ నమూనాలో ఫ్యామిలీ డాక్టర్ ఏర్పాటుతో మన దేశంలో కూడా అందరికీ ఆరోగ్యం అందించే ప్రజారోగ్య విధానాన్ని తీసుకురావాలని. కొవిడ్ నేపథ్యంలో

తలపెట్టిన సంస్కరణల వెబినార్ సిరీస్‌లో భాగంగా దీనిపై జూన్ 27, 2020న ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా నిర్వహించిన వెబ్ సమావేశంలో వందల మంది భాగస్వాములయ్యారు, జాతీయ, అంతర్జాతీయ నిపుణులు కూడా పాల్గొని చర్చించారు. ఇందులో మేం ప్రతిపాదించింది కూడా ఇదే. భారతదేశ బడ్జెట్ పరిధిలోనే, కేవలం జీడీపీలో 2% తోనే (ఇప్పుడు చేస్తున్న ఖర్చు 1.3 శాతం) మన దేశంలో ఎన్‌హెచ్‌ఎస్ మోడల్‌ని అమలు చేయవచ్చు. దీని ద్వారా మనం వెంటనే బ్రిటన్ స్థాయిలో ఆరోగ్య సేవల్ని అందించలేకపోయినా.. చాలామేర అందించవచ్చు. బ్రిటన్ 90 లెవెల్‌లో ఉంటే, మనం 60 లెవెల్‌లో అందించవచ్చు. ఇప్పుడు మనం కేవలం 10 లెవెల్‌లో ఉన్నాం" అని జేపీ వివరించారు.

ప్రజారోగ్యం సక్రమంగా లేకుంటే ఆ భారం ఎక్కువగా పడేది పేద, దిగువ మధ్యతరగతి ప్రజల మీదేనని జేపీ స్పష్టం చేశారు. కరోనా లాంటివి వచ్చినప్పుడు ఆ దుష్ప్రభావం వారి మీద మరీ ఎక్కువగా ఉంటుందన్నారు. అందుకే అందరికీ ఆరోగ్యాన్నిచ్చే ప్రజారోగ్య విధానాన్ని అమలు చేయటం ప్రభుత్వాల ప్రధాన బాధ్యతల్లో ఒకటని అన్నారు.

**మనకు అర్థం కావటం లేదు..**
**ప్రపంచ దేశాలకు మాత్రం అర్థమవుతోంది**

తనకు ఆరోగ్యశాఖ కార్యదర్శిగా అపాయింట్‌మెంట్ ఆర్డర్ వచ్చిన రోజే తన కుమార్తె ప్రభుత్వాస్పత్రిలో పుట్టిందని, హెల్త్ సెక్రటరీ కూతురు సర్కారీ ఆస్పత్రిలో పుట్టటమేంటని అందరూ ముక్కున వేలేసుకున్నారని జేపీ తెలిపారు. అంతకుముందు కొన్నేళ్లుగా రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు ప్రభుత్వాస్పత్రులకు వెళ్లటం మానేశారన్నారు. వాటిని ఆ రకంగా తయారు చేశారన్నారు. అయితే, ప్రభుత్వ స్కూళ్లలో సరైన చదువు, ఆస్పత్రుల్లో సరైన వైద్య సేవలు అందని వ్యవస్థను తయారుచేసి, అందులో చేర్చి పిల్లల భవిష్యత్తుతో చెలగాటమాడే హక్కు ఎవరికీ లేదన్నారు. కోట్లాది ప్రజలకు కూడా ఈ పరిస్థితి తలెత్తకుండా, ప్రభుత్వాలు ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్య, ప్రతి కుటుంబానికీ మంచి ప్రమాణాల ఆరోగ్యం అందించాలన్నారు. ఇది పూర్తిగా ప్రభుత్వాల బాధ్యతన్నారు.

మన దేశంలో విద్య, ఆరోగ్య రంగాలలో వైఫల్యం మనకు అర్థం కావటం లేదుగానీ.. ప్రపంచ దేశాలకు మాత్రం అర్థమవుతోందన్నారు. ఎన్నికైనవాళ్లను అధికారంలోలేని వాళ్లు తిట్టటం, ప్రజలను ప్రభుత్వాలు చులకనగా చూస్తూ తాయిలాలతో మైమరిపించటం వంటి ధోరణులు సమస్యను పరిష్కరించవన్నారు. తాత్కాలిక సంచలనాల కన్నా, రెచ్చగొట్టటం కన్నా.. సమస్యల పరిష్కారంలో, నిర్మాణాత్మక పద్ధతిలో భాగస్వామ్యం కావాలనేది తనలాంటి వారి విధానమన్నారు. కరోనాపై చేతనైనరీతిలో పోరాడి దాన్నుంచి బయటపడాలని అందరూ కోరుకుంటున్నారని, దీన్ని ప్రభుత్వాధికారులు వర్సెస్ ప్రజలు, పోలీసులు వర్సెస్ ప్రజలు, ప్రజలు వర్సెస్ ప్రజల కింద మార్చకుండా.. శాస్త్రీయంగా, పరిజ్ఞానంతో, ముందుచూపుతో, ఆచరణాత్మకంగా, తక్కువ ఖర్చుతో ఎక్కువమందికి ప్రయోజనం చేకూరేలా అధిగమించాలన్నదే ప్రభుత్వాలకు తన విజ్ఞప్తి అన్నారు.

కరోనాను తక్కువ అంచనా వేయవద్దని, అదే సమ యంలో అంత భయపడాల్సిన పని కూడా లేదని అన్నారు. ప్రభు త్వాలు అప్రమత్తంగా స్పందిస్తూ అవసరమైన మార్పుల్ని చేస్తూ, ప్రజలతో నిరంతరం సంభాషిస్తూ పరిష్కారంలో వారిని భాగస్వాముల్ని చేస్తుంటే.. మనం భయపడుతున్నదాని కంటే తక్కువ నష్టంతోనే కరోనా సంక్షోభం నుంచి బైటపడగలమన్నారు. ఈ మాటలు ఎగ్జయిటింగ్‌గా అనిపించకవపోవచ్చుని, కానీ దీర్ఘ కాలంలో ఉపయోగపడేవి, విలువైనవి ఇవేనని జేపీ అన్నారు.

## టెస్టింగులల్లేకుండా నిర్ణయాలంటే చీకట్లో బాణాలు వేయటమే

టెస్టింగులు తగిన సంఖ్యలో లేకపోవటం వల్ల కరోనా బారిన పడి మరణిస్తున్నవారి సంఖ్య పెరుగుతోందనటానికి ఆధారాలు లేవని, కానీ పరీక్షలు లేకపోవటం వల్ల కరోనా కట్టడికి తీసుకోవాల్సిన చర్యలపై స్పష్టత కొరవడుతోందని జేపీ అన్నారు. శాస్త్రీయత లేకుండా గుడ్డెద్దు చేలో పడ్డట్లు చర్చలు, నిర్ణయాలు జరుగుతున్నాయన్నారు. ర్యాపిడ్ యాంటీ జెన్, యాంటీ బాడీ టెస్టులను పెంచాలని, వేగంగా ఫలితాలను వెల్లడిస్తూ వాటి ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. ఎంతో పేదరికం, అవిద్య వల్ల సరైన నివాస వసతులు, ఆదాయాలు లేని మన దేశంలాంటి చోట కఠిన లాక్‌డౌన్ తీవ్ర విపరిణామాలకు దారితీస్తాయి కాబట్టి గుండుగుత్త లాక్‌డౌన్‌లు వద్దని, టెస్టింగుల్ని పెంచాలని తనలాంటి వారు మొదటి నుంచీ చెబుతున్నారని.. ఆ తర్వాత కొంత దిద్దుబాటు జరిగినా ప్రభుత్వాలపరంగా అప్పుడు మొదలైన తప్పిదాలు ఇంకా కొనసాగుతున్నాయని అన్నారు. ప్రజలకు ఆరోగ్యపరంగా ముందు జాగ్రత్తలు, కాల్ సెంటర్‌ని ఏర్పాటు చేసి వైద్యుల్ని అందుబాటులో ఉంచటం, కరోనా సోకితే వైద్య పర్యవేక్షణలో క్వారంటైన్, ఊపిరాడకపోవటం వంటి సమస్యలు తలెత్తితే వెంటనే ఆస్పత్రి సౌకర్యం, జీవనోపాధికి ఆటంకం కలగకుండా ఆర్థిక వ్యవస్థను నడిపించటం వంటి చర్యలను ప్రభుత్వాలు సరైనరీతిలో ఇప్పటికైనా తీసుకోవాలన్నారు. ఓపక్క ఈ చర్యలు తీసుకుంటూనే ముమ్ముందు ఇలాంటి విపత్తులు వచ్చినా తడబడకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని, ప్రజారోగ్య వ్యవస్థను శాశ్వత ప్రాతిపదికన బాగు చేయాలని జేపీ అన్నారు.

# సదవకాశంగా కొవిడ్ సంక్షోభం:
# మన ప్రజారోగ్య వ్యవస్థను శాశ్వతంగా బలోపేతం చేసే నమూనాను అందించిన ఎఫ్‌డీఆర్ వెబినార్

వెంకటాపురం కేశవరెడ్డితో కలిసి మౌర్య క్రిష్ణ, శ్వేత చందర్, వ్రితి బన్సల్, భవాని పసుమతి (ఎఫ్‌డీఆర్ పరిశోధనా బృందం)

కొవిడ్-19 చైనా నుంచి మొదలై కొద్దికాలంలోనే ప్రపంచ మంతటినీ చుట్టు ముట్టేసింది. ఆ ప్యాండమిక్ అన్ని దేశాల్నీ సంక్షోభంలోకి నెట్టినా.. నివారించదగ్గ నష్టానికి బాగా గురైన దేశం భారత్! జన్యు క్రమం, వాతావరణం, ఆహారపు అలవాట్లు వంటి వివిధ కారణాల (ఇంకా నిర్ధారితం కాలేదు) వల్ల మన దేశంలో కరోనా ప్రభావం తక్కువగానే ఉందని అంచనాలు సూచిస్తున్నా.. ఆ వెసులుబాటును మన దేశం అంతగా ఉపయోగించు కోలేకపోయింది. సరైన ప్రజారోగ్య వ్యవస్థను ఏర్పాటు చేసుకోకపోవటం, వలస కూలీలు, పేదలకు సాయం అందించే సమర్థ పాలనా వ్యవస్థను ఇప్పటికీ నిర్మించుకోకపోవటం, రైతు నుంచి నేరుగా వినియోగదారునికి వ్యవసాయోత్పత్తులు చేరే సప్లయ్ చెయిన్లు సరిగా లేకపోవటం, నగరాల్లో స్థానిక ప్రభుత్వ పాలన పేలవంగా ఉండటం మొదలైనవి ఇందుకు ప్రధాన కారణాలు. వీటికితోడు.. ప్రభుత్వాలు శాస్త్రీయంగా, స్మార్ట్‌గా వ్యవహరించకుండా ఆత్మరక్షణ ధోరణితో పాతరాజకీయంతో సేఫ్ గేమ్ ఆడి కఠిన లాక్‌డౌన్‌ని విధించటంతో భారతదేశ ప్రజలు బాగా నలిగిపోయారు. దేశ ఆర్థిక వ్యవస్థ భారీ మూల్యం చెల్లించింది. అనేక మంది ఉపాధి కోల్పోయారు. నష్టాల లెక్క ఇంకా తేలాల్సి ఉంది. మన దేశంలో కరోనాతో మృతి చెందినవారి కంటే కరోనాయేతర వ్యాధులతో మరణించినవారి సంఖ్య వంద రెట్లు ఎక్కువ. అయినా ఉన్న కొద్దిపాటి ఆరోగ్య వ్యవస్థ పూర్తిగా కరోనాకే పరిమితమయిపోవటంతో కోట్లాదిమంది ఆరోగ్య సౌకర్యాలు అందక విలవిల్లాడుతున్నారు.. ఈ నేపథ్యంలో, కొవిడ్ సంక్షోభాన్ని భారతదేశం మౌలిక రంగాలలో సంస్కరణలకు ఒక అవకాశంగా మలుచుకోవాలని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా ప్రతిపాదించాయి. ఓ పక్క కరోనాను ఎదుర్కోవటంపై, మరోపక్క ఈ సంస్కరణలపై ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ వివిధ మాధ్యమాల ద్వారా ప్రజల్లో అవగాహన పెంచుతూ ప్రభుత్వాలకు అధికారికంగా, అనధికారికంగా సూచనలు అందచేస్తున్నారు. ఇందులో భాగంగానే మూడు కీలక రంగాలలో సంస్కరణలపై వెబినార్ సిరీస్‌ను నిర్వహించారు. 1) జేబులో నుంచి రూపాయి ఖర్చు లేకుండా అందరికీ మంచి ప్రమాణాల ఆరోగ్యాన్నిచ్చే ప్రజారోగ్య వ్యవస్థ ఏర్పాటు 2) రైతుకి-వినియోగదారునికి లాభసాటిగా వ్యవసాయోత్పత్తుల సరఫరా గొలుసులు 3) 10లక్షల జనాభా దాటిన నగరాలలో సమర్థ స్థానిక పాలన.




జాతీయ, అంతర్జాతీయ నిపుణులు, ఇతర ఆలోచనాపరులు, పౌరులు ఇచ్చిన సూచనల్ని క్రోడీకరించి విధానాలుగా రూపొందించి ప్రభుత్వాలకు అందజేయటం, సమాజంలో సరయిన చర్చని పెంచటం ఈ వెబినార్ల లక్ష్యం.

ఒక్కో వెబినార్‌కి సంబంధిత అంశంపై దాదాపు 30-40 పేజీల సమగ్ర చర్చా పత్రాన్ని జేపీ నేతృత్వంలో ఎఫ్‌డీఆర్ పరిశోధనా బృందం రూపొందించింది. ఇందులో సాధికార సమాచారం గ్రాఫిక్‌గా ఉంది. ప్రభుత్వాల అధికారిక పత్రాల నుంచి, వివిధ ప్రామాణిక అధ్యయనాల నుంచి సేకరించిన గణాంకాలున్నాయి. ఈ చర్చా పత్రాల్ని ఆయా ప్యానలిస్టులకు ముందుగానే పంపించారు. ఇందులోని అంశాలతో తొలుత జేపీ చర్చను ప్రారంభించగా, మిగతా ప్యానలిస్టులు ఒక్కొక్కరు 10 నిముషాల పాటు తమ అభిప్రాయాల్ని వెల్లడించారు. ఆ తర్వాత పరస్పర చర్చ మొదలైంది. వెబినార్‌లో రిజిస్టర్ చేసుకుని భాగస్వాములైనవారి ప్రశ్నలకు కూడా సమాధానాలిచ్చాక.. ఈ చర్చలో స్థూలంగా ఏకాభిప్రాయానికి వచ్చిన అంశాలను ప్రతిపాదనలుగా జేపీ క్రోడీకరించారు. ఇలా ఒక్కోటి రెండు గంటల పాటు వెబినార్లు జరిగాయి.

ఈ వెబినార్లలో ప్యానలిస్టులు వ్యక్తం చేసిన అభిప్రాయాలను విహంగ వీక్షణంలా 'జనబలం' పాఠకులకు తెలియచేయాలనుకుంటున్నాం. పూర్తి వివరాల్ని విధానపత్రాలుగా ప్రభుత్వాలకు సమర్పించాక ఎఫ్‌డీఆర్ఇండియా వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు.

ప్రజారోగ్యం, వ్యవసాయంపై వెబినార్ల విశేషాలను ఈ సంచికలో అందిస్తున్నాం.

## వెబినార్ సిరీస్: సదవకాశంగా కొవిడ్ సంక్షోభం..

## ప్రజారోగ్యం: ఆర్థికభారం లేకుండా అందరికీ ఆరోగ్యం

ప్రపంచంలోనే అత్యంత బలహీనంగా ఉన్న మన ప్రజారోగ్య వ్యవస్థను కొవిడ్‌ను ఎదుర్కోవటానికి యుద్ధప్రాతిపదికన అన్ని రకాలుగా సన్నద్ధం చేయటంతోపాటు.. మున్ముందు కూడా ఇటువంటి విపత్తులు వస్తే తట్టుకోవటానికి, ప్రజలకు సాధారణ సమయాల్లోనూ నాణ్యమైన వైద్య ఆరోగ్య సేవల్ని ఆర్థిక భారం లేకుండా అందించటానికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రజారోగ్యం మీద నిర్వహించిన వెబినార్‌లో చర్చించారు. ఇతర దేశాల్లోలా వైరస్ మన దేశంలో తీవ్రస్థాయిలో విరుచుకుపడి ఉంటే, మరణాల రేటు అత్యధికంగా ఉండి ఉంటే మన వ్యవస్థ ఏమాత్రం తట్టుకోగలిగేది కాదని, కాబట్టి ప్రజారోగ్య వ్యవస్థను పటిష్ఠం చేయటాన్ని ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా రాబోయే కాలంలో భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుందని వెబినార్ అభిప్రాయపడింది.

మన దేశంలో ప్రస్తుతమున్న ఆరోగ్య సంరక్షణా వ్యవస్థను మూడు విభాగాలుగా చేయవచ్చు. 1. ప్రాథమిక వైద్యం – ఇందులో ఆరోగ్య సమస్యతో వచ్చినవారిని ఔట్ పేషెంట్లుగా పరీక్షించి, చికిత్స చేస్తారు. 2. ద్వితీయ దశ చికిత్స – ఇందులో రోగిని ఆస్పత్రిలో చేర్చుకుని చికిత్సలు, అవసరమైతే ఆపరేషన్లు చేస్తారు. 3. తృతీయ దశ చికిత్స – ఇందులో వ్యాధి బాగా ముదిరాక అందించే చికిత్సలు ఉంటాయి. సంక్లిష్టమైన క్యాన్సర్, గుండె సంబంధ వ్యాధులకు సూపర్ స్పెషాలిటీ వైద్య పద్ధతుల్లో చికిత్స వంటివి ఇందులో భాగంగా ఉంటాయి. ఈ అంశాలన్నిటినీ ఒక్కో అంశంపై చేసిన పరిశోధనల ఆధారంగా చర్చించి మొత్తంగా ప్రజారోగ్య వ్యవస్థపై పరిష్కారాలను ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వెబినార్ ప్రతిపాదించింది.

### సమస్యలు

భారతదేశంలో నివారించదగ్గ వ్యాధులతో ప్రతి రోజూ 5 ఏళ్ల వయసులోపు పిల్లలు 2,000 మంది చనిపోతున్నారు. గుండెజబ్బులు, క్యాన్సర్ వంటి అసాంక్రమిక వ్యాధులు పెరిగిపోతుండటం, శాస్త్ర, సాంకేతిక, ఆర్థిక వృద్ధితో సాంక్రమిక వ్యాధులు తగ్గి జీవనకాలంతోపాటు సంక్లిష్ట చికిత్సలకు అవుతున్న ఖర్చుల వల్ల ఆర్థిక భారం పెరిగిపోవటం పెనుసమస్యగా ఉంది. కేవలం ఆస్పత్రి చికిత్స కోసం అయ్యే ఖర్చుల వల్ల మన దేశంలో ఏటా 5.5 కోట్ల మంది (దాదాపు 90 దేశాల జనాభా కంటే ఎక్కువ) పేదలై పోతున్నారు. మరే పథకాన్ని ప్రవేశపెట్టకపోయినా ఒక్క ఆరోగ్య రంగాన్ని బాగు చేస్తే, మన దేశంలో పేదరికం దాదాపుగా తొలగిపోతుంది.

**ప్యానలిస్టులు:** డాక్టర్ జయప్రకాష్ నారాయణ్, డాక్టర్ హెంక్ బెకడమ్ (ప్రపంచ ఆరోగ్య సంస్థ భారతదేశ మాజీ ప్రతినిధి), డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి (పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు), డాక్టర్ గుళ్లపల్లి నాగేశ్వరరావు (ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆరోగ్య సంస్థ), కేశవ్ దేశిరాజు (కేంద్ర ఆరోగ్య శాఖ మాజీ కార్యదర్శి).

Healthcare workforce

| Country | Total healthcare workforce | Percentage of total population | Percentage of total workforce |
|---|---|---|---|
| UK | 1.9 million workers* (mostly in NHS) | 2.9% | 5.8% |
| US | 17 million workers[iii] | 5.14% | 10.74% |
| India | 3.8 million workers[iv] | 0.27% | 0.77% |

**Table 4: Expenditure Profile of Aarogyasri Program**

| Aarogyasri Program | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| | | 2015-16 | 2016-17 | 2017-18 | 2018-19 | 2019-20 | 2020-21 |
| Andhra Pradesh | Amount Spent (in Crore) | 500 | 1301 | 1000 | 1300 | 1305 | 1900 (Allocated) |
| | No. of patients treated | 321,672 | 363,204 | 479,688 | 439,345 | 42,564 | - |
| Telangana | Amount Spent (in Crore) | NA | 707 | 772 | 621 | 720 | 720 (Allocated) |
| | No. of patients treated | | 2,74,480 | 3,09,129 | - | - | - |

*Source: Andhra Pradesh Annual Budget, Telangana Annual Statistics Report*

**Table 9: Private Tertiary Care**

| Average Cost Per Operational Bed of Listed Tertiary Hospitals in India | | | | | All Values in ₹ Cr for FY19 | |
|---|---|---|---|---|---|---|
| Company | Total Revenue | Total Cost | Total Cost (Excluding Finance and Rent Costs) | ARPOB | ACPOB | ACPOB (Excluding Finance and Rent Costs) |
| Shalby Ltd | 468.78 | 420.20 | 409.43 | 1.10 | 1.00 | 0.98 |
| Apollo Hospitals Enterprise Ltd ** | 4,450.62 | 4,210.26 | 3,926.66 | 1.30 | 1.21 | 1.15 |
| Narayana Hrudayalaya Ltd | 2,077.10 | 1,888.30 | 1,792.76 | 1.00 | 0.91 | 0.86 |
| HealthCare Global Enterprises Ltd | 640.50 | 641.41 | 570.57 | 1.20 | 1.20 | 1.07 |
| Aster DM Healthcare Ltd | 594.78 | 628.89 | 601.79 | 2.10 | 2.22 | 2.12 |
| Fortis Healthcare Ltd | 642.96 | 998.09 | 795.47 | 1.50 | 2.33 | 1.86 |
| Fortis Malar Hospitals Ltd | 144.59 | 151.92 | 151.19 | 1.68 | 1.77 | 1.76 |
| Chennai Meenakshi Multispecialty Hospital Ltd | 33.36 | 22.81 | 20.88 | 0.71 | 0.32 | 0.20 |
| | | | Median | 1.25 | 1.22 | 1.11 |

Sources: *Annual Reports (FY19) and ICICI Direct Healthcare Sector Report Dec 10, 2019*

Notes:

### డాక్టర్ జయప్రకాష్ నారాయణ్

ఆరోగ్య సంరక్షణ రంగంలోని సంక్షోభాన్ని, డొల్లతనాన్ని కొవిడ్–19 బట్టబయలు చేసిందని డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

**ఇందులో మూడు అంశాలను లోతుగా పరిశీలించాలన్నారు.**

1. ప్రస్తుత కొవిడ్ కావచ్చు, ఇలాంటి మరో ప్యాండమిక్ కావచ్చు.. వీటి తాకిడికి స్తంభించిపోయేంత బలహీన పరిస్థితుల్లో భారతదేశ ఆరోగ్య వ్యవస్థ ఉంది.
2. విశ్వసించగలిగిన, ఆధారపడగలిగిన ప్రాథమిక, కుటుంబ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ లేకపోవటం వల్ల పరిస్థితి మరీ దయనీయంగా తయారవుతోంది. పౌరుల్లో తీవ్ర భయాందోళనల్ని కలిగిస్తోంది. డెంగీ జ్వరమొస్తే చాలు ప్రజలు పెద్దాస్పత్రికి పరుగులు తీయటం ఏటా ప్రతి సీజన్‌లో, ప్రతి జిల్లాలో కన్పించే దృశ్యం కాదా?.. ఇదో ఉదాహరణ మాత్రమే. ఇలాంటి జ్వరాలకు ప్రాథమిక కేంద్రాల స్థాయిలోనే చికిత్స చేయ వచ్చు, పైస్థాయి స్పెషాలిటీ ఆస్పత్రులపై భారం తగ్గించవచ్చు.
3. పెరుగుతున్న జనాభా అవసరాలకు మన దేశంలోని సాధారణ ప్రజారోగ్య వ్యవస్థ ఏమాత్రం సరిపోదు.

## పరిష్కారాలు

రాజకీయ సంకల్పం ఉంటే మన దేశంలో ప్రజారోగ్య వ్యవస్థను బాగు చేయటానికి పలు అవకాశాలు అద్భుతమైనవి ఉన్నాయని జేపీ

అన్నారు. సమర్థ మానవ వనరులు, అంతర్జాతీయ స్థాయి మందుల పరిశ్రమ, తృతీయ దశ స్పెషాలిటీ వైద్యాన్ని కూడా ప్రపంచంలోనే తక్కువ ఖర్చుతో అందించటం వంటి వన్నీ భారత్‌కున్న మేటి బలాలన్నారు.

ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీని ప్రస్తావిస్తూ.. అవి వ్యాధి ద్వితీయ దశ వైద్య సేవలకు ప్రయోజనకరంగా ఉంటాయని, తృతీయ దశ వైద్యాన్ని పూర్తిగా పునర్నిర్మించాలని జేపీ అన్నారు. తృతీయ దశ వైద్యసేవలు కొందరికే కాకుండా అందరికీ అందుబాటులోకి తెచ్చేలా మార్పులు తేవాలన్నారు.

ఆరోగ్య సంరక్షణలో ఎంతో ప్రాధాన్యత గల ప్రాథమిక వైద్య సేవలోని సవాళ్లను గురించి జేపీ విస్తారంగా చర్చించారు. ప్రాథమిక వైద్యశాలలు విశ్వసనీయతను కోల్పోవటం, ప్రామాణిక అర్హత ఉన్న ఫిజీషియన్లు లేకపోవటం, అర్హతలేని వారు అనధికారికంగా డాక్టర్లుగా చెలామణి అవుతుండటం, ప్రైవేటు రంగం మీద ఆధారపడటం ఉన్నకొద్దీ పెరిగిపోవటం సమస్యలుగా ఉన్నాయన్నారు. తక్కువ ఖర్చుతో, జవాబుదారీతనంతో, చెప్పుకోదగిన మంచి వైద్యసేవలకు గ్యారంటీతో ఒక సమగ్ర పరిష్కారం ఈ ప్రాథమిక వైద్యంలో అవసరమన్నారు. ఒక నమూనాను స్థూలంగా జేపీ పరిష్కారంగా ప్రతిపాదించారు. 50,000 - 1,00,000 జనాభా గల ప్రతి చిన్న పట్టణంలో 10 మంది జనరల్ ఫిజీషియన్లు (ఫ్యామిలీ డాక్టర్లు) ప్రజలకు అందుబాటులో ఉండాలని, 10 కిలోమీటర్ల పరిధిలో వీరు తమ వైద్యసేవలను అందించాలని సూచించారు. వీరిలో తమకు నచ్చిన డాక్టర్‌ని ఎంచుకునే అవకాశం ప్రతి ఇంటికీ ఇవ్వాలన్నారు. వైద్య సేవల కోసం డాక్టరు వద్దకు వచ్చిన రోగులని బట్టి ప్రభుత్వం ఆ వైద్యులకి పారితోషికాన్ని కేసుకింత చొప్పున అందిస్తుంది. దీనివల్ల పోటీ పెరిగి, ప్రజలకు ఎంత మెరుగైన సేవలందిస్తే అంత ఎక్కువ ఆదాయం వైద్యులకు సమకూరుతుందన్నారు. అదే సమయంలో రోగులకి వైద్యుణ్ణి ఎంచుకునే పూర్తి స్వేచ్ఛ ఉంటుంది. కాబట్టి జవాబుదారితనం ఉండి మంచి సేవలందుతాయన్నారు. ఈ రకమైన ప్రోత్సాహంతో కూడిన పద్ధతి వల్ల వనరులు సద్వినియోగమై, జవాబుదారీతనం పెరుగుతుందన్నారు. ఈ మొత్తం ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థను ఏర్పాటు చేయటానికి కేవలం రూ.47,000 కోట్లు ఖర్చవుతాయన్నారు.

ఆ తర్వాత తృతీయ దశ వైద్యం గురించి జేపీ వివరించారు. చిన్న ఆరోగ్య సమస్య ఉన్నవారు కూడా ఈ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులకే వచ్చి సేవలు పొందాలనుకోవటం వల్ల ఈ విభాగం మీద విపరీతమైన ఒత్తిడి ఉందన్నారు. ప్రభుత్వ పెద్దాస్పత్రులకు నిధులు, సౌకర్యాలు తక్కువ, జనం తాకిడి ఎక్కువ అన్నారు. ఎఫ్‌డీఆర్ క్షేత్రస్థాయి పర్యటనలో ఈ ఆస్పత్రుల్ని పరిశీలించిందని, ఇందులో ఖర్చు పెట్టే ప్రతి రూపాయికీ రూ.4 సేవలు ప్రజలకు అందుతున్నాయని తెలిపారు. పార్వతీపురం (ఆంధ్రప్రదేశ్)లోని ఆస్పత్రిని ఉదాహరణగా చెప్పారు. ఇక్కడైతే రూ.1 ఖర్చుకు 10 రూపాయల దాకా వైద్య సేవలు అందుతున్నాయన్నారు. కొత్త సాంకేతికతల వల్ల తృతీయ దశ వైద్య సేవల్లో ఉపయోగించే

**Details of Practices in Other Countries**

| Countries | Form of partnership b/w govt and private practitioner | Payment to private practitioner | Choice | Drug Supply |
|---|---|---|---|---|
| UK- NHS | All the costs - for medical tools, office rental, and personnel - are borne by the GP | Per patient registered | Yes, choice to register with any practitioner | Free of cost |
| Canada | All the costs - for medical tools, office rental, and personnel-are borne by the GP | Mostly fee-for-service, but varies from province to province | Yes, but patient may not be accepted if practitioner has a closed list | Partial payment |
| Italy - NHS | All the costs - for medical tools, office rental, and personnel - are borne by the GP | Per patient registered, financial incentives to work in rural and remote areas | Yes, choice to register with any practitioner | Free of cost |
| Delhi Mohalla Clinics | Government, supply of doctors also managed by the government | Per out-patient | Limited; doctor sent on daily basis to outpatient clinic from a panel | Free of cost |

పరికరాల ఖరీదు చాలా ఎక్కువని, ఇందులో వైద్య సేవలంటే ఖర్చు ఎక్కువ, ఫలితాలు తక్కువని, దీనిపై భారీగా నిధుల్ని వెచ్చించే శక్తి భారతదేశానికి లేదని అన్నారు. దీనికి బదులు, ప్రభుత్వ వైద్య సేవలను మెరుగుపరుస్తూనే, ప్రైవేటు రంగంలోని డాక్టర్లను, నిపుణులను ఆకర్షించటం, ఖర్చు తగ్గించేలా పూలింగ్ పద్ధతిలో డయాగ్నోస్టిక్ సదుపాయాలను అందుబాటులోకి తేవటం మీద దృష్టి సారించాలన్నారు. తృతీయ దశ ప్రభుత్వాస్పత్రులకు నిధులను పెంచాలని, జిల్లా ఆస్పత్రికి పడకకు రూ.15 లక్షల చొప్పున, బోధనాస్పత్రికి పడకకు రూ.20 లక్షల చొప్పున మూడేళ్ల కాలంలో నిధులని పెంచితే వైద్య సేవల నాణ్యత గణనీయంగా మెరుగుపడుతుందన్నారు.

ఈ మొత్తం వ్యయం (ప్రాథమిక, తృతీయ దశ వైద్య సేవలు రెంటికీ కలిపి) సుమారు రూ.90,000 కోట్లు అవుతుందని, ఇది మన దేశ జీడీపీలో కేవలం 0.5% మాత్రమేనని అన్నారు. ఈ ఖర్చును కలిపినా భారతదేశం ప్రపంచంలో ఆరోగ్య రంగంలో అతి తక్కువ ఖర్చు చేసే దేశంగానే ఉంటుందని, అయితే ఈ నమూనాలో పెట్టే ప్రతి రూపాయికీ అనేకరెట్లు ఫలితం ప్రజలకు అందుతుందని అన్నారు. ప్రస్తుతం మన ప్రభుత్వాలు ఆరోగ్యం కోసం పెట్టే ఖర్చు కేవలం 1.3 శాతం మాత్రమేనన్నారు.

ఇలా కొద్దిపాటి పెట్టుబడుల్ని ఆరోగ్య రంగంలో సరైనరీతిలో పెట్టటం వల్ల వైద్య సేవల పరంగా వచ్చే అపార ప్రయోజనాలతో పాటు, దాదాపు 1 కోటి కొత్త ఉద్యోగాలు వస్తాయని, ఈ నమూనా అటు ప్రజారోగ్య సంక్షోభానికి, ఇటు ఉపాధి సంక్షోభానికీ కూడా చక్కటి ఉమ్మడి పరిష్కారమని జేపీ అన్నారు.

## డాక్టర్ హెంక్ బెకడమ్

ఆరోగ్య రంగంలో పెట్టుబడిని ఇండియా పెంచక తప్పదని డాక్టర్ హెంక్ బెకడమ్ స్పష్టం చేశారు. మౌలిక వసతులు, ఆరోగ్య సంరక్షణ సిబ్బందిని పెంచటం, ప్రైవేటు రంగం పెట్టుబడులు పెట్టని చోట ప్రభుత్వ నిధులను కేటాయించి ఆరోగ్య సేవల్ని విస్తృతం చేయటం, బలోపేతం పరచటం అవసరమన్నారు. ప్రైవేటు ఆరోగ్య రంగానికి ఇండియాలో ఉన్నంత ప్రాధాన్యత తాను మరే దేశంలోనూ చూడలేదన్నారు.

ఇన్ఫెక్షన్‌ల నివారణ, అందుకు మౌలిక వసతులు జిల్లాల్లో అధ్వాన్నంగా ఉన్నాయని, వాటి మీద బాగా దృష్టి పెట్టాలని హెంక్ బెకడమ్ అన్నారు. కొవిడ్-19 భవిష్యత్తు పరిణామాలను

**Primary Healthcare Cost Estimates**

| | |
|---|---|
| Per Outpatient Cost Incurred | Rs. 150 |
| Per day Outpatient visits in a clinic | 50 |
| Number of trained physicians available | 200,000 |
| Annual Outpatient Cost (assuming 300 working days, 15000*150*200000) | Rs. 45,000 crore |
| Initial Infrastructure and Training Cost (200000*100000) | Rs. 2,000 crore |
| **Total annual additional expenditure on primary healthcare** | **Rs. 47,000 crore** |

**Table 13: Total additional cost of improved tertiary care**

| | |
|---|---|
| District hospitals - 167000 beds | Rs. 15000 crore |
| Teaching hospitals - 192000 beds | Rs. 23000 crore |
| **Total additional cost** | **Rs. 38,000 crore** |

తట్టుకునేందుకు వీలుగా సాంక్రమిక (ఇన్ఫెక్షన్) వ్యాధుల నివారణ కేంద్రాల సామర్థ్యాలను వసతులు, సాంకేతికతల పరంగా పెంచేందుకు శరవేగంగా చర్యలు తీసుకోవాలన్నారు. డిజిటల్ వైద్య సేవలు, ల్యాబొరేటరీ నెట్‌వర్క్‌లలో పెట్టుబడులు అవసరమన్నారు. మారిన పరిస్థితుల్లో టెలీ మెడిసిన్, విస్తరణ అవకాశాల్ని గుర్తించాలన్నారు. గ్రామీణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పెట్టుబడి పెట్టటం, ప్రజలకు ఆరోగ్య సమస్య వచ్చిన వెంటనే మొట్టమొదట అందుబాటులోకి వచ్చే విశ్వసనీయ వైద్య సేవలుగా వాటిని తీర్చిదిద్దటం కీలకమన్నారు.

## డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి

ప్రజారోగ్య వ్యవస్థలో సరైన పెట్టుబడి లేకుంటే, కొవిడ్ లాంటి విపత్తులు వచ్చినప్పుడల్లా ఆర్థిక వ్యవస్థ కూడా తీవ్ర ప్రమాదంలో పడుతుందని.. వైద్యులు, సిబ్బంది, ఉన్న ఇతరత్రా వైద్య వనరులు కూడా చతికిలబడే పరిస్థితి ఏర్పడుతుందని శ్రీనాథ్ రెడ్డి అన్నారు. ఎటువంటి మినహాయింపులు లేకుండా అందరికీ ఆరోగ్యాన్నందించే సార్వత్రిక ఆరోగ్య వ్యవస్థను ఏర్పాటు చేయాలని, నాణ్యమైన సేవలు, జవాబుదారీతనానికి తగిన పద్ధతుల ఏర్పాటుతో ప్రైవేటు రంగాన్ని కూడా భాగస్వామ్యం చేయాలని సూచించారు. ప్రజలకు అనవసర చికిత్సలు అందిస్తూ సార్వత్రిక ఆరోగ్య వ్యవస్థను ప్రైవేటు రంగం దోపిడీ చేయకుండా, క్యాపిటేషన్-ఫీజు పద్ధతిని ప్రవేశపెట్టాలన్నారు. సార్వత్రిక ఆరోగ్య కవరేజీ కింద ఉచిత మందులు, డయాగ్నోస్టిక్ సేవలకు ప్రభుత్వ, ప్రైవేటు ఆరోగ్య భాగస్వామ్యంతో ఏర్పాటు చేయాలన్నారు. దీనివల్ల సేకరణ వ్యయం తగ్గుతుందన్నారు. జిల్లా ఆస్పత్రులను ఆధునీకరించాలని, ఆరోగ్య సంరక్షణా సిబ్బందికి ఇవి శిక్షణా సంస్థలుగా పనిచేయాలన్నారు.

## డాక్టర్ గుళ్లపల్లి నాగేశ్వరరావు

భారతదేశ గ్రామీణ ప్రాంతాల్లో సులభమైన, అత్యంత నాణ్యమైన తొలి దశ వ్యాధి పరిశీలన సదుపాయాన్ని అందుబాటులోకి తేవాలని డాక్టర్ జీఎన్ రావు అన్నారు. ఇది చౌకగా, అందరికీ అందుబాటులో, అన్నిటికంటే ముఖ్యంగా తొలి దశ వైద్యానికి తగ్గట్లు ఉంటుందన్నారు. కంటి వైద్య సేవల తరహాలోనే మొత్తం ఆరోగ్య సంరక్షణలో కూడా పద్ధతుల్ని రూపొందించాలన్నారు.

## కేశవ్ దేశిరాజు

దేశ ఆరోగ్య వ్యవస్థను మెరుగుపరచటానికి ఇతర ప్యానలిస్టులు సూచించిన ప్రధాన సూత్రాలనే కేశవ్ దేశిరాజు కూడా సమర్థించారు. ఆరోగ్య సంరక్షణ సిబ్బంది ప్రమాణాల్ని పెంచాలన్నారు. డబ్బు ఎంత వెచ్చించినా, క్వాలిఫైడ్ డాక్టర్లు లేకుండా నాణ్యమైన వైద్యం అందదన్నారు. వైద్య విద్యాలయాల్లో సుశిక్షితులైన బోధకుల కొరత కూడా వైద్య విద్యలో నాణ్యత కొరతకు కారణం కావచ్చన్నారు. డాక్టర్లతో పాటు మధ్యస్థాయి వైద్య సిబ్బందికి కూడా శిక్షణ ఇవ్వటం ద్వారా వైద్య సేవలు మెరుగవుతాయన్నారు. వైద్య ఆరోగ్య రంగంలో పెట్టుబడులకు రాజకీయ సంకల్పం లేదనటానికి ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ పట్ల నిర్లక్ష్యమే నిదర్శనమన్నారు.

## ముగింపు:

ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయటమే పటిష్టమైన ప్రజారోగ్య వ్యవస్థ నిర్మాణానికి, అంతిమంగా సార్వత్రిక ఆరోగ్య వ్యవస్థ లక్ష్యసాధనకు మొదటి మెట్టని ప్యానలిస్టులు అభిప్రాయపడ్డారు. భారతదేశ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను పునరుజ్జీవింపచేసేందుకు నిపుణులైన ప్యానలిస్టులు చెప్పిన పరిష్కారాల్లో ఎక్కువ పెట్టుబడి, నాణ్యమైన మౌలిక వసతులు, సాంకేతికత, మానవ వనరులకు నిధుల కేటాయింపు చుట్టూనే తిరిగాయి. ప్రజలందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని ఆర్థికభారం లేకుండా అందించటమనేది అత్యంత ప్రాధాన్యతగల రాజకీయ, ఎన్నికల ఎజెండాగా మార్చేందుకు అందరూ గొంతు విప్పాలని ముక్తకంఠంతో విజ్ఞప్తి చేశారు. సంఘటిత గళం వల్ల రాజకీయ, విధానపరమైన నిర్ణయాల్లో పెద్ద మార్పులు వస్తాయని, మెరుగైన ప్రజారోగ్య వ్యవస్థ అందుబాటులోకి వస్తుందని అన్నారు. ప్రజారోగ్యంలో ఎంత చేయొచ్చు, క్షేత్రస్థాయిలో ఎంత జరుగుతోంది.. ఈ రెంటి మధ్యా భారీ అంతరం ఉందని, మనం సరైన చోట, సరైన రీతిలో నిధుల్ని కేటాయించి, ప్రాథమ్యాలను మార్చుకుంటే ఈ వైఫల్యాన్ని సరిదిద్దుకోవచ్చన్నారు. ఆశావహ దృక్పథంతో వెబినార్ చర్చ ముగిసింది.

బడ్జెట్ కేటాయింపులు, సమ్మిళిత ఆరోగ్య సంరక్షణా వ్యవస్థ, మౌలిక వసతుల్లో నాణ్యత, మానవవనరుల అభివృద్ధి తదితర అంశాలను లోతుగా చర్చించారు. వీటికి నిధుల కేటాయింపులో స్థానిక ప్రభుత్వాలు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ముంబయి కార్పొరేషన్ వంటి కొన్ని స్థానిక ప్రభుత్వాలు పెద్దఎత్తున కేటాయింపులతో ఆరోగ్య బడ్జెట్‌ను అమలు చేస్తుండటాన్ని ప్రస్తావించారు. ఆస్పత్రులు, వైద్యులు, నర్సులు వంటి వనరులు కూడా కార్పొరేషన్‌కు ఉన్నాయన్నారు. ఈ వనరులు లేని సంస్థలకు ప్రభుత్వం తోడ్పాటునివ్వవచ్చన్నారు. మన దేశంలోని స్థానిక ప్రభుత్వాల్లో ఎక్కువ అధికారాలున్న ఢిల్లీ ప్రభుత్వం మొహల్లా క్లినిక్‌ల రూపంలో మెరుగైన వైద్య సేవల నమూనాను అందుబాటులోకి తెచ్చిందన్నారు. భారతదేశం పోలియోను కట్టడి చేసి, టీకాల కార్యక్రమంలో గణనీయ ప్రగతిని సాధించగలిగిందంటే.. మన ఆరోగ్య స్థాయిని మెరుగుపరిచేందుకు, అందరికీ మంచి ప్రమాణాల ఆరోగ్యాన్ని అందించేందుకు తగిన వనరులు మనకు ఉన్నట్లే లెక్క అని జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ✦

## ఎఫ్‌డీఆర్ వెబినార్ సిరీస్: సదవకాశంగా కొవిడ్ సంక్షోభం..

# పేదరికం నుంచి ఆదాయంలోకి వ్యవసాయం

మన దేశంలో కొవిడ్ లాక్‌డౌన్ వ్యవసాయరంగంలోని వైఫల్యాలను కూడా ఎత్తిచూపింది. ఆహారోత్పత్తులు పొలం నుంచి పళ్లెంలోకి వచ్చేందుకు ఉండాల్సిన సరఫరా గొలుసులు (సప్లయ్ చెయిన్స్) దెబ్బతినటం గురించి మన దేశంలోనే ఎక్కువగా ఫిర్యాదులు వినిపించాయి. సరఫరా గొలుసులకు సంబంధించి పలు దేశాల్లో చిన్న లోపాలు కనిపిస్తే, మన దేశంలో ఏకంగా సరఫరాయే నిలిచిపోయేంత పరిస్థితి ఏర్పడింది.




అభివృద్ధి చెందిన దేశాల్లో సరఫరా గొలుసులు పటిష్ఠంగా ఉండటం వల్ల.. వ్యవసాయోత్పత్తుల ధరలు, లభ్యతలో ఒడిదుడుకులు స్వల్పంగానే ఉన్నాయి. మన దేశంలో రైతు దుస్థితిలో ఉండటం నుంచి ధరల్లో అనిశ్చితి వరకు వ్యవసాయ రంగంలో సమస్యలు నిత్యకృత్యంలా కొనసాగుతున్నాయి. కొవిడ్ నేపథ్యంలో ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా నిర్వహించిన వెబినార్ సిరీస్‌లో వ్యవసాయంపై చర్చ వీటన్నిటిపైనా చర్చించింది. నిష్ణాతులైన నలుగురు ప్రముఖులు భారతదేశ వ్యవసాయ రంగ సమస్యలు, తక్షణ, దీర్ఘకాల పరిష్కారాలపై ఇందులో సవివరంగా మాట్లాడారు.

**ప్యానలిస్టులు:** డాక్టర్ జయప్రకాష్ నారాయణ్, డాక్టర్ యోగిందర్ కె అలఘ్ (కేంద్ర మాజీ మంత్రి), రమేష్ దేశ్‌పాండే (ఇండియా అగ్రికల్చర్ గ్రూప్ (ఐఏజీ) సీఈవో), డాక్టర్ ఎస్‌కే పట్నాయక్ (కేంద్ర వ్యవసాయ శాఖ మాజీ కార్యదర్శి).

### డాక్టర్ జయప్రకాష్ నారాయణ్

వెబినార్‌లో చర్చను జేపీ ప్రారంభిస్తూ.. దేశ వ్యవసాయ రంగంలో సంక్షోభం ముందు నుంచే ఉందని స్పష్టం చేశారు. కొవిడ్ కేవలం దాన్ని మరింత పెంచిందన్నారు. ఇదేసమయంలో మన వ్యవసాయ రంగంలో వెలికితీయని సత్తా ఇంకా చాలా ఉందని గుర్తించాలన్నారు.

ప్రపంచంలోని వ్యవసాయ భూమిలో 1/8 వంతు మన దేశంలోనే ఉందని జేపీ అన్నారు. పుష్కలమైన సూర్యరశ్మి, మంచి వర్షపాతం, సారవంతమైన నేల భారతదేశ సొంతమన్నారు. ఇన్ని ఉన్నా రైతులకు కష్టాలు, వినియోగదారులకు నష్టాలు ఉండటానికి కారణమైన మన వ్యవస్థలోని ప్రధాన లొసుగుల్ని కొవిడ్ బైటపెట్టిందన్నారు.

### సమస్యలు

వ్యవస్థీకృత సవాళ్ల గురించి జేపీ మాట్లాడుతూ.. ప్రకృతి ఒడిదుడుకుల తాకిడికి గురవుతూ కూడా మన వ్యవసాయ రంగం దేశ ఆహారావసరాలను తీరుస్తోందని, ఎందరికో ఉపాధినిస్తోందని, ఎగుమతుల ద్వారా విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించే అవకాశాన్ని ఆర్థికవ్యవస్థకు అందిస్తోందని, అయితే ఇటువంటి సున్నితమైన, ప్రాధాన్యత కలిగిన రంగంలో మితిమీరిన నియంత్రణ వ్యవస్థ వల్ల అనేక పెద్ద సమస్యలు తలెత్తాయని అన్నారు.

వ్యవసాయంలో నియంత్రపరంగా ఉన్న రెండు అవరోధాలను జేపీ ప్రస్తావించారు– 1. వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ కమిటీ (ఏపీఎంసీ)ల చట్టం. ఇది గుత్తాధిపత్యాన్ని సృష్టించటంతోపాటు అసమర్థమైన, లొసుగులమయమైన ఓ అవ్యవస్థను తయారుచేసింది 2. నిత్యావసర సరకుల (ఈసీ) చట్టం. దేనికోసమయితే ఈ చట్టాన్ని తెచ్చామని చెప్పారో, దానికి విరుద్ధమైన ఫలితాలు దీని నుంచి వచ్చాయి. సరకుల నిల్వ చేసుకోవటం, విలువ జోడింపు వంటి వాటికి ప్రోత్సాహం లేకుండా పోయింది. చివరికి ఇది ధరల్లో తీవ్ర ఒడిదుడుకులకు దారితీసింది. కేంద్ర ప్రభుత్వం వెలువరించిన 2019–20 ఆర్థిక సర్వేలోని వివరాలు, గణాంకాలే ఇందుకు సాక్ష్యం.

కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) గురించి మాట్లాడుతూ, బియ్యం, గోధుమల్ని మాత్రమే మద్దతు ధరతో సేకరిస్తున్నారని, ఇది భారత్‌లో డిమాండ్ పెరుగుతున్న ఇతర ఆహారపదార్థాలైన పండ్లు, కూరగాయలు, పాల ఉత్పత్తులు, మాంసం, చేపలకు అందాల్సిన ప్రోత్సాహాన్ని దెబ్బతీసిందని జేపీ అన్నారు. బియ్యం,

గోధుమల్ని అవసరానికి మించి పండిస్తుండటం వల్ల మార్కెట్‌లో వీటి నిల్వలు భారీగా పేరుకుపోతున్నాయని (పంట చేతికొచ్చే కాలంలో ప్రభుత్వం దగ్గరే దాదాపు 8 కోట్ల టన్నులు నిలవ ఉంటున్నాయి. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద నిలవ), మరోపక్క పప్పుదినుసుల్ని, వంట నూనెల్ని మాత్రం ప్రపంచంలోనే అత్యధికంగా దిగుమతి చేసుకుంటున్నది భారతదేశమేనని అన్నారు. ప్రభుత్వ సేకరణను క్రమంగా, దశలవారీగా తగ్గించుకుని, డిమాండ్ ఆధారిత ఉత్పత్తుల్ని ప్రోత్సహించటం అవసరమన్నారు. అవినీతి, లీకేజీల మయమైన చాంతాడంత పంపిణీ వ్యవస్థ బదులు.. పేదల కొనుగోలు శక్తిని పెంచేందుకు వినియోగదారులకు, ముఖ్యంగా మహిళల జన్ ధన్ అకౌంట్లకు ప్రత్యక్షంగా నగదును బదిలీ చేయాలని సూచించారు.

దీనికితోడు, వ్యవసాయ సప్లయ్ చెయిన్‌లో మళ్లీ చాంతాడంత దళారీల వ్యవస్థ కొనసాగుతుండటం వల్ల వినియోగదారుడు చెల్లించే సొమ్ములో కేవలం 20-30% మాత్రమే రైతుకు దక్కుతోందని జేపీ అన్నారు. చిన్న మొత్తాల పెట్టుబడితో, పెద్ద లాభాలను ఆశించే మధ్యవర్తుల వ్యవస్థ ఉండటం వల్ల మార్కెట్ గొలుసు అసమర్థంగా తయారైందన్నారు. ఓ పక్క రైతుకు తక్కువ ఆదాయం వస్తుంటే, వినియోగదారుడు మాత్రం ఎక్కువ చెల్లించాల్సి వస్తోందన్నారు. అది కూడా ఎప్పుడు ఏ ఉత్పత్తికి ఏ రేటు ఉంటుందో తెలియని రీతిలోనన్నారు. ధరల ఒడిదుడుకులు పెద్దఎత్తున ఉంటున్నాయన్నారు. పంట కోత తర్వాతి దశ నష్టాలు, అరకొర ప్రాసెసింగ్, స్టోరేజీల కొరత వల్ల ఏటా 1,00,000 కోట్ల (ట్రిలియన్) రూపాయల ఆహారోత్పత్తులు వృధా అవుతున్నాయన్నారు.

## వ్యవసాయ రంగంలో ప్రగతి కోసం పరిష్కార మార్గాలు:

మొదటిది, నిత్యావసర సరకుల చట్టాన్ని దశలవారీగా పూర్తిగా తొలగించాలి. అత్యవసర అవసరాలకోసం పరిమితంగా ఆహార ధాన్యాలను ప్రభుత్వం వ్యూహాత్మక నిల్వలుగా ఏర్పాటు చేస్తే చాలు. రెండోది, వంట నూనెలు, పప్పుదినుసుల దిగుమతులపై మధ్యస్థంగా, హేతుబద్ధమైనరీతిలోనే, ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో) నిబంధనల పరిధిలోనే సుంకాల్ని ప్రభుత్వం విధించాలి. ఈ డబ్బుని రైతులకు ఆ పంటల ఉత్పత్తి ప్రోత్సాహకాలుగా అందించాలి. ప్రపంచ దేశాల్లో మంచి మార్కెట్ వాటా, ధరలు ఉన్న చోటల్లా భారతదేశం లబ్ధి పొందేందుకు వీలుగా అన్ని రకాల ఎగుమతులపై నిషేధాల్ని తొలగించాలి.

మూడోది, వ్యవసాయ మార్కెటింగ్ చట్టాన్ని పూర్తిగా సంస్కరించాలి. గుత్తాధిపత్యం, అనుమతి అవరోధాలు లేకుండా మార్కెటింగ్ చట్టాల్ని సవరించటంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి. బహుళ మార్కెట్లు, పోటీ, నచ్చిన చోట అమ్ముకునే అవకాశాన్ని రైతులకు కల్పించాలి. స్వేచ్ఛా మార్కెట్లు, రైతులకు మెరుగైన ధరలు.. ఇవే అంతిమంగా ప్రభుత్వ చర్యల లక్ష్యం కావాలి.

**Table 1.1: Analysis of food supply chain disruptions during COVID-19**

| Disruptions/ Countries | Disruption in processing and handling facilities | Low capacity of freight usage | Shortage of labour | Problems in accessing markets | Increased food wastage/loss | Low Price realisation for farmers |
|---|---|---|---|---|---|---|
| Canada | | | ✓ | | | |
| France | | | ✓ | | | |
| UK | | | ✓ | | ✓ | ✓ |
| Germany | | | ✓ | | | |
| USA | | | ✓ | ✓ | | |
| New Zealand | ✓ | | ✓ | | | |
| Australia | | | ✓ | | | |
| China | | ✓ | ✓ | | | |
| Thailand | | ✓ | ✓ | ✓ | | |
| Brazil | | ✓ | | | | |
| Vietnam | ✓ | ✓ | | ✓ | ✓ | ✓ |
| India | ✓ | ✓ | ✓ | ✓ | ✓ | ✓ |

Source: FAO : [illegible] ) Analysis by FDR Research Team using parameters from FAO report





**Figure 2.2: Unintended consequences of Essential Commodities Act**





**Figure 2.1: Low price realisation by farmer due to high number of intermediaries**


| Table 2.2: Inadequacies in cold storage | |
|---|---|
| 1) Total perishables* (2016-17) | 474.75 MT |
| 2) Cold storage infrastructure available (2016) | 31.8 MT |
| 3) Cold Storage as % of total perishables [(2)/(1)] | 6.7% |

Source: Horticulture Statistics at a Glance, 2017; Report on Cold Chain, 2016 - NCCD
*Perishables include fruits, vegetables, milk, meat, poultry, fish from Table 2.3

**Table 2.4: Gross Capital Formation in Agriculture Sector at 2011 - 2012 prices (in ₹ cr)**

| Year | Public | Private | Total | Total GCF as % of GVA of agriculture sector | Private GCF as % of GVA of agriculture sector |
|---|---|---|---|---|---|
| 2011-12 | 35.696 | 238,175 | 273,870 | 18.2 | 15.8 |
| 2012-13 | 36,019 | 215,075 | 251,094 | 16.5 | 14.1 |
| 2013-14 | 33,925 | 250,499 | 284,424 | 17.7 | 15.6 |
| 2014-15 | 37.172 | 235,491 | 272,663 | 17.0 | 14.7 |
| 2015-16 | 39,105 | 193,734 | 232,839 | 14.7 | 12.1 |
| 2016-17 | 45,981 | 219,371 | 265,352 | 15.6 | 12.8 |
| 2017-18 | 54,184 | 219,571 | 273,755 | 15.2 | 12.2 |

Source: Agricultural Statistics at a glance, 2017-18







నాలుగో సంస్కరణ నిల్వ సౌకర్యాలను మెరుగుపరచాల్సిన ఆవశ్యకతకు సంబంధించినది. స్టోరేజి సదుపాయాలు లేకుంటే, రైతులు తమ ఉత్పత్తులకు మెరుగైన ధర లభించేంత వరకు వేచి చూడలేరు. తాము పండించినవాటిని అతి తక్కువ ధరకు అమ్ము కుంటూ, తమ అవసరాలకు మాత్రం అతి ఎక్కువ వడ్డీకి అప్పు లు తెచ్చుకుంటుంటారు. పేదరిక విషవలయంలో చిక్కుకుం టున్నారు. పరిష్కారంలో భాగంగా, గోదాముల నిర్మాణంతోపాటు ప్లెడ్జి రుణాలను రైతులకు గణనీయంగా పెంచాలని జేపీ సూచించారు. గిడ్డంగుల్లోని వ్యవసాయోత్పత్తుల్ని తనఖా పెట్టుకుని రైతులకు సాధారణ వడ్డీకే అప్పులిస్తే (ప్లెడ్జి రుణాలు), బ్యాంకులకు కూడా రిస్కు బాగా తగ్గుందన్నారు.

పంట దిగుబడికి ముందుగానీ, తర్వాత గానీ భూకమతాల నిర్వహణలో వినూత్న పరిష్కారాలు ఎంతో కీలకమని జేపీ వివ రించారు. వ్యవసాయం 47 శాతం జనాభాకు జీవనోపాధిగా ఉన్నా 80% పెట్టుబడి ప్రైవేటు రంగం నుంచే ఉందని గుర్తు చేశారు. లాభసాటి ఫలితాలు రావటానికి భూకమతాల నిర్వహణ పరిమాణాన్ని పెంచేందుకు సంస్కరణలు అవసరమన్నారు.

చివరిగా, మార్కెట్ సరఫరా గొలుసుల్ని బాగా కుదించాల్సిన అవసరాన్ని జేపీ వివరించారు. వ్యవసాయోత్పత్తుల నిల్వ, రవాణా, వినియోగదారులకు చేరటంలో మధ్యదళారుల పాత్రని పూర్తిగా కుదించాలన్నారు. స్థానికమైనవైనా, విదేశీయమైనవైనా.. పెట్టుబడి, సాంకేతికత, ప్రాసెసింగ్, ప్రపంచ మార్కెట్‌తో అనుసంధానమైన వ్యవస్థీకృత చిల్లర వర్తక సరఫరా గొలుసులు (రిటైల్ చెయిన్లు) అవసరమన్నారు. ప్రస్తుతం వినియోగదారుడు కొనే ధరలో రైతు వాటా 15-30 శాతం మాత్రమే ఉంది. అదే రిటైల్ చైన్లు వస్తే రైతుకి 60-65 శాతం వాటా దక్కి ఆదాయం గణనీయంగా పెరుగుతుంది. సాంప్రదాయ మార్కెట్ వాటా కొంతకాలానికి తగ్గినా, రిటైల్ మార్కెట్ ఏటా 16-18% పెరగటం వల్ల ఈ రంగం పరిమాణం విస్తృతమవుతుందన్నారు. కానీ ఈ దిశగా అడుగుల్లో భారత్ బాగా వెనుకబడి ఉందన్నారు. చెప్పుకోదగిన ఆర్థిక వ్యవస్థలతో పోలిస్తే, వ్యవస్థీకృత చిల్లర సరఫరా గొలుసుల్లో భారత్ వాటా అతి తక్కువన్నారు. ఈ-కామర్స్‌తో కూడా కలుపుకుంటే 12% మాత్రమేనన్నారు. అదే బ్రెజిల్ 35%, వియత్నాం 45%, యూకే 80%.. ఇలా వాటా కలిగి ఉన్నాయన్నారు.

## డాక్టర్ యోగీందర్ కె అలఘ్

రైతుకి - వినియోగదారునికి మధ్య సరఫరా గొలుసును తగ్గించటమే అసలు సమస్యని యోగీందర్ అలఘ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని మిర్చి మార్కెట్‌ను ఆయన ఉదహరించారు. ఈ రకంగా, చిన్న, సన్నకారు రైతులకు కూడా ఈ-మార్కెట్లతో సంధానమయ్యే అవకాశం కల్పించాలన్నారు. రైతులకు రుణ సౌకర్యం తేలిగ్గా అందుబాటులోకి తేవటానికి బాగా చొరవ అవసరమన్నారు. సింగపూర్‌కు చెందిన టీఈఎంఏఎస్ఈకే భారత్‌లోని వ్యవసాయోత్పత్తుల స్టోరేజీ విభాగంలో పెట్టిన పెట్టుబడులను ఆయన ప్రస్తావిస్తూ, ఇది కంపెనీకి, రైతులకు కూడా ఉపయోగపడే చర్య అన్నారు. ఇలాంటి భాగస్వామ్యాన్నే ప్రైవేటు రంగంలో కూడా ప్రోత్సహించి, పంటలవారీగా అవసర మైన ప్రత్యేక గిడ్డంగుల్ని నిర్మించాలని సూచించారు. ఆనంద్ డిక్లరేషన్‌ని, భారతదేశ శ్వేత విప్లవ పితామహుడు వర్గీస్ కురియన్‌ని ఉటంకిస్తూ.. సహకార సంస్థలు అన్నిచోట్లా విజయ వంతం కావు కాబట్టే రైతులకు కంపెనీలు అవసరమన్నారు.

## రమేష్ దేశ్‌పాండే

ప్రస్తుతం భారతదేశంలో ఉన్న వ్యవసాయ సప్లయ్ చెయిన్లు అసమర్థంగా, తక్కువ ఉత్పాదకంగా ఉన్నాయంటూ రమేష్ దేశ్‌పాండే తన ప్రజంటేషన్‌ని ప్రారంభించారు. సరఫరా గొలుసులను అన్ని కోణాల నుంచీ మెరుగుపరిచే చర్యలు తీసుకోవా లంటూ, పలు రకాల మార్పులను సూచించారు. సప్లయ్ చెయిన్ల లోని వృథా, అధ్వాన్న రవాణా సౌకర్యాలు, ముడిపదార్థాల సరఫరాలో అనిశ్చితి మొదలైన అంశాలను వివరించారు.

వివిధ పరిమితుల రీత్యా, ఎంఎస్‌పీ (కనీస మద్దతు ధర) కింద కేవలం 6-10% మంది రైతుల పంటను మాత్రమే ప్రభుత్వం సేకరించగలదని దేశ్‌పాండే అన్నారు. దీనివల్ల మార్కెట్‌లో రైతు, వినియోగదారుడు నష్టపోయేలా ధరల హెచ్చుతగ్గులు చోటుచేసుకుంటాయన్నారు. వ్యవసాయాన్ని వ్యాపారంలా చేయాలన్న జేపీ మాటల్ని పునరుద్ఘాటిస్తూ, భవిష్యత్తు వ్యవసాయ సంస్కరణలకు మార్కెట్ అదృశ్య హస్త సూత్రమే పునాది కావాలన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థ చాలామేరకు వ్యవసాయానికి అందుబాటులో లేదన్నారు. 70% మంది

| Gap analysis of Cold Chain Infrastructure in India | | | |
|---|---|---|---|
| **Infrastructure Type** | **Infrastructure Requirement** | **Infrastructure Available** | **Gap-to-required (%)** |
| Pack House | 70,080 nos. | 249 nos. | 99.6% |
| Reefer Vehicle | 61,826 nos. | 9,000 nos. | 85% |
| Cold Storage | 35.1 MMT | 31.8 MMT | 10% |
| Ripening Chamber | 9131 nos. | 812 nos. | 91% |

Source: Report on Cold Chain, National Center for Cold Chain Development (NCCD), 2016
MMT - Metric Million Tonnes | Refer Vehicle - Refrigeration Transport | Ripening Chamber - A chamber equipped with humidity, temperature controllers and air circulation systems, the Fruit/Vegetables/Mangoes are ripened through the use of ethylene gas generators

రైతులు ప్రైవేటు వ్యక్తుల నుంచే అధిక వడ్డీలకు అప్పులు తీసుకుంటున్నారన్నారు. మార్కెట్‌లో ధర లభించేంత వరకూ అమ్ముకోవాల్సిన అవసరం లేకుండా, చేయిజాచాల్సిన అవసరం లేకుండా రైతులకు రుణాలనందించే ప్లెడ్జి రుణాల గురించి పట్టించుకోవటం లేదన్నారు. సప్లయ్ చెయిన్లను విస్తరించి, మెరుగుపరిచే దిశగా ఉన్న వనరులను వినియోగిం చుకోక పోవటం వల్ల వ్యవసాయ రుణ వ్యవస్థలోని లొసుగులు కాస్త అటూఇటుగా దశాబ్దాలుగా అలాగే కొనసాగుతున్నాయన్నారు.

## డాక్టర్ ఎస్‌కే పట్నాయక్

వ్యవసాయంలోని ప్రతి విభాగాన్నీ పీడిస్తున్న సమస్యల్ని శాశ్వతంగా పరిష్కరించే విధంగా వ్యవసాయ విధానంలో దశలవారీ సంస్కరణల్ని ప్రవేశపెట్టాలని ఎస్‌కే పట్నాయక్ అన్నారు. వ్యవసాయ మార్కెటింగ్ ఏపీఎంసీ మార్కెట్లకే పరిమితం కాదని, రైతు ఉత్పత్తి సంఘాలు కూడా ఉన్నాయన్నారు. నియంత్రిత మార్కెట్లకు బయట కూడా అమ్ముకునేందుకు రైతులకు అవకాశాలున్నాయని, ఆ సత్తా సైతం రైతులకుందన్నారు. ఈ నేపథ్యంలో పంట ఉత్పత్తి తదనంతర దశకు సంబంధించి వ్యవస్థీకృత మార్పుల్ని ప్రవేశపెట్టాలన్నారు. తమ ఉత్పత్తుల్ని ప్రపంచ మార్కెట్‌లో లాభమున్న చోట రైతులు అమ్ముకునేందుకు వీలుగా ఎగుమతులపై నిషేధాన్ని తొలగించాలన్నారు. దేశవ్యాప్తంగా 10,000 ఆహార ఉత్పత్తిదారుల సంఘాల్ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఇటీవల తీసుకున్న నిర్ణయాన్ని ఆయన అభినందించారు. దీనివల్ల రైతుల ఆదాయానికి ఊతం లభిస్తుందన్నారు. నాసిక్ ప్రాంతంలోని సహ్యాద్రి రైతుల ఉత్పత్తి కంపెనీ లిమిటెడ్ ప్రపంచంలోనే ఉత్తమంగా నిలవటాన్ని ఆయన ఉదాహరణగా చూపారు. ఈ కంపెనీ చక్కటి మౌలిక సదుపాయాల్ని, సాంకేతికతని సమకూర్చుకుని ఆదర్శంగా నిలిచిందన్నారు. భారతదేశంలో ఉన్న రిటైల్ వ్యవస్థను ఇప్పుడున్న 4-5% నుంచి పెంచటం వల్ల వ్యవసాయ సరఫరా గొలుసును చాలామేర కుదించవచ్చని పట్నాయక్ అన్నారు. ఇది చాలా కాలం క్రితమే జరగాల్సిన పని అన్నారు. కాంట్రాక్టు వ్యవసాయం కూడా రైతులకు భద్రతనిస్తూ ఉత్పాదకతను పెంచుతుందన్నారు. ధరల ఒడిదుడుకుల గురించిన చింత లేకుండా రైతులు నేరుగా ఆగ్రో-ప్రాసెసర్లు, వ్యాపారులు తదితరులతో ఒప్పందాలకు రావొచ్చన్నారు.

గిడ్డంగుల్లో తమ పంటను నిల్వ చేసుకుంటే అధికారిక రసీదు ఇచ్చే పద్ధతిని అమలు చేయటం వల్ల రైతులు దాన్ని చూపి ప్లెడ్జి రుణాలు పొందే అవకాశం ఏర్పడుతుందన్నారు. అటువంటి గోదాముల్లో 6 నెలల వరకు పంటలను రైతులు నిల్వ చేసుకోవచ్చన్నారు. దీనివల్ల, తన ఉత్పత్తికి సరైన ధర లభించేలా బేరమాడే శక్తి కూడా రైతుకి లభిస్తుందన్నారు.

## ముగింపు

నియంత్రణల అవరోధాలు, కనీస మద్దతు ధర, సరఫరా గొలుసులు, పంటల నిల్వకు గోదాములు వంటి మౌలిక సదుపాయాలు, విదేశీ పెట్టుబడులు, వ్యవసాయోత్పత్తుల వాణిజ్యం తదితర అంశాలను ప్యానలిస్టులు చర్చించారు. వ్యవసాయ రంగానికున్న సంకెళ్లను తెంచి ఆంక్షలు లేని స్వేచ్ఛా మార్కెట్ అవకాశాల్ని ప్రవేశపెట్టటమే ఈ రంగంలోని సుదీర్ఘ సమస్యల పరిష్కారంలో తొలిమెట్టని వారు అభిప్రాయపడ్డారు. సరఫరా గొలుసుని, నిల్వ సదుపాయాల్ని పటిష్ఠం చేసేందుకు ప్రైవేటు రంగం భాగస్వామ్యాన్ని పెంచటం వంటి సాహసోపేత, లాభసాటి నిర్ణయాల గురించి, కాంట్రాక్టు వ్యవసాయం ఎలా ఉండాలి తదితర అంశాల గురించి సవివరంగా చర్చించారు. చర్చలో రైతుల సమస్యల్ని, స్థానిక రిటైల్ రంగాన్ని ప్రధానంగా దృష్టిలో పెట్టుకున్నారు. మార్కెట్ శక్తులకనుగుణంగా వ్యవసాయ విధానాన్ని హేతుబద్ధంగా, శాస్త్రీయ ఆలోచనతో, అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేస్తూ రూపొందించాలని సమావేశానికి ముగింపుగా జయప్రకాష్ నారాయణ్ సూచించారు.

సంకల్పముంటే కొవిడ్ త్వరిత కట్టడి సాధ్యమే..

# అంతర్జాతీయ హెడ్‌లైన్‌గా మారిన 'ధారవి నమూనా' ఇంజినీర్



కొవిడ్ లాక్‌డౌన్ మొదలయ్యాక టీవీ చూస్తూ, ఛానళ్లను మారుస్తూ నిపుణుల అభిప్రాయాల్ని ఆందోళనతో, ఉత్సుకతతో గంటల తరబడి ఆలకిస్తున్న ప్రజానీకాన్ని తబ్లీఘీ జమాతే ఉదంతం బాగా చికాకు పరిచింది. ఆ తర్వాత వెలువడిన మరో వార్తయితే తీవ్ర కలవరపాటుకు గురిచేసింది. ఆ షేకింగ్ న్యూసే.. ధారవిలో కరోనా కేసు బైటపడటం!

ముంబయిలోని ధారవి.. ఆసియాలోనే అతిపెద్ద మురికి వాడల్లో, ప్రపంచంలోనే అత్యధిక జనసాంద్రత గల ప్రాంతాల్లో ఒకటి. ఇక్కడ చదరపు కిలోమీటరుకి 3.54 లక్షల మంది నివసిస్తున్నారు. అందుకే ధారవిలో కొవిడ్ బైటపడిందనగానే మహారాష్ట్రతోపాటు యావత్ భారతదేశం కూడా ఉలిక్కిపడింది. ధారవిలో వైరస్‌ని కంట్రోల్ చేయటం కష్టసాధ్యమైన సవాలు. కంట్రోల్ చేయకపోతే కొవిడ్ విస్ఫోటనమే. ఈ ప్రమాదకర పరిస్థితుల్లో సవాలును ఎంజాయ్ చేస్తూ కొవిడ్ కట్టడిని సాధించారు ముంబయి మహానగర పాలక సంస్థ (బీఎంసీ) అసిస్టెంట్ కమిషనర్ కిరణ్ దిఘవకర్. ఆయన విజయం భారతదేశంలోనే కాకుండా అంతర్జాతీయ హెడ్‌లైన్‌గా మారింది. కొవిడ్‌పై పోరులో ధారవి నమూనాని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రత్యేకంగా ప్రస్తావించి అభినందించింది. తన విజయాన్ని, ధారవి నమూనాను కిరణ్ దిఘవకర్ ఇటీవల ఓ ఆంగ్లపత్రిక కిచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు. అందులోని వివరాలివి..

బీఎంసీ అసిస్టెంట్ మునిసిపల్ కమిషనర్‌గా ఉన్న 38 ఏళ్ల కిరణ్ దిఘవకర్‌కి మార్చి నెలలో పెద్ద ఎక్కువ పని ఉండేది కాదు. ఆయన తన కుటుంబంతో గోవా విహారయాత్రకి వెళ్లొచ్చారు. డ్యూటీలో రిపోర్టు చేసిన వెంటనే.. కరోనా సంక్షోభాన్ని ఎదుర్కోవటం కోసమంటూ ప్రభుత్వం గంపగుత్త లాక్‌డౌన్‌ని విధించింది. దీంతో పని ఇంకా తగ్గిపోయింది. ముంబయి 'జి' నార్త్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లోని దాదర్, మాహిం, ధారవిలు ఆయన పరిధిలో ఉండేవి. లాక్‌డౌన్ సమయంలో ఈ ప్రాంతాల్లో ఒక్క కేసు కూడా లేదు. లాక్‌డౌన్ అమలు, కొవిడ్ సన్నద్ధ ఏర్పాట్లు తప్ప వేరే పని ఉండేది కాదు. "ఆఫీసులో కూర్చుని, ఖాళీ సమయంలో నెట్‌ఫ్లిక్స్ చూస్తుండేవాణ్ణి. 'కామ్యాబ్' అనే సినిమాలో ఓ డైలాగ్ నాకు తెగ నచ్చేసింది. అందులోని ఓ ముఖ్య పాత్ర ఎప్పుడూ ఇలా అంటుంటుంది 'జీవితాన్ని ఎంజాయ్ చేయటంగాక, ఇంకేం చేస్తాం'."

ఏప్రిల్ 1న సీన్ మారిపోయింది. ధారవిలో మొదటి కొవిడ్ పాజిటివ్ కేసు నమోదైంది. ఆ మురికివాడలో వైరస్ మొదలైతే వ్యాప్తి తీరు ఎలా ఉంటుందో దిఘవకర్‌కి బాగా తెలుసు. రాబోయే కొన్ని నెలలు పెద్ద సవాలని అర్థమైంది. సిద్ధమైపోయాడు. "మా టీం కార్యరంగంలోకి దిగింది. నాకు మాత్రం ఆ డైలాగ్ గుర్తొస్తూనే ఉంది. '..ఇంకేం చేస్తాం'! మేం ఆ సవాలును ఎదుర్కోక తప్పదు. కాబట్టి ఎదుర్కోవటాన్ని ఎంజాయ్ చేద్దాం" అనుకున్నట్లు ఆ అధికారి తెలిపారు.

కొద్దిరోజుల్లోనే ధారవి కొవిడ్ హాట్‌స్పాట్‌గా మారింది. కేసులు 2,000 మార్కుని దాటేశాయి. జూన్ వచ్చాక మాత్రమే కేసుల సంఖ్య తగ్గటం మొదలైంది. జులై మూడో వారం వచ్చేసరికి ధారవిలో కేవలం 99 యాక్టివ్ కేసులున్నాయి.

### ధారవి మోడల్

ధారవిలో విపరీతమైన జనసాంద్రత గదా.. అందువల్ల ఇక్కడ భౌతిక దూరం, లాక్‌డౌన్ అమలు దాదాపు అసాధ్యం. ప్రతి ఒక్కరూ కరోనా వాహకుల్లా తయారైన ఏరియా ఇది.

భౌతిక దూరం మీద దృష్టి పెట్టకుండా, దిఘవకర్ బృందం కాంటాక్ట్ ట్రేసింగ్, క్వారంటైన్‌కి విశాలమైన సదుపాయాల ఏర్పాటు, కొవిడ్ బారినపడే ముప్పు ఎక్కువ ఉండే వారిని వేరు చేయటం, పారిశుద్ధ్యాన్ని పరిరక్షించటం కోసం కమ్యూనిటీ మరుగుదొడ్లను నిత్యం శుభ్రం చేయటం, చికిత్స కోసం ప్రైవేటు ఆస్పత్రులను తాత్కాలికంగా స్వాధీనం చేసుకోవటం, టెస్టింగుని భారీగా పెంచటం వంటివి వేగంగా అమలు చేశారు.

దీంతో, ధారవిలో కొవిడ్ పాజిటివ్ కేసుల సరాసరి పెరుగుదల ఏప్రిల్‌లో ఉన్న 12 శాతం నుంచి మే మాసంలో 4.3 శాతానికి, జూన్‌లో 0.83 శాతం, జులై మూడో వారంలో 0.38 శాతానికి పడిపోయింది. కేసుల సరాసరి రెట్టింపు శాతం ఏప్రిల్‌లో 18 రోజులుగా ఉండగా, జులైలో 430 రోజులుందని బీఎంసీ డేటా తెలియజేస్తోంది.

"మనం భావోద్వేగాలతో అతిగా స్పందించకుండా పనిచేయగలగాలి. ఒకరోజు రాత్రి బాగా పొద్దుపోయాక ఒక కాల్ వచ్చింది. అత్యవసర వైద్య సేవల కోసం ఆస్పత్రి పడక కావాలని ఎవరో ఫోన్ చేశారు. మూడు గంటల తర్వాత బెడ్

దొరికింది. తిరిగి కాల్ చేశాను. అప్పటికే ఆ రోగి చనిపోయారు. నేను వెంటనే వరుసలో తర్వాత ఉన్న రోగికి ఆ బెడ్ వివరాలు అందించాను" అని కిరణ్ దిఘవకర్ చెప్పారు.

### మీడియా ఫేవరేట్

ధారవి విజయగాథ దిఘవకర్‌కు జాతీయ స్థాయిలో ప్రశంసల్ని అందించింది. అంతర్జాతీయంగా కూడా గుర్తింపునిచ్చింది. కానీ అంతకుముందే ఈ సివిల్ ఇంజినీర్ స్థానికంగా కూడా మీడియాలో చాలా గుర్తింపును సంపాదించుకున్న అధికారి.

"మీడియా ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని ఆయనకు బాగా తెలుసు. అందుకే మిగతా అనేకమంది అధికారుల్లా కాకుండా ఆయన రిపోర్టర్లతో ఎప్పుడూ టచ్‌లో ఉండేవారు" అని పేరు వెల్లడించటానికి ఇష్టపడని బీఎంసీ అధికారి ఒకరు చెప్పారు. "కొవిడ్ ప్రమాదకరంగా ఉన్న దశలో కూడా ఏ రోజు సంఖ్యల్ని ఆ రోజు మీడియాతో పంచుకున్న బీఎంసీ అధికారి ఆయనొక్కరే. వాట్సాప్ ద్వారా జర్నలిస్టులకు అప్‌డేట్‌లను పంపుతుండేవారు" అని తెలిపారు. దిఘవకర్ అరమరికలు లేకుండా మాట్లాడతారు, ఎటువంటి వారితోనైనా ఇట్టే మాటలు కలపగలరు. సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకోగలరు" అన్నారు.

2019లో 'జి' నార్త్ వార్డులో పోస్టింగ్‌కు ముందు దిఘవకర్ ముంబయి 'ఎ' వార్డులో అసిస్టెంట్ మునిసిపల్ కమిషనర్‌గా పనిచేసేవారు. కొలాబ, కఫే పరేడ్, చర్చ్ గేట్, సీఎస్‌టీ వంటి సంపన్న ప్రాంతాలు ఈ వార్డులో ఉండేవి. బస్తీలు ఎక్కువగా ఉండే నగరంలోని 'సి' వార్డులో కూడా ఆయన పనిచేశారు.

మహారాష్ట్ర విద్యుత్ బోర్డులో ఇంజినీరు కుమారుడైన దిఘవకర్ నాసిక్ జిల్లా సతానా తాలూకాలో పెరిగారు. ఐఏఎస్‌గానీ, ఐపీఎస్‌గానీ కావాలని ఆకాంక్షించేవారు.

ఆ ప్రయత్నంలో రెండుసార్లు విఫలమయ్యాక, ముంబయి మహానగర పాలక సంస్థలో ఇంజినీర్‌గా ఎనిమిదేళ్ల క్రితం చేరారు. రోడ్ల విభాగంలో పనిచేసేవారు. ఆ తర్వాత మహారాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్ష రాసి 2013లో అసిస్టెంట్ మునిసిపల్ కమిషనర్‌గా ఎంపికయ్యారు.

"నా తల్లిదండ్రులు ఎప్పుడూ చెబుతుండేవారు.. నువ్వు ఎక్కడ పనిచేసినా, ప్రజలు నిన్ను గుర్తుపెట్టుకునే మూడు కార్యక్రమాల్ని అమలు చెయ్యి". టాయిలెట్ల దగ్గర్నుంచి ఫుట్‌పాత్‌ల వరకు అలాంటి ప్రజోపయోగ ప్రాజెక్టుల్ని దిఘవకర్ పూర్తిచేశారు. వీటిలో చాలా కార్యక్రమాలకు స్థానిక మీడియాలో మంచి కవరేజీ వచ్చింది. ముంబయి పౌరసేవల విభాగం వార్తల్ని ఎన్నో ఏళ్లుగా కవర్ చేసే ఓ రిపోర్టరు అంటాడు గదా.. "ఏ కథనాలకి ప్రజల్లో ఆదరణ ఉంటుందో దిఘవకర్‌కి తెలుసు. అందుకే ఆయన ఎప్పుడూ వార్తల్లో ఉంటారు".

కరోనాపై ధారవిలో యుద్ధం ఇంకా ముగియలేదు. దిఘవకర్ టీంలో 35 మందికి టెస్ట్ చేయిస్తే 21 మందికి పాజిటివ్ వచ్చింది. ఇంటి వద్ద పిల్లలు, ఇతర కుటుంబ సభ్యులతో కలవకుండా వేరే గదిలో ఉంటానని.. జలుబు, అసౌకర్యంతో అర్ధరాత్రి పూట హఠాత్తుగా లేచి థర్మామీటర్, ఆక్సీమీటర్‌తో టెంపరేచర్, ఆక్సిజన్ స్థాయిలు చూసుకుని హమ్మయ్య అనుకున్న సందర్భాలున్నాయని చెబుతారు. తనకు ఇంతవరకూ కొవిడ్ లక్షణాలు లేవని, అందువల్ల టెస్టింగ్ చేయించుకోలేదని దిఘవకర్ తెలిపారు. లక్షణాలు లేకున్నా టెస్టింగ్ చేయించుకుంటే, ఒకవేళ పాజిటివ్ వస్తే 14 రోజుల సమయం వృథా అవుతుందన్నదే తన బాధన్నారు.

కొస ప్రశ్న: సంకల్పం, స్మార్ట్‌నెస్ ఉంటే కొవిడ్‌ని వేగంగా కట్టడి చేయటం సాధ్యమేనని ధారవి అనుభవం రుజువు చేసింది. ధారవి నమూనా భారతదేశం మొత్తానికీ యథాతథంగా పనికిరాకపోవచ్చు, కానీ ధారవిలాంటి ప్రాంతంలో కొవిడ్‌ను కట్టడి చేయటానికి ప్రదర్శించిన సంకల్పాన్ని.. ఎన్నికల్లో భారీ విజయాల్ని సాధించాం కాబట్టి మహానేతలమనుకునే పాలకులు, ప్రజల పన్నుల డబ్బు నుంచి వేల, లక్షల రూపాయల జీతాలు తీసుకునే అధికారులు దేశంలోని ఇతర అనేక ప్రాంతాల్లో ఎందుకు ప్రదర్శించలేక చేతులెత్తేశారు?

## విద్యార్థులు ప్రజాస్వామ్యం గురించి తెలుసుకోవడం ముఖ్యం కాదా?

సీబీఎస్ఈ సిలబస్ నుంచి లౌకికవాదం, పౌరసత్వం, జాతీయవాదం, పెద్దనోట్ల రద్దు, ప్రజాస్వామ్య హక్కులు వంటి పాఠ్యాంశాలను తొలగించటం తీవ్ర వివాదాస్పదమైంది. పాఠ్యాంశాల తొలగింపు పార్టీ సిద్ధాంతపరంగా జరిగినట్లుగా ఉందని, విద్యావేత్తల సలహాల కంటే సొంత రాజకీయ పరిశీలనలకే ప్రాధాన్యం ఇచ్చారని విమర్శలు వస్తున్నాయి. కరోనా సంక్షోభం కారణంగా మారిన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పిల్లలపై 30 శాతం భారం తగ్గించేందుకు 2020-21 సంవత్సరానికి 9-12 తరగతుల నూతన సిలబస్‌ను సీబీఎస్ఈ బోర్డు ఇటీవల ప్రకటించింది. కొత్త సిలబస్ ప్రకారం.. పదో తరగతిలో 'ప్రజాస్వామ్యం-వైవిధ్యం, మతం, కులం, ప్రజా పోరాటాలు, ఉద్యమాలు, ప్రజాస్వామ్యానికి సవాళ్లు' తదితర పాఠ్యాంశాలను తొలగించారు. 11వ తరగతిలో 'సమాఖ్య విధానం, పౌరసత్వం, జాతీయవాదం, లౌకికవాదం, దేశంలో స్థానిక ప్రభుత్వాల పురోగమనం' వంటివి తీసేశారు. 12వ తరగతిలో 'సరిహద్దు దేశాలతో భారత్ సంబంధాలు, సంస్కరణలతో ఆర్థికాభివృద్ధి, దేశంలో సామాజిక ఉద్యమాలు, పెద్దనోట్ల రద్దు' వంటి అంశాలు పక్కనపెట్టారు (జమ్మూ కాశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దును మాత్రం ఎన్‌సీఈఆర్‌టీ 12వ తరగతి సిలబస్‌లో కొత్తగా చేర్చారు).. తల్లిదండ్రులు సిలబస్ తగ్గించమంటే ఈ రకంగానా, విద్యార్థులకు ప్రజాస్వామ్యం గురించిన అవగాహన ముఖ్యం కాదా అని వస్తున్న విమర్శలకు సమాధానమిస్తూ, సిలబస్ కుదింపు కేవలం 2020-21 విద్యాసంవత్సరానికే పరిమితమని సీబీఎస్ఈ కార్యదర్శి చెప్పారు.

బండారు రామ్మోహనరావు, 98660 74027

## సత్వర న్యాయం, ముంగిట న్యాయం పునాదిగా..

# న్యాయ సంస్కరణలు రావాలి!

అంతర్జాతీయ న్యాయ దినోత్సవాన్ని ఈ సంవత్సరం కూడా జులై 17న యథావిధిగా జరుపుకున్నాం. కొవిడ్ సంక్షోభంలోనూ ప్రజలు న్యాయవ్యవస్థ సాయం కోసం చూస్తున్నా, అందరికీ న్యాయం అందించే మార్పుల గురించిన పట్టింపే లేకుండా గతంలో కంటే పేలవంగా జరుపుకున్నాం. మన దేశంలో న్యాయవ్యవస్థ బూజుపట్టిన చట్టాలతో, పాత నేరవిచారణ పద్ధతులతో ఇంకా నత్తనడకనే సాగుతున్నది. దీన్ని మార్చాలంటే మన న్యాయవ్యవస్థలో విప్లవాత్మక మార్పులు రావాలి.

జగమెరిగిన ఓ ఆంగ్ల సామెత చెప్పినట్లు "న్యాయం అందడంలో ఆలస్యం అయితే న్యాయాన్ని నిరాకరించినట్లే".

అచ్చంగా మన దేశంలో న్యాయాన్ని నిరాకరించేరీతిలోనే వ్యవస్థ నడుస్తోంది. సత్వర న్యాయం, ముంగిట న్యాయం ప్రజలకు అందని ద్రాక్షగా మారాయి. సివిల్ కేసులలో, తాత వేసి మనవడి దాకా తెగని కేసులు ఎన్నో ఉన్నాయి. అలాగే క్రిమినల్ కేసుల్లో కూడా మన న్యాయవ్యవస్థలో విక్టిమాలజీ (బాధితులకు తోడ్పాటు న్యాయం) లేకపోవడం వలన చాలాసార్లు బాధితులకు అన్యాయం జరుగుతోంది. ప్రజాస్వామ్యం, న్యాయం వేర్వేరు కాదు. సమన్యాయం సక్రమంగా, సకాలంలో అందితేనే ప్రజాస్వామ్యం మనుగడ సాగించగలుగుతుంది. అందుకే మన భారతదేశ న్యాయవ్యవస్థలో కీలక సంస్కరణలు రావలసి ఉన్నది.

ఇందులో మొదటి సమస్య, ఎప్పుడో బ్రిటిష్ వారి కాలంలో ఏర్పాటు చేసిన బూజు పట్టిన పనికిరాని చట్టాలను ఇప్పటికీ మనం అలాగే కొనసాగించడం జరుగుతోంది. ఇవి స్వాతంత్ర్యం అనంతరం మనం చేసుకున్న కొన్ని కొత్త చట్టాలకు అవరోధంగా కూడా ఉన్నాయి. వీటిలో అవసరమైన చట్టాలను కొనసాగించుకుంటూ, అవసరంలేని అనేక చట్టాలను రద్దు చేయవలసి ఉంటుంది.

రెండవది, బ్రిటిష్ వారి నుండి వారసత్వంగా తీసుకున్న అనేక సివిల్ చట్టాలను సివిల్ ప్రొసీజర్ కోడ్‌లో పెద్ద మార్పులు, చేర్పులు లేకుండా మనం అలాగే కొనసాగించడం వల్ల కేసులు నత్తనడక నడుస్తున్నాయి. అందుకే సత్వర న్యాయం ప్రజలకు అందడం లేదు.

ఇక మూడవది, క్రిమినల్ కేసుల విషయానికి వస్తే నిందితులపై మోపబడ్డ నేరం కోర్టులో విచారణ జరిగి నేరం రుజువైతే ఆరు నెలల జైలు శిక్ష కూడా పడని కేసులలో కూడా.. నిందితులు ఏళ్ల తరబడి జైళ్లలో మగ్గుతుండడం మరో విషాదం. ఎప్పుడో బ్రిటిష్ వారి హయాంలో ఏర్పాటు చేసిన నేర విచారణ పద్ధతి ఇప్పటికీ అవలంబించడమే దీనికి కారణం. ఆయా దేశాల్లో సత్వర న్యాయం,



ముంగిట న్యాయం వైపుగా న్యాయసంస్కరణలు సాగుతుంటే మనం మాత్రం ఇంకా వెనుకటి కాలంలోనే ఉన్నాం.

నాలుగో అంశం, జనాభాకు సరిపడా కోర్టులు లేకపోవడం న్యాయవ్యవస్థలో జాప్యానికి మరో కారణం. గ్రామీణ న్యాయాలయాల వ్యవస్థ ఏర్పాటు చేయడం దీనికి పరిష్కారం.

ఐదవ అంశం, న్యాయమూర్తుల నియామకం. ప్రపంచంలో ఏ ప్రజాస్వామిక వ్యవస్థలో కూడా న్యాయమూర్తులు తమను తాము నియమించుకునే పద్ధతి లేదు. కానీ మన దేశంలో హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులను సుప్రీంకోర్టు కొలీజియం నియమిస్తుంది. ఇది తన కాళ్లకు తానే మొక్కుకొని దీర్ఘాయుష్మాన్‌భవ అన్నట్లుగా ఉంది.

ఈ ఐదు అంశాలతోపాటు మరో అంశం కూడా ప్రాధాన్యత సంతరించుకుంది. చాలా అభివృద్ధి చెందిన దేశాలలో పాటిస్తున్న బాధితులకు తోడ్పాటును అందించే న్యాయాన్ని అంటే విక్టిమాలజీ సూత్రాన్ని మనం పాటించడం లేదు. దాంతో బాధితులకు కన్నీళ్లే మిగులుతున్నాయి. న్యాయస్థానాల్లో నిందితుల మీద నేరం రుజువై శిక్షలు పడ్డా బాధితులకు వచ్చే లాభం ఏమీ లేదు. దీంతో కోర్టు విచారణ జరుగుతున్నంతకాలం బాధితులు గుడ్లనీరు కుక్కుకుంటూ అందరి ముందూ పరువు పోతున్నా సాక్ష్యం కోసం కోర్టులకు హాజరవుతూ యమయాతన అనుభవిస్తున్నారు. నిందితుడు అవమానం చేసిన దానికంటే కోర్టులో జరిగే అవమానం బాధితులకు ఎక్కువ. మన నేర విచారణ వ్యవస్థలో ఫలానా వ్యక్తి నేరం చేశాడని నిరూపించే బాధ్యత ప్రాసిక్యూషన్ మీద ఉంది. దీంతో ప్రాసిక్యూషన్ చేసే పోలీసు న్యాయవ్యవస్థలో ఉన్న ప్రభుత్వ న్యాయవాదులు నిందితులతో కుమ్మక్కు అయ్యే ప్రమాదం ఎక్కువగా ఉన్నది. బాధితులు తమ కేసు గెలవాలని లంచం ఇచ్చుకోలేరు. కానీ నేరం చేసిన నిందితులు అటు పోలీసులను, ఇటు ప్రభుత్వ

న్యాయవాదులను తాము ఇచ్చే లంచాలతో ప్రభావితం చేయగలరు. దీంతో మన దేశంలో నిందితులకు విధించే శిక్షల శాతం చాలా తక్కువ. అంతర్జాతీయంగా చాలా దేశాలలో విధించే శిక్షల శాతాన్ని పోల్చుకుంటే ఇది ఇంకా తక్కువగా ఉంది.

### బాధితులకు న్యాయం అందించాలి

విక్టిమాలజీ ప్రకారం నేర విచారణ జరుగుతున్న దేశాలలో నిందితులే తాము తప్పు చేయలేదని రుజువు చేసుకోవలసి ఉంటుంది. కనుక అక్కడ బాధితులకు సరైన న్యాయం జరుగుతుంది.

బాధితులు తమకు అన్యాయం జరిగిందని పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు ఇచ్చినప్పటి నుండి అది ఎఫ్ఐఆర్‌గా నమోదు కావటం, ఆ తర్వాత నిందితులను అరెస్టు చేయడం, కోర్టులో ప్రవేశపెట్టడం, సరైన నేరవిచారణ చేసి నిందితులపై నేరారోపణ మోపుతూ కోర్టులో చార్జిషీటు వేయడం, ఆ తర్వాత కోర్టులో నేర విచారణ ట్రయల్ జరిగి సాక్ష్యాధారాలు సరైన విధంగా ఉండి నేరం రుజువైతే అప్పుడు నిందితులకు శిక్ష పడుతుంది. ఇదంతా జరగడానికి మన దేశంలో ఒక్కోసారి జీవితకాలం పడుతుంది. అటు బాధితులు ఇటు నిందితులు కూడా మరణించిన సందర్భాలున్నాయి. క్రిమినల్ కేసుల విచారణ పద్ధతుల్లోని సాగదీత కూడా సమస్యను జటిలం చేస్తోంది.

### పోలీసు సంస్కరణలు కావాలి.. స్వతంత్ర నేరదర్యాప్తు వ్యవస్థల్ని ఏర్పరచాలి

కోర్టుల్లో క్రిమినల్ కేసులు సత్వర పరిష్కారం జరగకపోవడానికి, శిక్షల శాతం తగ్గడానికి పోలీసు వ్యవస్థ కూడా ఒక కారణం. ప్రస్తుతం ఉన్న వ్యవస్థలో పోలీసులు అనేక విధులు నిర్వర్తించవలసి ఉంటుంది. శాంతిభద్రతల పరిరక్షణ నుండి ట్రాఫిక్ నియంత్రణ, వీఐపీలు, వీవీఐపీల బందోబస్తు వరకు.. జైలు నుండి ప్రతి వాయిదాకు కోర్టుకు నిందితులను హాజరు పరిచే ప్రక్రియ నుండి నేరదర్యాప్తు చేసి కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టే వరకు వీరొక్కరే అనేక బాధ్యతలను నిర్వహించాల్సి వస్తోంది. దీన్ని మార్చకుండా మనం న్యాయవ్యవస్థలో సంస్కరణలు తీసుకురాలేము. అందుకే శాంతిభద్రతలు, నేరపరిశోధనలను వేరు చేయాలి. నేరాల దర్యాప్తునకు స్వతంత్ర ప్రతిపత్తిగల పోలీసు విభాగాన్ని ప్రవేశపెట్టాలి. ప్రతీ సాధారణ పోలీస్ స్టేషన్‌లో కేవలం జరిగిన నేరాన్ని నమోదు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేసే వరకే సిబ్బంది బాధ్యత ఉండాలి. రాష్ట్రంలో ఒక స్వతంత్ర నేరదర్యాప్తు వ్యవస్థను 'జవాబుదారీతనం'తో ఏర్పాటు చేయాలి. ఇందులోని సిబ్బందికి సాధారణ పోలీసు విధులు కేటాయించరాదు. ఈ స్వతంత్ర నేరదర్యాప్తు వ్యవస్థను జిల్లా, మండల కేంద్రాల వరకు విస్తరించాలి. వికేంద్రీకరణ చేసిన విభాగాల ద్వారా రాష్ట్ర స్వతంత్ర నేరపరిశోధన సంస్థ ఆధ్వర్యంలోనే కిందిస్థాయి వరకు నేరాల విచారణ జరగాలి. కోర్టు డ్యూటీలు కూడా ఈ పోలీసులకే కేటాయించాలి. అలాగే ఈ స్వతంత్ర నేరదర్యాప్తు శాఖలో నియామకాలు పూర్తిగా స్వతంత్ర న్యాయవ్యవస్థ ద్వారానే జరగాలి. నేరపరిశోధనలో ఆధునిక పద్ధతులు, నైపుణ్యంతో కూడిన దర్యాప్తు చేయడానికి న్యాయపట్టభద్రులను నియమించాలి. సరైన రుజువులు, సాక్ష్యాల్ని సేకరించడంలో, నేరాన్ని రుజువు చేయడంలో నైపుణ్యంతో కూడిన పని వీరి వల్ల వేగంగా జరుగుతుంది. ఇందులో రాజకీయ జోక్యం అసలే ఉండకూడదు. అప్పుడే తప్పు చేసిన నిందితులకు శిక్ష పడుతుంది, బాధితులకు సరైన న్యాయం దొరుకుతుంది.

ఇక సివిల్ కేసుల విషయానికొస్తే చెప్పనే అవసరం లేదు. ఎప్పుడో స్వాతంత్ర్యానికి పూర్వం నుండి ఢిల్లీలోని ఒక కోర్టులో 60 సంవత్సరాలుగా విచారణలో ఉండి షష్ఠిపూర్తి చేసుకున్న సివిల్ కేసును స్వాతంత్ర్యం వచ్చాక 60 ఏళ్ల తర్వాత పరిష్కరించినందుకు సుప్రీంకోర్టు జడ్జి తన జన్మధన్యమైందని చెమ్మగిలిన కళ్లతో వ్యాఖ్యానించారు. ఇది న్యాయవ్యవస్థలో జాప్యానికి పరాకాష్ఠ అని నిట్టూర్చారు.

### జాతీయ న్యాయనియామకాల కమిషన్ ఏర్పాటు చేయాలి

ఇన్ని సమస్యల మధ్య హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకం మౌలిక వివాదాస్పద సమస్యగా కొనసాగుతోంది. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ తలచుకుంటే చాలా సందర్భాల్లో ఎక్కడో మూలన కూర్చున్న జిల్లా కోర్టు, హైకోర్టులలో ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాదిని సుప్రీంకోర్టు జడ్జిగా నియమించే అవకాశం ఉంది. వారికి ఎలాంటి ప్రతిభాపాటవాలు ఉండాల్సిన అవసరం లేదు. కేంద్రంలో అధికారంలో ఉన్న వారికి దాసులైతే చాలు. మున్సిఫ్ కోర్టు నుండి జిల్లా కోర్టు వరకు నియమించే న్యాయాధికారులకు అవసరమైన రాత పరీక్షలు, మౌఖిక పరీక్షలు పెడతారు. కానీ వీరు ఇచ్చే తీర్పులపై అప్పీలుకు వెళితే అక్కడ న్యాయం చెప్పాల్సిన హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు మాత్రం నియామకానికి ఎలాంటి పరీక్షల్లో పాస్ కావాల్సిన అవసరం లేదు. ఇతరత్రా కొన్ని ఉన్నా కేంద్ర ప్రభుత్వం పట్ల రాజభక్తి పెద్ద అర్హత. ఈ మాటను న్యాయమూర్తులుగా నియమితులైవారు కూడా చాలా సందర్భాల్లో తమ వ్యాఖ్యల ద్వారా వెల్లడించారు. దీనికి పరిష్కారంగా మేధావులు, విద్యావంతులు, లోక్‌సత్తా లాంటి స్వచ్ఛంద సంస్థలు న్యాయమూర్తుల నియామకానికి సంబంధించి పాటించాల్సిన నిబంధనల్ని, సూచనల్ని చేశారు. అందులో భాగంగా జాతీయ న్యాయమూర్తుల నియామకానికి సంస్థను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. దేశ ప్రధాని, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు/నాయకురాలు, న్యాయ శాఖా మంత్రి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, మరో ఇద్దరు సుప్రీంకోర్టు న్యాయమూర్తులతోపాటు దేశంలోని ఎలాంటి వివాదాలు లేని వివిధ రంగాలలోని ఇద్దరు ముగ్గురు ప్రముఖులను ఈ కమిటీలో వేయాలని వారు సూచనలు చేశారు. ఈ సూచనలు చేసినవారిలో జస్టిస్ వర్మలాంటి ఎందరో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, మాజీ న్యాయమూర్తులు ఉన్నారు. ఒకప్పుడు కొలీజియం వ్యవస్థను ప్రతిపాదించిన జస్టిస్ వర్మతోపాటు జస్టిస్ కృష్ణయ్యర్, జస్టిస్ వెంకటాచలయ్యలతో కమిటీని వేసి వారి ద్వారా లోక్‌సత్తా రూపొందించిన జాతీయ న్యాయమూర్తుల నియామక కమిషన్ (ఎన్‌జేఏసీ) చట్టాన్ని పార్లమెంటు ఆమోదం తర్వాత పలు రాష్ట్రాల శాసనసభల ధృవీకరణతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చినా, సుప్రీంకోర్టే దాన్ని కొట్టివేసింది. మా నియామకాలలో మీరు వేలు పెట్టవలసిన అవసరం లేదంది. ఇది సుప్రీంకోర్టు నిరంకుశత్వానికి

నిదర్శనమని ఎంతో న్యాయకోవిదులు అభిప్రాయం వెలిబుచ్చారు. కానీ నవ్విపోదరు గాక నాకేటి సిగ్గు అన్నట్లు సుప్రీంకోర్టు వ్యవహరిస్తోంది. న్యాయసంస్కరణల్లో భాగంగా సత్వర న్యాయం, ముంగిట న్యాయం కోసం అనేక చట్టాలను మార్చవలసి ఉంది. అయితే న్యాయమూర్తుల నియామకంలో కూడా పారదర్శకత, జవాబుదారీతనం ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకపోతే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసినవారు కూడా ఆ తర్వాత ప్రభుత్వాలు ఇచ్చే పదవులకు ఆశపడే అవకాశముంది. అలా తయారయ్యారు కూడా. ఈ రకమైన ధోరణి న్యాయవ్యవస్థకు మంచిది కాదు. ఇప్పటికీ మన రాజ్యాంగ ప్రజాస్వామ్యానికి మూల స్తంభాలైన రాజకీయ, కార్యనిర్వాహక వ్యవస్థల కంటే న్యాయవ్యవస్థ మీదే ప్రజలకు నమ్మకం ఉంది. ఆ నమ్మకాన్ని వమ్ము కానీయరాదు. ఇప్పటికైనా కొలీజియం ద్వారా కాకుండా జాతీయ న్యాయ కమిషన్ ద్వారా ఉన్నత న్యాయస్థానాల జడ్జిల నియామకం జరగాలి.

## కోర్టుల సంఖ్య పెంచాలి

అలాగే ప్రస్తుతం మన దేశ జనాభాకు అవసరమైనన్ని కోర్టులు లేవు. దేశంలో కింది కోర్టుల నుండి అన్ని రాష్ట్రాల హైకోర్టులు, సుప్రీంకోర్టు వరకు పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్య సుమారు మూడు కోట్ల 50 లక్షలు. ప్రస్తుతమున్న విధంగానే నత్తనడకే కొనసాగితే, సుమారు మూడు వందల యాభై సంవత్సరాలకిగానీ కేసులు పరిష్కారం కావు. అదీ ఇప్పటి నుండి కొత్తగా ఒక్క కేసు కూడా నమోదు కాకుంటే.

## జాతీయ పాలనా సంస్కరణల సంఘం 2005 సిఫార్సులను అమలు చేయాలి

2005లో అప్పటి కేంద్ర న్యాయశాఖ మంత్రి వీరప్ప మొయిలీ ఆధ్వర్యంలో వేసిన రెండవ పరిపాలనా సంస్కరణల సంఘం సిఫార్సులను వెంటనే అమలు చేయాలి. ఈ కమిటీలో కేంద్ర ప్రభుత్వంలో డిప్యూటీ స్టేట్ మినిస్టర్ హోదా కలిగిన మెంబర్‌గా లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్, మరో ముగ్గురు సభ్యులు ఉన్నారు. వారు దేశమంతటా పర్యటించి ప్రజాభి ప్రాయం సేకరించారు. 2005లో హైదరాబాద్ జూబ్లీ హాల్‌లో ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చినప్పుడు ఒక సీనియర్ న్యాయవాదిగా నేను కొన్ని న్యాయసంస్కరణల్ని వారికి ఇచ్చిన అఫిడవిట్ ద్వారా సూచించాను. కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో వారు అప్పుడు నేను అఫిడవిట్లో చేసిన కొన్ని సూచనల్ని పొందుపరిచారు.

సత్వర న్యాయం, ముంగిట న్యాయం కోసం న్యాయవ్యవస్థలో జాప్యాన్ని నివారించాలని, దానికి పరిష్కార మార్గంగా దేశవ్యాప్తంగా గ్రామీణ న్యాయాలయాల ఏర్పాటును ఆ సంఘం సూచించింది. లోక్‌సత్తా కృషితో గ్రామ/స్థానిక న్యాయాలయాల చట్టం 2008లో వచ్చింది. కానీ ఇన్నేళ్లయినా ఇప్పటివరకు మధ్యప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్రల్లో అరాకొరాగానే గ్రామన్యాయాలయాలు ఏర్పాటయ్యాయి. గ్రామన్యాయాలయాలు అంటే ప్రజలలో ఒక అపోహ ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ప్రతిపాదించిన గ్రామీణ న్యాయస్థానాల చట్టాన్ని పోలి ఉంటుందని అనుకుంటున్నారు. కానీ ఇది అలా కాదు. ఆయా రాష్ట్రాలలో జనాభాను బట్టి ప్రతి లక్ష మంది పట్టణ జనాభాకు, ప్రతి 50 వేల మంది గ్రామీణ జనాభాకు ఒక కోర్టు ఏర్పాటు చేయాలని గ్రామన్యాయాలయాల చట్టంలో ప్రతిపాదించారు. జనాభా ప్రాతిపదికన ఆయా రాష్ట్రాలు కొంచెం అటుఇటుగా వెసులుబాటు కల్పించుకోవచ్చు. అలా ఏర్పాటు చేయబోయే కోర్టుల నిర్వహణ ఖర్చు కూడా తక్కువగానే ప్రతిపాదించారు. ఇందులో సీనియర్ న్యాయవాదులను, రిటైర్డ్ న్యాయమూర్తులను, న్యాయాధికారులను మూడేళ్ల కాంట్రాక్ట్ విధానంలో నియమించవచ్చు అని పేర్కొన్నారు. అలాగే న్యాయాధికారి కాకుండా మరో అయిదుగురు కోర్టు సిబ్బందితో నెలకి అయిదారు లక్షలు మించకుండా వీటిని నడిపించవచ్చు. ఇందులో రెండేళ్లలోపు శిక్ష పడే కేసులు, 10 లక్షల లోపు విలువ గల ఆస్తి కేసులు విచారణ జరపవచ్చు. ఆరు నెలల వ్యవధిలో సివిల్ కేసులు, మూడు నెలల వ్యవధి మించకుండా క్రిమినల్ కేసుల విచారణ పూర్తి చేయవలసి ఉంటుంది. అలాగే అన్ని కుటుంబ తగాదాల కేసులు, చిల్లరమల్లర కేసులు, షాపులు ఇతర నిర్వహణ కేసులు, అరెస్టు చేయకుండా కోర్టు నుండి డైరెక్టుగా సమన్లు పంపే అన్ని కేసులు కూడా ఇక్కడే విచారించవచ్చు. ఇలా న్యాయవ్యవస్థను వికేంద్రీకరించడం వల్ల క్లిష్టమైన కేసులు విచారించడానికి జిల్లా కోర్టులకు వీలు కలుగుతుంది, తగినంత సమయం దొరుకుతుంది.

## స్థూలంగా..

● న్యాయ, పోలీసు సంస్కరణలు రావాలి ● బూజుపట్టిన చట్టాలను రద్దు చేయాలి ● స్వతంత్ర నేరదర్యాప్తు యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి ● దేశవ్యాప్తంగా గ్రామ న్యాయాలయాల్ని ప్రవేశపెట్టాలి. తెలుగు రాష్ట్రాల్లో మండలానికి ఒక కోర్టు ఏర్పాటు చేయాలి. ఇప్పటికైనా న్యాయవ్యవస్థ మేలుకొని స్వీయసంస్కరణలకు స్వచ్ఛందంగా ముందుకు రావాలి. స్వయందిద్దుబాటుతో తమను తామే సరిదిద్దుకోవాలి. అప్పుడే ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన మన దేశంలో భారత న్యాయవ్యవస్థ కీర్తిపతాకం ప్రపంచవ్యాప్తంగా రెపరెపలాడుతుంది.




**"న్యాయమైన లక్ష్యాన్ని సత్యం ఎన్నడూ నష్టపరచదు"**

**- మహాత్మాగాంధీ**

# జాతీయ నూతన విద్యావిధానానికి కేంద్రం ఆమోదం

డాక్టర్ కస్తూరి రంగన్ కమిటీ రూపొందించిన జాతీయ విద్యావిధానం-2020కి కేంద్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. దీంతో 34 ఏళ్ల తర్వాత దేశ విద్యారంగంలో గణనీయ మార్పులకు శ్రీకారం చుట్టినట్లయింది. ప్రస్తుతం తరగతులవారీగా ఉన్న 10+2+3 విధానం స్థానంలో.. పిల్లల 3వ సంవత్సరం నుంచి అమలయ్యేలా 5+3+3+4 ఏళ్ల పాఠ్యక్రమ విధానం అమల్లోకి వస్తుంది. కొత్త విధానంలో 3 నుంచి 6 ఏళ్ల వరకు ప్లేస్కూల్ ఉంటుంది. 3 నుంచి 8 ఏళ్ల లోపు వారు ఫౌండేషన్ స్టేజిలో, 8 నుంచి 11 ఏళ్ల మధ్యవారు ప్రిపరేటరీ స్కూలింగ్‌లో, 11-14 ఏళ్ల మధ్యవారు మిడిల్ స్కూల్‌లో, 14-18 ఏళ్ల వారు సెకండరీ స్థాయిలో ఉంటారు. అయిదో తరగతి వరకు ప్రాథమిక విద్యను మాతృభాషలో కొనసాగించాలి. బలవంతంగా ఏ భాషనూ రుద్దకుండా త్రిభాషా సూత్రాన్ని అమలు చేస్తారు. 6వ తరగతి నుంచే కోడింగ్, వృత్తివిద్యా కోర్సులుంటాయి. బడికి పుస్తకాలు తేవాల్సిన అవసరం లేని కొన్ని కార్యక్రమాల్ని అమలు చేస్తారు. ప్రాథశాల విద్య పూర్తి చేసుకుని బయటికెళ్లేనాటికి కనీసం ఒక వృత్తి విద్యానైపుణ్యమైనా విద్యార్థి చేతిలో ఉండేలా చేయాలన్నది లక్ష్యం. 12వ తరగతి (ఇంటర్) వరకు పాఠశాల విద్యలోకి తెస్తారు. విద్యార్థులు తమకిష్టమైన కోర్సులను చదువుకునే వెసులుబాటు కల్పిస్తారు. బీఈడీని నాలుగేళ్ల డిగ్రీ విద్యగా మార్చటంతోపాటు 2022 కల్లా ఉపాధ్యాయులకు జాతీయ వృత్తి ప్రమాణాల కోసం ప్రొఫెషనల్ స్టాండర్డ్స్ సెట్టింగ్ బాడీ (పీఎస్ఎస్‌బీ)ని ఏర్పాటు చేస్తారు. తరగతికి తగ్గట్లు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు ఉన్నాయో లేదో అంచనా వేసేందుకు జాతీయ అసెస్‌మెంట్ బోర్డును ప్రతిపాదించారు. ప్రోగ్రెస్ రిపోర్టుల్లో విద్యార్థి స్వీయ అభిప్రాయాలకూ ప్రాధాన్యత ఇస్తారు. ఏటా విద్యార్థులు నేర్చుకోవాల్సిన లైఫ్‌స్కిల్స్ గురించి తల్లిదండ్రులతో మాట్లాడి నివేదిక రూపొందిస్తారు. పాఠశాలలకు కూడా అక్రెడిటేషన్‌ను అమలు చేస్తారు. ప్రైవేటు ఉపాధ్యాయులకూ 'టెట్' తప్పనిసరి అవుతుంది. బాలికల విద్యాభివృద్ధి కోసం ప్రత్యేక నిధి ఏర్పాటు చేస్తారు. ఇప్పటివరకు బోర్డు పరీక్షలకున్న ప్రాధాన్యాన్ని తగ్గించనున్నారు. బట్టీ పట్టే సామర్థ్యాన్ని కాకుండా వారిలోని తెలివితేటల్ని పరీక్షించేలా ఎగ్జామ్స్ ఉంటాయి. యూజీ కోర్సుల్లో బహుళ ప్రవేశాలు, నిష్క్రమణల విధానాన్ని ప్రవేశపెట్టనున్నారు. ఒకటి రెండు సంవత్సరాలు చదివిన తర్వాత విద్యార్థులు ఏదైనా కారణాలతో చదువులు మానేసినా, తమకు వీలైన సమయంలో మళ్లీ కొనసాగించుకునే వెసులుబాటును డిజిటల్ లాకర్‌లో భద్రపరిచిన పాత క్రెడిట్స్‌ను అందించటం ద్వారా కల్పిస్తారు. ఉద్యోగాలకు వెళ్లానుకునేవారికి మూడేళ్ల డిగ్రీ, పరిశోధనారంగం వైపునకు వెళ్లాలనుకునేవారికి నాలుగేళ్ల డిగ్రీ ప్రోగ్రాం అమలు చేస్తారు. నాలుగేళ్ల డిగ్రీ తర్వాత ఓ ఏడాది పీజీ చేస్తే, ఆ తర్వాత ఎంఫిల్ అవసరం లేకుండానే పీహెచ్‌డీకి వెళ్లవచ్చు. కాలేజీలు క్రమంగా అటానమస్ కావలసి ఉంటుంది. అన్ని కోర్సుల్లో హోలిస్టిక్, మల్టీ డిసిప్లినరీ విద్యావిధానాన్ని తీసుకొస్తారు. విద్యారంగంలో సాంకేతిక వ్యవస్థను విస్తృతంగా ఉపయోగించడానికి ప్రైవేటు, ప్రభుత్వ సాంకేతిక రంగాన్ని ఒకే వేదిక మీదికి తెస్తూ 'నేషనల్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ' ఫోరం ఏర్పాటు చేస్తారు. ఈ-కంటెంట్‌ను తెలుగులో కూడా అందిస్తారు. న్యాయ, వైద్య విద్య మినహాయించి అన్నింటికీ ఒకే రెగ్యులేటరీ వ్యవస్థ ఉంటుంది. ప్రస్తుతం విద్యావ్యవస్థ నియంత్రణ కోసం ఉన్న యూజీసీ, ఏఐసీటీఈ, జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి వంటి వ్యవస్థల్ని రద్దు చేసి, మొత్తం ఉన్నత విద్యావ్యవస్థ నియంత్రణకు ఒకే వ్యవస్థను ఏర్పాటు చేస్తారు. ఉన్నత విద్యకు దేశవ్యాప్తంగా ఒకే పరీక్ష ఉంటుంది. 2035 నాటికి 'స్థూల నమోదు నిష్పత్తి' (గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో)ని ఇప్పుడున్న 26.3% నుంచి 50%కి తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనివల్ల ఉన్నత విద్యాసంస్థల్లో కొత్తగా 3 కోట్ల సీట్లు వస్తాయి. విద్యారంగాన్ని అంతర్జాతీయీకరణ చేస్తారు. విదేశీ ప్రాంగణాల ఏర్పాటుకు అనుమతిస్తారు. సాధ్యమైనంత త్వరగా జీడీపీలో 6% నిధులు విద్యారంగానికి కేటాయిస్తారు. అనువాదాలు, భాషాంతరీకరణకు భారతీయ సంస్థను నెలకొల్పుతారు. అమెరికాలో నేషనల్ సైన్స్ ఫౌండేషన్ ఉన్నట్టుగా దేశంలో నేషనల్ రీసెర్చి ఫౌండేషన్ ఏర్పాటు మొదలైన అంశాలు కొత్త విధానంలో ఉన్నాయి. ✦

## సరిగ్గా అమలు చేస్తే పిల్లలందరికీ మెరుగైన భవిష్యత్తు: జేపీ




జాతీయ నూతన విద్యావిధానాన్ని సక్రమంగా అమలు చేస్తే మన దేశంలోని పిల్లలందరికీ మెరుగైన భవిష్యత్తు లభిస్తుందని ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. విద్యారంగంలో దశాబ్దాల వైఫల్యాలను, పొరపాట్లను గుర్తించే చిత్తశుద్ధి మొట్టమొదటిసారిగా ఇందులో కనిపించిందన్నారు. ఫలితాల్ని, పోటీ ప్రపంచంలో సమానావకాశాల్ని మెరుగుపరిచేలా రోడ్‌మ్యాప్‌ను అందించారన్నారు (జాతీయ విద్యావిధానం-2020 రూపకల్పనలో కస్తూరి రంగన్ కమిటీతో సుదీర్ఘంగా చర్చించటంతోపాటు ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా తరపున సంస్కరణల ప్రతిపాదనల్ని కూడా జేపీ అందజేశారు. కమిటీ కోరిక మేరకు ముసాయిదా ప్రతిని పరిశీలించి కొన్ని సూచనల్ని చేశారు). అందరినీ సంతృప్తి పరిచే ధోరణి వల్ల నూతన విద్యావిధానంలో కొన్ని మౌలిక పరిమితులు కనిపిస్తున్నా.. నిస్సందేహంగా ఇది ఏళ్ల తరబడి ఊగిసలాట తర్వాత ప్రభుత్వం ఆమోదించిన అద్భుత పాలసీ అని జేపీ స్వాగతించారు. పాఠశాలలో చేరాక ఐదారేళ్ల వరకు మాతృభాషలో బోధన అవసరమన్నారు. స్కూల్ కాంప్లెక్స్‌ల ఏర్పాటుతో ఉన్నంతలో వసతులు, నిపుణుల లభ్యతను పెంచటం, వృత్తి విద్యలను అభ్యసనంలో భాగం చేయటం వంటివి.. మంచి ఫలితాలనిస్తాయన్నారు. ఫెడరల్ స్ఫూర్తితో నూతన విద్యావిధానాన్ని చిత్తశుద్ధితో అమలు చేస్తే రెండు మూడేళ్లలో మొదలై పదేళ్ల నుంచి ఫలితాలు కనిపిస్తాయన్నారు. బడ్జెట్ సమస్యని అధిగమించి విద్యకు 6% నిధుల్ని కేటాయిస్తే మంచిదేనని, కానీ ఇప్పటికే కేటాయిస్తున్న 4.43% నిధుల్ని సద్వినియోగం చేయకపోవటం అసలు సమస్యన్నారు. విద్యారంగానికి అదనపు నిధుల కన్నా కూడా ప్రాథమ్యాల్ని మార్చటం, ఉన్న నిధుల్ని సద్వినియోగం చేయటం ప్రధానమని జేపీ స్పష్టం చేశారు.

# LOK SATTA

Cheerful people's movement for democratic governance reforms celebrates its Foundation Day

The meaning of Democracy is to make every Indian Citizen to fully realize and enjoy

ప్రజాస్వామ్య పీఠం
(ఎఫ్‌డీఆర్)
భావజాలానికి
రాజకీయ
ఉద్యమంగా
1997లో
ఆవిర్భవించిన
**లోక్‌సత్తా** సంస్థకు
వార్షికోత్సవ
శుభాకాంక్షలు



RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2018-2020 Published on 10th August, 2020 Posting Date 15 &16th of every month

# భారత 73వ స్వాతంత్ర్య దినోత్సవం..
# అయిదు లక్ష్యాల్ని సాధించే సమయం



"కొవిడ్-19 నేపథ్యంలో భారత స్వాతంత్ర్య దినోత్సవం మనందరి ముందు అయిదు లక్ష్యాలను ఉంచుతోంది. వీటి సాధనే దేశభక్తి, నవభారతానికి పునాది..

❖ జేబులో నుంచి రూపాయి ఖర్చు లేకుండా అందరికీ మంచి ప్రమాణాల ఆరోగ్యాన్నిచ్చే ప్రజారోగ్య వ్యవస్థ నిర్మాణం

❖ రైతుకి-వినియోగదారునికి లాభసాటిగా వ్యవసాయోత్పత్తుల సరఫరా గొలుసుల ఏర్పాటు

❖ 10లక్షల జనాభా దాటిన నగరాలలో సమర్థ స్థానిక పాలనా వ్యవస్థ - చిన్న పట్టణాల అభివృద్ధి

❖ ప్రజలకు ఉత్పాదక శక్తినిచ్చేలా సంక్షేమ పథకాల వ్యవస్థను పునర్నిర్మించటం

❖ డిజిటల్ విద్యాబోధనను పూర్తిస్థాయిలో వినియోగించుకుని ప్రతి బిడ్డకూ ప్రపంచస్థాయి ప్రమాణాల విద్యను అందించటం"

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,
ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు




**BOOK POST**
**PRINT MATTER**

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*Tulips Apartments, 6-3-655,*
*Flat.No. 407,*
*Behind civil supplies office,*
*Somajiguda,*
*Hyderabad - 500 082*

Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, Tulips Apartments, 6-3-655, Flat.No. 407, Behind civil supplies office, Somajiguda, Hyderabad - 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020